అనుదినం... జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
గురువారం 28-3-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 87
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50

### ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు
- రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు
- ఇది మానవాళికే విషాదకరం : బహిరంగ లేఖలో మేధావులు, విద్యావేత్తల ఆందోళన



3లో..

### ఉప్పల్‌లో సన్‌ఫైర్
- అభిషేక్, హెడ్, క్లాసెన్ ఊచకోత
- ముంబయి ఇండియన్స్‌పై ఘన విజయం
- హైదరాబాద్ 277/3, ముంబయి 246/5



వివరాలు ఆటలులో..

# బీజేపీపై పోరులో వామపక్షాలే కీలకం
## ఈసారి ఎన్నికల్లో మెరుగుపడతాం

'మత పోకడలను రెచ్చగొట్టడం ద్వారా ఉత్తరాది రాష్ట్రాల్లో భావోద్వేగాలను బీజేపీ రెచ్చగొట్టవచ్చు. కానీ దక్షిణాది రాష్ట్రాల్లో అది పనిచేయదని ఏచూరి పేర్కొన్నారు. దక్షిణాది సమాజాల్లో ఇది సాధ్యం కాదన్నారు. అందువల్ల వారు ఇక్కడ విజయం సాధిస్తారని భావించడం లేదన్నారు'

- గతం కంటే ఎక్కువ రాష్ట్రాల నుంచి గెలుస్తాం
- దక్షిణాదిన బీజేపీ పాగా వేయలేదు
- పీటీఐ ఇంటర్వ్యూలో పలు అంశాలపై సీతారాం ఏచూరి స్పష్టత



లోక్‌సభలో సంఖ్యాబలం తగ్గిందా పెరిగిందా అన్నదాంతో నిమిత్తం లేకుండా బీజేపీపై పోరుకు ఎజెండాను సెట్‌చేయడంలో వామపక్షాలు ఎప్పుడూ అగ్ర భాగాన వున్నాయని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. 370వ అధికరణ, సీఏఏ, వ్యవసాయ చట్టాలు, ఎన్నికల బాండ్లు ఇలా ప్రతి అంశంపైనా బీజేపీకి వ్యతిరేకంగా పోరు సల్పేందుకు సిద్ధంగా వున్నామని చెప్పారు. అలాగే రాబోయే ఎన్నికల్లో తమ సీట్ల సంఖ్య మెరుగుపరుచుకోగలమని ఆశిస్తున్నట్టు చెప్పారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏచూరి పలు అంశాలపై సవివరంగా తన అభిప్రాయాలు పంచుకున్నారు.

న్యూఢిల్లీ : సీట్ల పరంగా ఈసారి ఎన్నికల్లో వామపక్షాలు కచ్చితంగా తమ బలాన్ని మెరుగుపరుచుకుంటాయి. ఎన్ని సీట్లను గెలుచుకుంటాయనేది కాదు ముఖ్యం. ఎజెండాను రూపొందించడంలో ఎటువంటి పాత్ర పోషిస్తున్నాయన్నది ఇక్కడ కీలకం" అని ఏచూరి పేర్కొన్నారు. 'గత ఐదేండ్ల కాలాన్ని ఒక్కసారి పరిశీలించినట్లైతే, బీజేపీ తీసుకొచ్చిన విచ్ఛిన్నకరమైన లేదా రాజ్యాంగ విరుద్ధమైన ప్రతి అంశంపైనా వామపక్షాలు ఎజెండాను రూపొందిస్తూ వచ్చాయి. అదే సమయంలో ప్రజా పోరాటాలు నిర్వహించాయి." అని ఏచూరి తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వామపక్షాలు చేసిన పోరాటాలను ఉదహరించారు.

'370వ అధికరణ రద్దును వ్యతిరేకించింది మొట్టమొదటగా వామపక్షాలే. వాస్తవానికి, సుప్రీం కోర్టు అనుమతి, ఆదేశాలతో శ్రీనగర్‌ను మొట్టమొదట సందర్శించిన రాజకీయ నేత తానేనన్న విషయాన్ని ఏచూరి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

అలాగే, 370వ అధికరణ రద్దు తరువాత జమ్మూ కాశ్మీర్‌లో కర్ఫ్యూ విధించి, రాజకీయ నేతలను నిర్బంధించారు. ఆ ...3లో



## దిగువ కోర్టుల్లోనే కాదు.. హైకోర్టుల్లోనూ సౌకర్యాల కొరత

- కాలానికి తగ్గట్టు న్యాయవ్యవస్థలో మార్పులు : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై.చంద్రచూడ్
- తెలంగాణ నూతన హైకోర్టు నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

దిగువ కోర్టుల్లోనే కాకుండా.. హైకోర్టుల్లోనూ మౌలిక సదుపాయాల కొరత ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. రాజేంద్రనగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న తెలంగాణ నూతన హైకోర్టు భవన నిర్మాణానికి ...13లో

# 14 మందితో కాంగ్రెస్ 8వ జాబితా
## తెలంగాణలో నాలుగు స్థానాలకు ఖరారు

- ఆదిలాబాద్ (ఎస్టీ)- సుగుణకుమారి, నిజామాబాద్ - టి.జీవన్‌రెడ్డి, మెదక్- నీలం మధు, భువనగిరి- చామల కిరణ్‌కుమార్ రెడ్డి
- మిగిలిన నాలుగు స్థానాలపై 31న నిర్ణయం





నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ మరో నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఎనిమిదో జాబితాలో 14 మంది ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసింది. తెలంగాణాలో ఎనిమిది సీట్లు పెండింగ్‌లో ఉండగా నాలుగింటికి హైకమాండ్ ఓకే చెప్పింది. మిగిలిన నాలుగు స్థానాల అభ్యర్థులను గురువారం ప్రకటించే అవకాశాలున్నాయి. బుధవారం నాడిక్కడ ఏఐసీసీ కార్యాలయంలో మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశం జరిగింది. సమావేశంలో తెలంగాణ, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, గోవా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖరారుపై చర్చించారు. మొత్తం 17 లోక్‌సభ స్థానాలకు గానూ మొదటి రెండు జాబితాల్లో తొమ్మిది ...6లో

### నేడు కేజ్రీవాల్ గుట్టు విప్పుతారు..
- సతీమణి సునీత వెల్లడి
- ఢిల్లీ అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యేల నిరసనలు
- ఏప్రిల్ 1వరకు ఢిల్లీ అసెంబ్లీ వాయిదా
- ఢిల్లీ హైకోర్టులో కేజ్రీవాల్‌కు దక్కని ఊరట



13లో..

### ఎన్నికల వేళ.. దేశవ్యాప్తంగా ఈడీ దాడులు
- భారీగా పట్టుబడుతున్న నగదు..మద్యం



న్యూఢిల్లీ : ఎన్నికల కోడ్ అమలవుతోన్న వేళ ... భారీగా నగదు, మద్యం పట్టుబడుతోంది. దేశవ్యాప్తంగా పలు సంస్థలపై దాడులు నిర్వహించినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ముందస్తు సమాచారంతో క్యాపికర్నియన్ ...6లో

### కేసీఆర్, కేటీఆర్ జైలుకెళ్లాల్సిందే
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ జైలుకెళ్లాల్సిందేనని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ...13లో

### బాసగూడెం అడవుల్లో ఎదురుకాల్పులు
- ఇద్దరు మహిళా మావోయిస్టులతో సహా ఆరుగురు మృతి
- వివరాలు వెల్లడించిన బీజాపూర్ జిల్లా ఎస్పీ

వివరాలు 13లో





# గ్యారెంటీలు పోయి.. గారడీలు షురూ..
## రేవంత్ ఓ లీకు వీరుడు

- ఆయనకు పాలన చేత కావటం లేదు
- మాది పదేండ్ల నిజం- కాంగ్రెస్‌ది వంద రోజుల అబద్ధం
- హస్తానికి ఓటేస్తే కమలానికే లాభం : మల్కాజిగిరి లోక్‌సభ సమీక్షలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో ఆరు గ్యారెంటీలు పక్కకుపోయి, ఆరు గారడీలు షురూ అయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పాలన చేతగాకపోవటంతో సీఎం... లీకుల మీద ఆధారపడుతున్నారని ఎద్దేవా చేశారు. 'రేవంత్ ఓ లీకు వీరుడు...' అంటూ అభివర్ణించారు. బీఆర్ఎస్ పాలన అనేది పదేండ్ల నిజమైతే.. కాంగ్రెస్ ఏలుబడి వంద రోజుల అబద్ధమంటూ ఆయన వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేస్తే, అది అంతిమంగా కమలం పార్టీకే లబ్ధి చేకూరుస్తుందని హెచ్చరించారు. 'రానున్న ఎంపీ ఎన్నికలు పదేండ్ల నిజానికి, వంద రోజుల అబద్ధానికి, పదేండ్ల బీజేపీ విషపు పాలనకు మధ్య జరుగుతున్న పోటీ, అందువల్ల జాగ్రత్తగా ఆచి, తూచి ...6లో

**బీఆర్ఎస్‌కు రంజిత్‌రెడ్డి ద్రోహం : కేటీఆర్** 6లో

# అంతా వన్‌సైడేనా..?
## జర.. మా మాట కూడా వినండి సారూ...

- బీఆర్ఎస్ నేతల అంతరగం
- సమీక్షల సందర్భంగా తమ అభిప్రాయాలను తీసుకోవటం లేదంటూ ఆవేదన

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

'జర.. మా అభిప్రాయాలను కూడా పట్టించుకోండి సార్...మేం చెప్పే మాటల్ని కూడా వినండి, మా సూచనలు, సలహాలను స్వీకరించండి...' ఇదీ బీఆర్ఎస్ నేతల అంతరగం, ఆవేదన. లోక్‌సభ స్థానాల వారీగా చేస్తున్న సమీక్షా సమావేశాల సందర్భంగా అగ్రనేతల వ్యవహార్‌శైలిపై వారు అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీ స్థానాలపై హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సమీక్షా సమావేశాలను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ మీటింగులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఆయా నియోజకవర్గాల అభ్యర్థులు, ఇతర సీనియర్ నేతలు హాజరయ్యారు. అయితే సమీక్షా సమావేశాల్లో అసలు 'సమీక్షలే' ఉండటం లేదన్నది పలువురి లీడర్ల వాదన. 'ఒక ఎంపీ స్థానంపై సమీక్ష అంటే ఆ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మన పార్టీ బలాబలాలేంటి..? బలహీనతలేంటి..? గతంలో జరిగిన పొరపాట్లేంటి..? వాటిని ఇప్పుడు ఎలా అధిగమించాలి..? స్థానిక నేతల మధ్య సఖ్యత ఉందా? లేదా? లేకపోతే వారిని ఎలా సమన్వయం చేయాలి..? ప్రత్యర్థులు, వారి పార్టీల స్థితిగతులేంటి..? ఇలా అనేకాంశాలపై కింది స్థాయి నేతల అభిప్రాయాలను తెలుసుకోవాలి.. వాటిని నిర్దిష్టంగా, లోతుగా పరిశీలించి, ఒక నిర్ణయానికి రావాలి, వాటి ఆధారంగా క్యాడర్‌కు దిశా నిర్దేశం చేయాలి...' అని ఒక సీనియర్ నేత ఈ ...13లో





# ఎన్నికల తర్వాతే రుణమాఫీ
## బ్యాంకులతో ఇప్పటికే చర్చించిన సీఎం

- బీఆర్ఎస్ హయాంలో 14 లక్షల మంది రైతులకు అందని వైనం
- తప్పులు పునరావృతం కాకుండా సర్కార్ కసరత్తు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల తర్వాత రుణమాఫీపై సర్కార్ తుది నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఏక కాలంలో రూ.2లక్షలు మాఫీ చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.. రుణమాఫీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఫిబ్రవరి 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ మేరకు బ్యాంకర్లతో అధికారులు చర్చలు జరిపినప్పటికీ ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఎన్నికల అనంతరం ఇందుకు సంబంధించి విధి విధానాలను ప్రకటించే



అవకాశముందని తెలుస్తోంది.

2018 ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. లక్ష రుణ మాఫీ ఏక కాలంలో ప్రకటిస్తామని చెప్పి ఏకంగా ఐదేండ్ల పాటు సాగదీసింది. తొలి ఏడాది రూ.25 వేల వరకు, రెండో ఏడాది రూ.50 వేల వరకు, నాలుగో ఏడాది రూ.75 వేల వరకు, ఎన్నికల ముందు రూ.99,999 వరకు నాలుగు విడతలుగా రుణమాఫీని పూర్తి చేసింది. రాష్ట్రంలో మొత్తం 40.66 లక్షల మంది రైతులకు రూ. 25,916 కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా.. కుటుంబ సభ్యుల్లో ఒకరికి మాత్రమే వర్తిస్తుందని కొర్రీ పెట్టి లబ్ధిదారుల సంఖ్యను కుదించింది. దీంతో 36.68 లక్షల మంది రైతులకు రూ.20,141 కోట్లు మాఫీ చేయాలని బ్యాంకర్లు లెక్కలు తేల్చారు. అయిదేండ్ల పాటు వంతుల వారీగా రుణమాఫీ ...13లో

బిజినెస్

## సౌనాఫితో డాక్టర్ రెడ్డీస్ కీలక భాగస్వామ్యం

హైదరాబాద్ : సానొఫి హెల్త్‌కేర్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ (ఎస్‌హెచ్‌ఐపిఎల్)తో డాక్టర్ రెడ్డీస్ కీలక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా తన సొనాఫీ వ్యాక్సిన్ బ్రాండ్లను డాక్టర్ రెడ్డీస్ సరఫరా చేయనుంది. సొనాఫికి చెందిన పెడియాట్రిక్, పెద్దల వ్యాక్సిన్లు అయినా హెక్సాజిమ్, పెంటాక్సిమ్, టెట్రాక్సిమ్, మెనాక్ట్రా, ఫ్లూక్వాడ్రి, అడాసెల్, అవక్సిమ్80యు తదితర వ్యాక్సిన్లకు రెడ్డీస్ ప్రచారం కల్పించడంతో పాటుగా సరఫరా చేయనుంది. దీంతో దేశంలోనే అతిపెద్ద వ్యాక్సిన్ కంపెనీగా నిలువాలని భావిస్తోంది. ఈ బ్రాండ్ల మొత్తం అమ్మకాల విలువ రూ.426 కోట్లుగా ఉంది. సొనాఫి దిగుమతి చేసుకుని భారత్‌లో విక్రయి స్తోంది. ఈ అవకాశం తమకు గొప్ప అవకాశంతో పాటు సంతోషాన్ని ఇస్తుం దని డాక్టర్ రెడ్డీస్ బ్రాండెడ్ మార్కెట్స్ సిఇఒ ఎంవి రమణ పేర్కొన్నారు.

## ఎస్‌బీఐ డెబిట్ కార్డు చార్జీల పెంపు

ముంబయి : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) డెబిట్ కార్డుల వార్షిక నిర్వహణ చార్జీలను పెంచింది. గరిష్టంగా రూ.75 వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కొత్త ఛార్జీలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయని ఎస్‌బీఐ తన వెబ్‌సైట్‌లో ఖాతాదారులకు స్పష్టం చేసింది. ప్రస్తుతం క్లాసిక్, గ్లోబల్, కాంటాక్ట్‌లెస్ డెబిట్ కార్డులపై బ్యాంకు జీఎస్టీ మినహా రూ.125 వసూలు చేస్తోండగా.. దీన్ని రూ.200కు పెంచింది. యువ, గోల్డ్, కాంబో కార్డులపై ఇప్పుడు రూ.175 చార్జీ ఉండగా.. దాన్ని రూ.250కు చేర్చింది. అలాగే ప్లాటినం డెబిట్ కార్డు చార్జీని రూ.250 నుంచి రూ.325కు సవరించింది. ప్రైడ్, ప్రీమియం బిజినెస్ కార్డుపై ప్రస్తుతం రూ.350 చార్జీ ఉండగా.. దాన్ని రూ.425కు చేర్చింది.

## ఐకార్ -ఐఐఆర్‌ఆర్‌కు రూ.4.5 కోట్ల మద్దతు

- మంచికళలు ఎన్‌జిఒకు సాయం
- అందించిన ఎస్‌బీఐ ఎండీ చల్లా శ్రీనివాసులు




హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్)ను కొనసాగిస్తోంది. బుధవారం హైదరాబాద్‌కు అధికారిక పర్యాటనకు వచ్చిన ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ (ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్ అండ్ టెక్నాలజీ) చల్లా శ్రీనివాసులు శెట్టి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కోటిలోని లోకల్ హెడ్ ఆఫీసులో ఐకార్-ఐఐఆర్‌ఆర్‌తో జరిగిన ఎస్‌బిఐ ఫౌండేషన్ ఒప్పందానికి హాజరయ్యారు. సికింద్రాబాద్‌లోని మారేడుపల్లిలో అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించే 'మంచికళలు' ఎన్‌జీఓకు టాటా వింగర్ మినిబస్‌ను అందించారు. మంచికళలు ఫౌండర్ ప్రెసిడెంట్ శరత్ కుమార్ పుప్పలకు వాహన తాళం చెవులను బహూకరించారు.

"శరత్ కుమార్ సేవలు ప్రశంసనీయం. కార్పొరేట్ సామాజిక సేవ కోసం చెక్కులు రాయడం సులభమే.. కానీ సరైనా ఎన్‌జిఓను గుర్తించి సాయం చేయడమే క్లిష్టమైన అంశం. ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా అడవి ప్రాంతాల్లోని 112 జిల్లాల్లో మొబైల్ హాస్పిటళ్లను ఏర్పాటు చేయాలనేది మా సంకల్పం." అని సిఎస్ శెట్టి అన్నారు. ఐకార్-ఐఐఆర్‌ఆర్‌కు ప్రామోషన్ ఆఫ్ డైరెక్ట్ సీడెడ్ రైస్ (డిఎస్‌ఆర్) కోసం ఏకంగా రూ.4.5 కోట్ల విలువ చేసే చెక్కును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేష్ కుమార్, ఎస్‌జీఐ పౌండేషన్ ఎండీ సంజయ్ ప్రకాష్, ఉన్నతాధికారులు మంజూ శర్మ దేబాశిష్ మిశ్రా, విద్యా రాజా, వి ప్రేమ్‌జీ తదితరులు హాజరయ్యారు.

## బిసిఎస్‌కు అరుదైన గుర్తింపు

హైదరాబాద్ : ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ బ్లూ క్లౌడ్ సాఫ్‌టెక్ సొల్యూషన్స్ లిమిటెడ్ (బిసిఎస్)కు అరుదైన గుర్తింపు లభించినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం, సైబర్ సెక్యూరిటీ సిఇఒ-డిజిటల్ సిగ్నేచర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో ఇండో డచ్ సైబర్ సెక్యూరిటీ స్కూల్ (ఐడిసిఎస్ఎస్) నిర్వహించిన ఆపరేషనల్ థ్రెట్స్, ఇంటర్నేషనల్ సైబర్ సెక్యూరిటీ ఎటాక్ వెక్టర్స్ ఛాలెంజ్‌ని విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించినట్లు బ్లూ క్లౌడ్ సాఫ్‌టెక్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జానకి యార్లగడ్డ తెలిపారు. 2028 నాటికి సైబర్ సెక్యూరిటీ మార్కెట్ ప్రతీ ఏడాది సగటున 10.56 శాతం వృద్ధితో 273 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేశారు.

## కామధేను ఉత్పత్తి సామర్థ్యం పెంపు

హైదరాబాద్ : తెలంగాణ మార్కెట్‌లో తమ సంస్థ మెరుగైన ప్రగతిని కనబర్చిందని కామదేను లిమిటెడ్ తెలిపింది. ఐరన్ టిఎంటి బార్స్‌ను ఉత్పత్తిని విస్తరిస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో 20 శాతం వృద్ధితో 2,65,00 మెట్రిక్ టన్నుల బార్‌లను ఉత్పత్తి చేయగా.. గతేడాది ఇదే నెలలో 2,25,000 ఉత్పత్తి జరిగిందని పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి 40వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నామని కామదేను లిమిటెడ్ డైరెక్టర్ సునీల్ అగర్వాల్ తెలిపారు. ప్రస్తుతం 400 మంది డీలర్లు ఉన్నారని.. వచ్చే ఏడాది కల్లా మరో 50 మందిని జోడించుకోవాలని నిర్ధేశించుకున్నామన్నారు.

## విదేశీ విద్యకు స్టార్టప్ ప్రొపెల్డ్ రుణాలు

హైదరాబాద్ : దేశీయ మార్కెట్ ఎడ్యుకేషన్ లెండింగ్ ఫిన్‌టెక్ స్టార్టప్ అయినా ప్రొపెల్డ్ దేశంలోని మెట్రో నగరాలు సహా ద్వితీయ, తృతీయ శ్రేణీ నగరాల్లోని విద్యార్థులకు విదేశీ విద్యా రుణాలు అందిస్తున్నట్లు తెలిపింది. విద్యార్థుల, తల్లిదండ్రుల క్రెడిట్ యోగ్యతకు అనుగుణంగా ప్రత్యేకమైన పూచీకత్తు విధానం ద్వారా గరిష్టంగా 10 సంవత్సరాల పాటు విదేశాలకు వెళ్లే అర్హతగల విద్యార్థులకు రూ.50 లక్షల వరకు రుణాలు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. అదే విధంగా స్వయం ఉపాధి పొందిన వ్యక్తులకు కూడా మద్దతును అందించున్నట్లు ప్రొపెల్డ్ కో ఫౌండర్ బ్రిజేష్ సామంతరాయ్ తెలిపారు.

## ప్రజల కష్టాలు, కన్నీళ్లను కవులు రాయాలి

- కార్డినల్ బిషప్ పూల ఆంథోని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజల కష్టాలు, కన్నీళ్లను తమ రచనల ద్వారా కవులు ప్రపంచానికి చాటాలని ఆర్చ్ డయాసిస్ ఆఫ్ హైదరాబాద్ కార్డినల్ బిషప్ ఆంథోని పూల పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని బిషప్ హౌస్‌లో ఆయన్ను గుంటూరు ఏసీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కనపాల జోసఫ్ కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన నందిని సిధారెడ్డి కవిత్వం - పరిశీలనపై జోసఫ్ రాసిన పుస్తకాన్ని బిషప్ ఆంథోని పూల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం పట్ల వ్యవహరించాల్సిన తీరును బాల్యం నుంచే నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కనపాల జోసఫ్, బిషప్ కనపాల కిరణ్, క్రిస్టియన్ నేత రాబర్ట్ బ్రూస్లీ, టీపీసీసీ నేత దుర్గం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐబీలో వారిదే హవా

- 15 మందికి పైగా రిటైర్డ్ అధికారుల పెత్తనం
- ఫోన్‌ట్యాపింగ్‌లో వీరి పాత్ర పైనా స్పెషల్ టీమ్ ఆరా
- ముగ్గురు అధికారుల పోలీసు కస్టడీపై తీర్పు రిజర్వ్



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

యాంటీ నక్సలైట్ నిఘా ఆపరేషన్‌లో రాష్ట్రమేగాక మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన రాష్ట్ర స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎస్ఐబీ)కి ఫోన్‌ట్యాపింగ్ మరక అంటుకున్నది. ఈ వ్యవహారంపై రాష్ట్రంలోనేగాక ఇతర రాష్ట్రాల పోలీసు విభాగాలలో సైతం చర్చకు దారి తీసింది. ముఖ్యంగా, నిషేధిత పీపుల్స్‌వార్ మొదలుకొని మావోయిస్టు గ్రూపుల వరకు వారి కార్యకలాపాలను కనిపెట్టి కఠినంగా అణచివేయటంలో రాష్ట్ర ఎస్ఐబీ చూపిన చొరవ, తెగువ, ఎత్తుగడలు జాతీయ స్థాయిలో పలుమార్లు ప్రశంసలు అందుకున్నది. ఒకవిధంగా చెప్పాలంటే.. దేశంలోనే తొమ్మిది మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలకు వారి కార్యకలాపాలను అణచివేయటంలో రాష్ట్ర ఎస్ఐబీ పలు సందర్భాల్లో ఇచ్చిన కీలక సమాచారం మంచి ఫలితాలనిచ్చింది. అనేక సందర్భాల్లో రాష్ట్ర ఎస్ఐబీ పోలీసులు కూడా దండకారణ్యం పరివాహక ప్రాంతాల్లో జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో పాల్గొని కీలకమైన నాయకులను ఏరివేయటంలో చురుకుగా వ్యవహరించారు. ఇలాంటి విభాగంలో 2014 నుంచి 2024 వరకు కొత్త మార్పులు చోటు చేసుకున్నాయి. మావోయిస్టు కార్యకలాపాల నిరోధంతో పాటు అధికారంలో ఉన్నవారి రాజకీయ ప్రత్యర్థుల వ్యూహాలను కూడా పసిగట్టేలా ఈ విభాగంలోని కొందరు అధికారుల చర్యలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా, ఈ విభాగానికి ఐజీగా వచ్చి, రిటైరైన తర్వాత కూడా పదవీ కాలం పొడగింపును పొందుతూ బాస్‌గా వ్యవహరించిన ఓఎస్డీ ప్రభాకర్‌రావు నేతృత్వంలో కార్యకలాపాలు చాలా వరకు పక్కదోవ పట్టాయనే ఆరోపణలున్నాయి. మావోయిస్టులు, ఉగ్రవాదుల కదలికలను కనిపెట్టి, నిరోధించటానికి ఉపయోగించే కీలకమైన ఫోన్ ట్యాపింగ్ ఆధునిక సాధనాలను కేంద్ర ప్రభుత్వ అనుమతితో ఎస్ఐబీ వారు నిర్విఘ్నంగా ఉపయోగించుకునేవారు. అయితే, పొలిటికల్ బాస్‌లను తృప్తి పర్చటానికి వారి వైరి పక్షాల సమాచారాన్ని కనుక్కోని, ఇవ్వటంలోనూ ఈ పరికరాలను అక్రమంగా ఉపయోగించుకోవటంలోనూ ఎస్ఐబీకి చెందిన కొందరు అధికారులు ఆసక్తి చూపించటం ప్రారంభించారు. ఇందుకోసం, కొందరు అధికారులను ప్రత్యేకంగా ఎంపిక చేసుకొని వారిని తన టీమ్‌గా మార్చుకొని మరీ రహస్య ఆపరేషన్లను ప్రభాకర్‌రావు సాగించారని ఆరోపణలున్నాయి. ఈ విభాగంలో లేని విధంగా ఎస్ఐబీలోనే కొందరు రిటైరైన పోలీసు అధికారులను కూడా కొనసాగిస్తూ వారిచేత ఈ పొలిటికల్ ఆపరేషన్లను నిర్విఘ్నంగా సాగించారని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. ఇందులో, ప్రభాకర్‌రావేగాక ఒక రిటైర్డ్ డీఐజీ, ఇద్దరు రిటైర్డ్ ఎస్పీలు, నలుగురు రిటైర్డ్ అదనపు ఎస్పీలు, కొందరు డీఎస్పీలు, సీఐలు కలిపి మొత్తం 15 మందికి పైగా రిటైర్డ్ అధికారులతో తమ రహస్య ఫోన్ ట్యాపింగ్ ఆపరేషన్లను ప్రభాకర్‌రావు సాగించినట్టు స్పెషల్ టీమ్ అధికారులు అనుమానిస్తున్నారు.

ఈ రిటైర్డ్ అధికారుల్లో ఒకరిద్దరు మాత్రం పొలిటికల్ బాస్‌ల ఆదేశాలు పాటించటం ఇష్టపడక మధ్యలోనే తప్పుకున్నారని తెలుస్తున్నది. దీంతో తాజాగా, బయటపడిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో సదరు రిటైర్డ్ అధికారుల పాత్రనూ తేల్చటానికి పంజాగుట్ట స్పెషల్ టీం అధికారులు నడుం బిగించారని తెలిసింది. వారికి నోటీసులను కూడా పంపివ్వటానికి సన్నాహాలు చేస్తున్నారు. తదుపరి దర్యాప్తులో భాగంగా అరెస్టయిన అధికారులు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్నలను పోలీసు కస్టడీకిచ్చే అంశంపై నాంపల్లికోర్టులో బుధవారం వాదనలు ముగిశాయి. దీనిపై తీర్పును న్యాయమూర్తి రిజర్వ్ చేశారు.

## డ్రగ్స్ నిర్మూలనకు మరింత కఠినంగా వ్యవహరించాలి

- స్టూడెంట్ పోలీస్ క్యాడెట్ ప్రాజెక్టను అమలు చేయాలి : ఆకుల సంజయ్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డ్రగ్స్ నిర్మూలనకు మరింత కఠినంగా వ్యవహరించాలని తెలంగాణ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ మాజీ అధ్యక్షులు ఆకుల సంజయ్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల ఆయన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దగ్గు, నొప్పి నివాణ, డిప్రెషన్, మానసిక రుగ్మతలకు ఉపయోగించే కొన్ని రకాల మాత్రలు, ఇంజెక్షన్లు వైద్యుడి ప్రిస్క్రిప్షన్ మేరకు మాత్రమే మెడికల్ షాప్స్‌లో పేషెంట్లకు ఇచ్చేలా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

ది డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940, రూల్స్ 1945లో సెక్షన్ 65(2) ప్రకారం ఔషధాలను రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్, వైద్యుడి ప్రిస్క్రిప్షన్‌పై రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ ద్వారా లేదా రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ పర్యవేక్షణలో మాత్రమే ప్రజలకు అందించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. సెక్షన్ 65(4) ప్రకారం... మెడికల్ షాపు యజమాని విక్రయానికి ఉద్దేశించిన ఔషధ కొనుగోలు రికార్డుల్లో కొనుగోలు తేదీ, కొనుగోలు చేసిన వ్యక్తి పేరు, చిరునామా, అతని వద్ద ఉన్న సంబంధిత లైసెన్స్ సంఖ్య, ఔషధం పేరు, పరిమాణం, బ్యాచ్



సంఖ్య, ఔషధ తయారీదారు పేరు, నగదు లేదా క్రెడిట్ మెమోలతో సహా కొనుగోలు బిల్లులు తదితర వివరాలు ఉండాలని తెలిపారు. సెక్షన్ 65(9) ప్రకారం షెడ్యూల్ హెచ్, హెచ్1 లేదా షెడ్యూల్ ఎక్స్‌లో పేర్కొన్న మందులు రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ ప్రిస్క్రిప్షన్‌పై రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ ద్వారా మాత్రమే ప్రజలకు అందించాలని సూచించారు. వీటిలో దగ్గు, యాంటీయాటిక్స్, బీపీ, షుగర్ మాత్రలు, నొప్పి నివాణ, డిప్రెషన్, మానసిక రుగ్మతలకు ఉపయోగించే, ఆపరేషన్ సమయంలో మత్తు కోసం ఉపయోగించే ఇంజెక్షన్లు కొన్ని రకాల మాత్రలు) ఉన్నాయని పేర్కొన్నారు. ప్రిస్క్రిప్షన్లు జిరాక్స్ కాపీని మెడికల్ షాప్ లైసెన్సు దారు, ఫార్మసిస్ట్ రెండు సంవత్సరాల పాటు భద్ర పరచాలని చెప్పారు. రాష్ట్రంలో పాఠశాల, కళాశాల స్థాయిలో స్టూడెంట్ పోలీస్ క్యాడెట్ ప్రాజెక్టని అమలు చేయాలని సంజయ్ రెడ్డి సూచించారు.

## ఢిల్లీలో ఆప్‌పై, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌పై పోరాటం

- మధుయాష్కీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఢిల్లీలో అక్కడి ఆమ్ ఆద్మీ పార్టీపై, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌పై పోరాటం చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కీ తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి రాష్ట్ర శాఖలు పని చేస్తాయని చెప్పారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై విచారణను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించలేదనీ, కేవలం ఎన్నికలకు ముందు అరెస్టు చేయడాన్ని మాత్రమే తప్పుపట్టిందని స్పష్టం చేశారు. లిక్కర్ కేసుకు సంబంధించి కల్వకుంట్ల కవిత ఫేక్ కేసు పెట్టారంటున్నారే తప్ప తాను నేరం చేయలేదని చెప్పడం లేదని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి అధికారుల విచారణ తర్వాత కేసీఆర్, కేటీఆర్‌లు ఏ1, ఏ2లుగా ఉండే అకాశముందని చెప్పారు. కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలు అనేక రంగాల్లో మరింత వెనుకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారుతెలంగాణ బీసీకి ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రాధాన్యత నిచ్చారనీ, రాజ్యసభ సీటు ఇచ్చారని కొని యాడారు. బీఆర్‌ఎస్ ఆరిపోయే దీపమనీ, కేటీఆర్‌కు ముందు న్నది ముసళ్ల పండుగ అని హెచ్చరించారు.తనను భువనగిరి ఎంపీగా పోటీ చేయాలని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కోరితే తనకు ఇష్టం లేదని చెప్పినట్టు మధుయాష్కీ తెలిపారు.

## మళ్లీ మోసం చేయాలని చూస్తున్న సీఎం రేవంత్

- బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోసం చేసినట్టుగానే లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజలను మోసం చేయాలని సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. బుధవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ మీడియా సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అబద్ధాలాడుతున్నారని విమర్శించారు. రైతుబంధు అందరికి రాలేదనీ, నిరుద్యోగ భృతిపై మాట మార్చారనీ, 20 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోతే పట్టించుకోకుండా బీఆర్ఎస్‌పై ఎదురుదాడి చేస్తున్నారని తెలిపారు. మంత్రి జూపల్లి మాట మార్చారనీ, గతంలో కేసీఆర్ మహబూబ్ నగర్ కరువును శాశ్వతంగా రూపుమాపారని పొగిడారని గుర్తుచేశారు. పాలమూరు జిల్లాపై చర్చించేందుకు తాము సిద్ధమని స్పష్టం చేశారు.

## ఉపాధిహామీ వేతనం పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధి హామీ వేతనాన్ని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ వేతనం రూ.272 ఉండగా, ఈ ఏడాదికి దాన్ని గాను రూ.300లకు పెంచారు. ఈ వేతన పెరుగుదల ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలకు వర్తించనుంది. దేశంలో అత్యధికంగా హర్యానా, సిక్కిం రాష్ట్రాల్లో రూ.374, అత్యల్పంగా నాగాలాండ్‌లో రూ. 234గా ఈ వేతనముంది.

## చెక్కుల చోరీతో సంబంధం లేదు : మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చెక్కుల కాజేసిన కేసుతో తమకు ఎలాంటి సంబంధం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రిగా ఉన్న సమయంలో నరేష్ అనే వ్యక్తి తన ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్‌గా, తాత్కాలిక ఉద్యోగిగా పని చేశారని పేర్కొన్నారు. మంత్రిగా తన పదవీ కాలం పూర్తయిన తర్వాత కార్యాలయంలో ఉన్న కొన్ని చెక్కులను దొంగిలించిన అతడు...వాటిని వెంట తీసుకువెళ్లినట్లు తమ దృష్టికి రాగా, వెంటనే స్పందించి, నరేష్‌పై 17-12-2023 నాడు, నార్సింగి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. జరిగిన విషయాన్ని కొంత మంది పక్కదోవ పట్టిస్తున్నారని ఆయన ఆక్షేపించారు. తనకు ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

## మల్కాజిగిరిలో ఘన విజయం సాధించాలి : సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మల్కాజిగిరిలో మరోసారి ఘన విజయం సాధించి, బీఆర్ఎస్, బీజేపీల అడ్రస్ గల్లంతు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని రేవంత్ రెడ్డి నివాసంలో బీఆర్ఎస్, టీడీపీ, పీఆర్పీ పార్టీ, కమ్మ సంఘం నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో 2009 ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గం నుండి టిడిపి తరపున పోటీ చేసిన కృష్ణప్రసాద్ తెలంగాణ కమ్మ సంఘం నాయకులు బీ.రవిశంకర్, అరికెపూడి ప్రసాద్ (మేడ్చల్) బోడు వెంకటేష్ యాదవ్ (కుత్బుల్లాపూర్), మాజీ కార్పొరేటర్లు శాలిని, పావని రెడ్డి, రమణారెడ్డి, మాజీ ఎంపీపీ సి.దేవేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 1 నుంచి ఎక్సైజ్ కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో కొత్తగా ఎంపికైన ఎక్సైజ్ కానిస్టేబుళ్ల శిక్షణను ఏప్రిల్ 1 నుంచి ప్రారంభించటానికి ఆ విభాగం అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. మొత్తం 614 మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్ల పోస్టులకు గానూ 555 మంది ఎంపికయ్యారు. వీరికి మార్చి 14న నియామక పత్రాలను కూడా అందజేశారు. వీరిని ఏప్రిల్ 13లోగా జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. అయితే, ఇప్పటి వరకు 395 మంది అభ్యర్థులు తమ జాయినింగ్ రిపోర్ట్‌ను ఇచ్చారని అధికారులు తెలిపారు. కాగా, సివిల్, ఏఆర్, టీఎస్ఎస్పీ, ఎస్పీఎఫ్, ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లతో పాటు ఎక్సైజ్ కానిస్టేబుళ్ల నియామకం జరిగినప్పటికీ.. వారిని ట్రైనింగ్‌కు పంపకుండా జాప్యం చేస్తున్నారంటూ ఎంపికైన అభ్యర్థులలో ఆందోళన వ్యక్తమైంది. ట్రైనింగ్‌కు పంపివ్వడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారో కారణాలు తెలియక అభ్యర్థులు చాలా వరకు అసంతృప్తికి లోనయ్యారు. అయితే, జాప్యానికి ఎలాంటి కారణం లేదనీ, ముఖ్యంగా ఎంపికైన అభ్యర్థులందరికీ ఏప్రిల్ 13 నాటికి అభ్యర్థులందరూ జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలని కోరటం జరిగిందనీ, కానీ వారిలో చాలా మంది ఇంకా జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వలేదని అధికారిక వర్గాలు తెలిపాయి.

## టెట్ రాయడానికి అనుమతి అవసరం లేదు : విద్యాశాఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ టీచర్లు టెట్ రాయాలంటే ముందస్తు అనుమతి పొందాల్సిన అసవరం లేదని బుధవారం ఒక ప్రకటనలో విద్యాశాఖ స్పష్టంచేసింది. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ స్పష్టత ఇచ్చారు. టెట్ రాయాలనుకునే ఉపాధ్యాయులు ముందస్తుగా విద్యాశాఖ అనుమతి తీసుకోవాలని నిన్నటి నుంచి వార్తలు వస్తున్నాయనీ, ఈ వార్త ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో అయోమయానికి దారితీసిందని తెలిపారు. విద్యాశాఖ ఆ రకమైన ఆదేశాలు జారీ చేసిందా? ఒట్టి పుకారేనా టీచర్లు తేల్చుకోలేక పోయారని పేర్కొన్నారు. ఈ క్రమంలో విద్యాశాఖ స్పష్టత ఇచ్చింది.

## అన్ని విధాలా అండగా ఉంటా

- సీఎం రేవంత్ రెడ్డి




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్ని విధాలుగా అండగా ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి వి.హనుమంతారావు సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివా సంలో కలుసుకున్నారు.ఇటీవల మీడియా ముందు వి.హనుమంతరావు అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.ఎంపీ టికెట్ తనకు ఇచ్చే అవ కాశం లేదని వీహెచ్ కొన్ని రోజులుగా అలకబూని పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

# ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు

## • రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు • ఇది మానవాళికే విషాదకరం




**న్యూఢిల్లీ :** దేశంలో ప్రజాస్వామిక సంప్రదాయాలను కాలరాస్తు న్నారని పలువురు మేధావులు, విద్యా వేత్తలు, రచయితలు ఆందోళన వ్యక్తం చేశారు. అనేకమంది రచయితలు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలను ఎలాంటి విచారణ లేకుండా దీర్ఘకాలం నిర్బంధించడం, వారిపై చార్జిషీటు దాఖలు చేయకపోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేయడమే అవుతుందని చెప్పారు. ఈ మేరకు వారు ఓ బహిరంగ లేఖ రాశారు.

ఈ బహిరంగ లేఖకు నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ విడిగా ఓ లేఖను జత చేశారు. న్యూస్‌క్లిక్ ఎడిటర్-ఇన్ చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థ నిర్బంధంతో పాటు భీమా కోరేగావ్ కేసులో, ఢిల్లీ మత హింస కేసులో హక్కుల కార్యకర్తలను నిర్బంధించడాన్ని ఆయన ప్రస్తావించారు. 'చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టానికి చేసిన సవరణలను అడ్డు పెట్టుకొని ఎలాంటి విచారణ జరపకుండా వీరందరినీ చాలా కాలం నుంచి నిర్బంధంలో ఉంచారు. ఈ సవరణలకు చట్టసభ మద్దతు ఉన్నదని చెబుతున్నారు. అయితే ఇలాంటి నిర్బంధాలను చట్టసభలు సమర్థించడం లేదు' అని వారు ఆ బహిరంగ లేఖలో వివరించారు. దీనిపై అమర్త్యసేన్‌తో పాటు రచయిత అమితావ ఘోష్, వెండీ బ్రౌన్, గాయత్రి చక్రవర్తి స్పివాక్, మార్తా సి నుసాబమ్ తదితరులు సంతకాలు చేశారు.

ప్రజాస్వామ్యానికి ఓ గొప్ప ఉదాహరణగా భారత్‌ను అంతర్జాతీయ సమాజం ప్రశంసిస్తోంది. అలాంటి ప్రజాస్వామ్యాన్ని కాలరాయడం విషాదకరం. భారత ప్రజలకే కాదు... మొత్తం మానవాళికి కూడా. దేశంలో చోటుచేసుకుంటున్న ఇలాంటి ఆందోళనకరమైన పరిణామాలపై అంతర్జాతీయ సమాజాన్ని అప్రమత్తం చేయడానికి ఈ లేఖ రాస్తున్నాము. ప్రభుత్వంలో వివిధ విభాగాలలో బాధ్యతాయుతమైన పదవులు నిర్వర్తిస్తున్న వారు...ముఖ్యంగా న్యాయ వ్యవస్థలో ఉన్న వారు ఇలాంటి వాటిని నిలువరించాల్సిన అవసరం ఉంది. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలగకుండా చూడాల్సి ఉంది' అని వారు ఆ లేఖలో కోరారు.

విడిగా రాసిన లేఖలో అమర్త్యసేన్ పలు అంశాలను ప్రస్తావించారు. బ్రిటీష్ పాలనలో విచారణలు జరపకుండా ప్రజలను దీర్ఘకాలం పాటు నిర్బంధించే వారని ఆయన గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో ఇలాంటివి ఆగిపోతాయని తాను భావించానని, కానీ అలా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన స్వదేశంలో మానవ స్వేచ్ఛకు విఘాతం కలగడం కలచివేస్తోందని అమర్త్యసేన్ తెలిపారు.



# వామపక్ష అభ్యర్థులను గెలిపించండి

- మోడీ మరోసారి పీఎం అయితే ఉపాధి హామీ, ప్రజాపంపిణీ వ్యవస్థ రద్దు
- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ పార్టీ అభ్యర్థులను ఓడించాలనీ, వామపక్ష అభ్యర్థుల గెలుపునకు వ్యవసాయ కార్మికులందరూ పని చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మరోమారు ఎన్డీఏ సర్కారు అధికారంలోకొస్తే గ్రామీణ ఉపాధి హామీ చట్టం, ప్రజా పంపిణీ వ్యవస్థలను రద్దు చేస్తుందని హెచ్చరించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఉపాధి హామీ చట్టానికి క్రమంగా నిధులు తగ్గిస్తూ పోతున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు కేటాయించే నిధుల్లోనూ భారీగా కోత విధించిందని చెప్పారు. దేశంలో కోట్లాదిమంది పేదలు పనిలేక, తిండి దొరక్క వలస బాటపడుతున్నారనీ, అదే సమయంలో సంపద ఒక్క శాతం మంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతమవుతోన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున ఆహార సంక్షోభం దేశాన్ని చుట్టుముట్టిందని తెలిపారు. నిత్యావసర సరుకులైన గ్యాస్, కూరగాయలు పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయనీ, వాటిని కంట్రోల్ చేయకుండా ప్రభుత్వం గుడ్లప్పగించి చూస్తున్నదని విమర్శించారు. ప్రతిఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, రెండు కోట్ల ఇండ్ల నిర్మాణం, పేదల అకౌంట్లలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి మోడీ ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్ బి.పద్మ, నారి ఐలయ్య, పొన్నం వెంకటేశ్వరావు, పెద్ది వెంకట్రాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఆవుల వీరన్న, లంక రాఘవులు, కందుకూరి జగన్, మొలకలపల్లి రాములు, మేకల ఆంజనేయులు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధిని పెంచి చూపడం తప్పు

- ప్రధాని మోడీ లక్ష్యం నెరవేరదు..!
- కొత్త ప్రభుత్వానికి సవాళ్లే..
- భారత్‌లో వియత్నాం కంటే తక్కువ అక్షరాస్యత
- చిప్‌ల రాయితీల కంటే ఉన్నత విద్యపై వ్యయం తక్కువ
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్

**న్యూఢిల్లీ :** భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యం నెరవేరకపోవచ్చని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. మోడీ ఆశయాన్ని ఆయన కొట్టిపారేశారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల్లో డ్రాప్‌అవుట్ శాతం అధికంగా ఉండి.. చాలా మందికి హైస్కూల్ విద్య లేకపోతే ఆ ఆశయం గురించి మాట్లాడటమే వ్యర్థమన్నారు. భారత్‌లో అక్షరాస్యత శాతం వియత్నాం వంటి ఇతర ఆసియా దేశాల కంటే తక్కువగా ఉందని గుర్తు చేశారు. రాజన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "ప్రభుత్వం వృద్ధి రేటును పెంచి చూపుతోంది. దేశం ఆ హైప్ (కృత్రిమ పెంపు)ను నమ్మడం అతిపెద్ద తప్పు. హైప్ నిజమని నిర్ధారించుకోవడానికి మనకు ఇంకా చాలా సంవత్సరాలు పట్టొచ్చు. దేశం ఆ సామర్థ్యాన్ని చేరుకోవడానికి గణనీయమైన నిర్మాణాత్మక సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం ఎదుర్కోవాల్సిన అతిపెద్ద సవాలు శ్రామిక శక్తి, నైపుణ్యాలను మెరుగు పరచడం. ఈ సవాలును పరిష్కరించ కుంటే యువత ప్రయోజనాలను కాపాడటంలో తీవ్ర కష్టాలు పడాల్సి వస్తుంది. దేశంలోని 140 కోట్ల జనాభాలో సగానికి పైగా 30 ఏండ్లలోపు యువతే ఉన్నారు." అని రాజన్ అన్నారు.

ప్రతీ ఏడాది స్థిరమైన 8 శాతం వృద్ధిని సాధించడానికి దేశం మరింత ఎక్కువ పని చేయాల్సి ఉందన్నారు. దేశంలో ఉన్నత విద్య కోసం కంటే చిప్‌ల తయారీకి రాయితీలపై ఎక్కువ ఖర్చు చేసేందుకు మోడీ ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయాలను రఘురామ్ రాజన్ తప్పుపట్టారు. భారత్‌లో సెమీకండక్టర్ కంపెనీలకు రాయితీల కింద సుమారు రూ. 76 వేల కోట్లు కేటాయించగా.. ఉన్నత విద్య కోసం రూ.47 వేల కోట్లనే కేటాయించడాన్ని ఆయన విమర్శించారు. "కరోనా తర్వాత భారతీయ పాఠశాల పిల్లల అభ్యాస సామర్థ్యం 2012 కంటే ముందు స్థాయికి పడిపోయింది. మూడో తరగతి విద్యార్థుల్లో 20.5 శాతం మంది పిల్లలు మాత్రమే రెండో తరగతి పాఠాన్ని చదవగలుగుతున్నారని అనేక రిపోర్టులు పేర్కొన్నాయని రాజన్ గుర్తు చేశారు. "మనకు పెరుగుతున్న శ్రామిక శక్తి ఉంది.. కానీ వారు మంచి ఉద్యోగాలలో ఉపాధి పొందితేనే అది డివిడెండ్. ముందుగా శ్రామిక శక్తిని మరింత ఉపాధి పొందేలా చేయాల్సిన అవసరం ఉంది. రెండవది నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించాలి." అని రాజన్ అన్నారు. భారతదేశ పాలక వ్యవస్థ చాలా కేంద్రీకృతమైందని.. రాష్ట్రాలకు నియంత్రణను అప్పగించడం ద్వారా అభివృద్ధిని మెరుగుపరచడంలో సహాయపడుతుందని సూచించారు.



## ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు

# ఐటీ మరో షాక్

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి కాంగ్రెస్‌కు ఆదాయపు పన్ను (ఐటీ) నుంచి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఐటీ నుంచి కాంగ్రెస్‌కు మరొక షాక్ తగిలింది. 2014-2021 మధ్య రూ.523.87 కోట్ల మేర 'లెక్కల్లో లేని లావాదేవీ'లను గుర్తించింది. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిపిన దాడుల్లోనే ఇది బయటపడటం గమనార్హం. ఇప్పటికే ఆ పార్టీ ఖాతాల నుంచి రూ.135 కోట్లను గత బకాయిల కింద ఐటీ అధికారులు విత్‌డ్రా చేసుకున్న విషయం విదితమే. ఇప్పుడు ఐటీ నుంచి 'లెక్కల్లో లేని లావాదేవీల'పై వార్తలు రావటం లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించే విషయమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. రూ.523.87 కోట్లకు ఐటీ శాఖ పెద్ద ఫైన్‌ను విధించొచ్చని కాంగ్రెస్ నాయకుడు, రాజ్యసభ ఎంపీ వి.కె టంఖా అన్నారు.



# ట్యాంకర్ నీరే వరికి ఊపిరి..

**నవతెలంగాణ - చందుర్తి**

వేసవిలో భూగర్భజలాలు అడుగంటడంతో అన్నదాతకు నీటి కష్టాలను తెచ్చి పెట్టింది. చేతికి అందొచ్చిన పంట కండ్లముందు ఎండిపోతుంటే చూడలేని రైతులు బతికించుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేటకు చెందిన రైతు కంటె రెడ్డి వరి చేనుకు ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీరు పారిస్తున్నాడు.



# బీజేపీని ఓడించడమే సామాజిక శక్తుల కర్తవ్యం

## పదేండ్లలో దళితులపై పెరిగిన దాడులు

- కేవీపీఎస్ రౌండ్ టేబుల్ సమావేశంలో
- ప్రముఖ అంబేద్కర్‌వాది జేబీ రాజు

**నవతెలంగాణ - ముషీరాబాద్**

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించడమే సామాజిక శక్తుల కర్తవ్యమని ప్రముఖ అంబేద్కర్‌వాది రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జేబి రాజు అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో "సార్వత్రిక ఎన్నికలు -సామాజిక శక్తుల కర్తవ్యం" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కేవీపీఎస్ నగర అధ్యక్షులు ఎం.దశరథ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో జేబీ రాజు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో మనుస్మృతి శక్తులకు, రాజ్యాంగ శక్తులకు మధ్య ప్రధాన పోటీ ఉంటుందన్నారు. మనుస్మృతి వారసులైన బీజేపీని చిత్తుగా ఓడించడం ద్వారా రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీ 10 ఏండ్ల పాలనలో దళితులపై 300 రెట్లు దాడులు పెరిగాయన్నారు. అన్ని రంగాల్లో దేశాన్ని అట్టడుగుకు చేర్చిన బీజేపీ విధానాలు దేశ సమైక్యతకు విఘాతం కలిగిస్తాయన్నారు. బీజేపీ 400 సీట్లు సాధిస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని ఆ పార్టీ కర్ణాటక నాయకుడు చెప్పడాన్ని సామాజిక శక్తులు గుర్తుపెట్టుకోవాలన్నారు.

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. ఏ పార్టీలో ఉన్న వాళ్లు ఆ పార్టీలోనే ఉంటూనే బీజేపీకి ఓటు వేయాలని మందకృష్ణ మాదిగ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. బీజేపీకి ఎందుకు ఓటు వేయాలో ఆయన చెప్పాలన్నారు. టీపీఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి.రాములు మాట్లాడుతూ.. 400 పార్లమెంటు సీట్లు గెలుస్తామని బీజేపీ మైండ్‌గేమ్ ఆడుతోందని, కానీ నార్త్ ఇండియాలో బీజేపీకి ఎదురుగాలి వీస్తోందని తెలిపారు. బీజేపీ వ్యతిరేక శక్తులు, ఇండియా కూటమి ఐక్యంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. సమావేశంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆరేపల్లి రాజేందర్, బందు సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు పల్లెల వీరస్వామి, ఎస్సీ ఉన్నత స్థాయి అధికారుల సంఘం హెల్ప్ డెస్క్ కన్వీనర్ డాక్టర్ ఎన్ సిద్ధోజీ రావు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, సామాజిక తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షులు పోకల కిరణ్ కుమార్ మాదిగ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.బాలపీరు, సీఐటీయూ నాయకులు రమేష్ మల్లయ్య పాల్గొన్నారు.

## హిందూ మహిళకు

**మానవత్వాన్ని చాటుకున్న వైనం**

# ముస్లిం మహిళ అంతిమ సంస్కారాలు

## 15 ఏండ్లుగా రాయిగిరిలో సహృదయ అనాథ వృద్ధాశ్రమం నిర్వహణ

**భువనగిరి :** కులం, మతం పేరిట విద్వేషాలు పెచ్చరిల్లుతున్న నేటి రోజుల్లో ఓ ముస్లిం మహిళలో మానవత్వం పరిమళించింది. కన్నుమూసిన వృద్ధురాలికి చివరి మజిలీ అయిన.. అంతిమ సంస్కారాలు చేసి గొప్ప మనసును చాటుకుంది. అనారోగ్యంతో ప్రాణాలు విడిచిన హిందూ మతానికి చెందిన వృద్ధురాలికి దహన సంస్కారాలు చేసేందుకు అయిన వారు ముందుకు రాకున్నా.. ముస్లిం మహిళ ఆ తంతు పూర్తి చేసి మానవత్వం చాటుకుంది. మానవత్వానికి కుల మతాలు అతీతంకావని చాటి చెప్పింది.

యాదాద్రి జిల్లా భువనగిరి మండలం రాయిగిరికి చెందిన ముస్లిం దంపతులు యాకూబీ, చోటులకు మొదటి నుంచి సామాజిక సేవ పట్ల ఆసక్తి ఉండేది. దీంతో రాయిగిరిలో సహదయ అనాథ వద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి 15 ఏండ్లుగా నిర్వహిస్తున్నారు.



అనాథ వద్ధాశ్రమానికి వచ్చే వారి పట్ల ప్రేమ ఆప్యాయతలు కనబరుస్తున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల గ్రామానికి చెందిన చంద్రకళ(72) భర్త కొన్నేండ్ల క్రితం మతి చెందాడు. ఈమెకు పిల్లలు లేకపోవడంతో ఒంటరిగా ఉంటోంది. వద్ధాప్యంలో చంద్రకళ ఆలనా పాలన చూసేవారు లేకపోవడంతో ఆమె సోదరుడు గంగా ప్రసాద్ ఈ ఏడాది జనవరి 19న రాయగిరిలోని సహదయ అనాథ వద్ధాశ్రమంలో చేర్పించాడు.

అనారోగ్యంతో ఉన్న చంద్రకళ బాగోగులను ఆశ్రమ నిర్వాహకులు యాకూబీ, చోటు చూస్తున్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన చంద్రకళ మార్చి 23న మతి చెందింది. ఈ విషయాన్ని చంద్రకళ సోదరుడు గంగాప్రసాద్‌కు ఆశ్రమ నిర్వాహకులు సమాచారమిచ్చారు. చంద్రకళ మతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు నిరాకరించడంతో పాటు రెండురోజులైనా గంగాప్రసాద్ రాలేదు. దీంతో ఆశ్రమ నిర్వాహకులు యాకూబీ, చోటు రాయిగిరి శ్మశాన వాటికలో చంద్రకళ మతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు.

హైందవ సంప్రదాయం ప్రకారం.. చితి చుట్టూ కుండతో తిరిగి.. యాకూబీనే తన చేతితో చితికి నిప్పంటించి దహన సంస్కారాలు చేశారు. మృతురాలికి హిందూ సంప్రదాయం ప్రకారం అన్నీ తానై ముస్లిం మహిళ యాకుబీ అంత్యక్రియలు నిర్వహించారు. అయితే ముస్లిం మహిళ హిందూ సంప్రదాయం ప్రకారం దహనసంస్కారాలు చేయడంపై పలువురు ఆమెను అభినందించారు. ఇప్పటివరకు యాకూబీ, చోటు దంపతులు యాదాద్రి, వరంగల్ జిల్లాల్లో 200మంది అనాథలకు దహనసంస్కారాలు నిర్వహించారు.

# ఖర్చు చేసింది 20 శాతమే

## 80 శాతం నిధులను ఉపయోగించలేదు

- సీపీసీబీ గ్రీన్ ఫండ్స్‌పై ఎన్జీటీ ముందు నివేదిక

**న్యూఢిల్లీ :** కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) సేకరించిన పర్యావరణ పరిరక్షణ ఛార్జీ (ఈపీసీ), పర్యావరణ పరిహారం (ఈసీ)లో 80 శాతం ఖర్చు చేయలేదు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) ముందు బోర్డు సమర్పించిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది. మొత్తం కలిపి, ఈపీసీ, ఈసీ ద్వారా రూ. 777.69 కోట్ల నిధులు సేకరించబడ్డాయి. ఆ నిధులలో సీపీసీబీ 20 శాతం (రూ. 156.33 కోట్లు) మాత్రమే ఉపయోగించింది. డిసెంబర్ 2023లో ట్రిబ్యునల్ ఆమోదించిన ఉత్తర్వుకు అనుగుణంగా సీపీసీబీ నివేదిక దాఖలైంది.

సీపీసీబీ అనేది కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని చట్టబద్ధమైన కాలుష్య నియంత్రణ పర్యవేక్షణ సంస్థ. పట్టణ స్థానిక సంస్థల పరిధిలోకి వచ్చే రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు నిధులు సమకూర్చడంలో సీపీసీబీ ప్రమేయాన్ని ఇతర విషయాలతోపాటు ప్రశ్నించడంతో ఎన్జీటీ ఈ రెండు నిధుల నుంచి ఖర్చు వివరాలను కోరింది. ఢిల్లీ-ఎన్సీఆర్‌లో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ఛార్జ్ నిధుల పూల్ నుంచి సీపీసీబీ ఖర్చు చేసిన రూ. 95.4 కోట్లలో సగానికి పైగా శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనాల కోసం ఉపయోగించబడిందని ఎన్జీటీ ముందు దాఖలైన నివేదికలో తేలింది.

# బీజేపీపై పోరులో వామపక్షాలే కీలకం

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో తమ పార్టీ నాయకుడు యూసఫ్ తరిగామిని ఎక్కడ నిర్బంధించారో తెలుసుకోగోరుతూ కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్‌ను తానే మొదట వేశానని ఏచూరి తెలిపారు.

అస్వస్థతగా వున్న తరిగామిని చూసేందుకు శ్రీనగర్ వెళ్లేందుకు అనుమతి సాధించడం దగ్గర నుంచి, ఆయనకు మెరుగైన వైద్యం అందించడం కోసం ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తీసుకొచ్చి, తిరిగి కాశ్మీర్‌కు పంపేవరకు అవసరమైన అనుమతుల కోసం తాను పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చిందన్నారు.

ఇక రెండో అంశం పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ). దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరగడంలో, నిరసనలు తెలియచేయడంలో, సుప్రీం కోర్టులో సవాలు చేయడంలో అన్నింటా వామపక్షాలు అగ్ర భాగాన వున్నాయని ఏచూరి చెప్పారు.

పౌరసత్వ సవరణ చట్టాన్ని ఆమోదించడం, అలాగే జాతీయ పౌర పట్టిక (ఎన్‌ఆర్‌సీ)ను తీసుకురావడం ఢిల్లీలో, దేశంలోని ఇతర ప్రాంతాల్లో వరుస నిరసనలకు దారి తీసింది. 2014 డిసెంబరు 31న లేదా అంతకుముందు భారత్ వచ్చిన, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లకు చెందిన మైనారిటీ కమ్యూనిటీలైన హిందువులు, బౌద్ధులు, సిక్కులు, క్రైస్తవులు, జైన్‌లకు పౌరసత్వ మంజూరు ప్రక్రియను ఈ చట్టం వేగిరపరుస్తుంది.

ఎన్నికల బాండ్ల విషయంలో గానీ, బిల్కిస్ బానో రిఫరెన్స్ కేసులో గానీ ఇలా ప్రతి ఒక్క అంశంపైనా అటు ఎజెండా రూపొందించడం, ఇటు ప్రజా పోరాటాలు నిర్వహించడం రెండూ ఏకకాలంలో వామపక్షాలు చేపడుతూ వచ్చాయని ఏచూరి చెప్పారు. బిల్కిస్ బానో కేసులో దోషులందరినీ విడుదల చేయడానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టును ఆశ్రయించిన వారిలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ వున్నారని అన్నారు.

2002 నాటి గుజరాత్ నరమేధం కేసులో బిల్కిస్ బానోపై సామూహికంగా లైంగికదాడికి పాల్పడి, ఆమె కుటుంబ సభ్యులు ఏడుగురిని హతమార్చిన కేసులో 11మంది దోషులకు శిక్షను తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీం కోర్టు కొట్టివేసింది. అలాగే ఎన్నికల బాండ్లను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంను ఆశ్రయించిన వారిలో అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తో పాటూ సీపీఐ(ఎం) కూడా పిటిషనర్‌గా వుంది. తాము చేసిన పోరాటం ఫలితంగా ఎన్నికల బాండ్లను సుప్రీం రద్దు చేసింది, విరాళాలకు సంబంధించిన డేటా బయటకొచ్చింది.



నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయడానికి దారి తీసిన 2020-21 రైతాంగ నిరసనలను కూడా ఏచూరి ఈ సందర్భంగా ఉదహరించారు.

" కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక వైఖరి తీసుకున్న నరేంద్ర మోడీ ప్రభుత్వ మెడలు వంచేలా చేసింది చారిత్రక రైతాంగ పోరాటమొక్కటే. ఆ చట్టాలను చివరికి ప్రభుత్వం ఉపసంహరించుకోవాల్సి వచ్చింది." అని ఏచూరి చెప్పారు.

నిరసనలకు నేతృత్వం వహించిన సంయుక్త కిసాన్ మోర్చాలో వామపక్షాలకు చెందిన అనేక రైతు సంఘాల సభ్యులుగా వున్నాయి. వామపక్ష రైతు సంఘం అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) కూడా ఎస్కేఎంలో ప్రధాన భాగంగా వుంది.

"కాబట్టి ఈ అన్ని విషయాల్లో నూ ఎజెండా రూపకల్పనలో వామపక్షాలు ముఖ్య భూమిక వహించాయి. ఈ ఎన్నికల అనంతరం వామపక్షాలు మరింత బలోపేతమవుతాయి." అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ సీట్ల సంఖ్యను మెరుగుపరుచుకుంటుందని చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి లోక్‌సభలో ప్రవేశిస్తాం. గత సారి కన్నా ఎక్కువ రాష్ట్రాల నుండి గెలుస్తాం, గతంలో తమిళనాడు, కేరళల్లో గెలిచామని చెప్పారు. ఈసారి గతంలో కన్నా మెరుగైన ఫలితాలు వుంటాయన్నారు.

దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ పాగా వేసే అవకాశం వుందా అని ప్రశ్నించగా, అస్సలు లేదని ఏచూరి స్పష్టం చేశారు. "ప్రధాని ఎంతలా శ్రమించినా, జై భజరంగ బలి పేరుతో ఓట్లను అడిగిన కర్నాటకలో మాదిరిగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి తలకిందులు తపస్సు చేసినా దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ గెలిచే అవకాశాలు అస్సల్లేవని చెప్పారు.

"కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఏం జరిగిందో మీరు చూశారు, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఏం జరిగిందో చూశారు. ఇలాంటి ట్రిక్కులు ఎల్లకాలం పనిచేయవు." అని ఏచూరి చెప్పారు.

మత విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా ఉత్తరాది రాష్ట్రాల్లో భావోద్వేగాలను బిజెపి రెచ్చగొట్టవచ్చుని, కానీ దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ పప్పులుడకవని ఏచూరి పేర్కొన్నారు.

సంపాదకీయం

# విజయ సందేశం




తిరోగమన విధానాలను తిప్పికొడతామని జేఎన్‌యూ యువత రుజువు చేసింది. ప్రతిష్టాత్మకమైన ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ఎన్నికల్లో వామపక్ష విద్యార్థుల కూటమి సాధించిన విజయమే దీనికి నిదర్శనం. మేధావులకు నిలయమైన ఈ వర్సిటీలో నాలుగేండ్ల తర్వాత జరిగిన ఈ ఎన్నికలను అంతతేలిగ్గా తీసిపడేయలేం. అందుకే మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో ఆ విద్యార్థులు సాధించిన విజయం దేశవ్యాప్త చర్చగా మారింది. మతోన్మాద బీజేపీ కనుసన్నల్లో నడుస్తున్న ఏబీవీపీని చిత్తుగా ఓడించి, విద్వేష రాజకీయాలను తిప్పికొట్టి, వామపక్ష విద్యార్థి సంఘాలను గెలిపించిన వర్సిటీ విద్యార్థులకు దేశం జేజేలు పలుకుతోంది.

**ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, అంబేద్కర్ ఫూలే స్టూడెంట్స్ యూనియన్, డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్, దళిత్ సంఘ్ వంటి అభ్యుదయ సంఘాలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం ఈ కూటమితో కలిసి రావడం మరో విశేషం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు, విద్వేషాలు, విభజనలు లేని, స్వేచ్ఛ కోసం పోరాడాల్సిన అవసరాన్ని తమ విజయం ద్వారా జేఎన్‌యూ విద్యార్థులు దేశానికి గుర్తు చేశారు.**

వాస్తవానికి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నత విద్యాకేంద్రాలపై కేంద్రీకరించి పని చేస్తున్నది. దీనికి కారణం ఆ కేంద్రాలలో వామపక్ష, అభ్యుదయ శక్తులు బలంగా ఉండటమే. దీన్ని మార్చడం కోసం జేఎన్‌యూపై అనేక రకాలుగా దాడులకు పాల్పడింది. 'దేశ విద్రోహ శక్తులకు అడ్డా, దేశ వ్యతిరేక శక్తుల కేంద్రం' అంటూ ముద్ర వేయడం మొదలుపెట్టింది. అందులో భాగంగానే అప్పట్లో వామపక్ష విద్యార్థి సంఘ నాయకుడిని అరెస్టు చేసి తీహార్ జైలుకు పంపింది. తర్వాత ఎస్ఎఫ్ఐ నాయకురాలు, జేఎన్‌యూ అప్పటి అధ్యక్షురాలు అయిషీ ఘోష్‌పై భౌతికదాడికి పాల్పడి అక్కసు తీర్చుకుంది. మరో నాయకుడు ఉమర్ ఖలీద్‌ను 'రాజద్రోహం' కేసులో నిర్బంధించింది.

నిజానికి దేశంలో ప్రత్యామ్నాయ ఆలోచనలకు, రాజకీయాలకు, చర్చలకు ఈ యూనివర్సిటీ ఒక కేంద్ర బిందువు. అందులో చదువుకున్న విద్యార్థులు నేడు బ్యూరోక్రాట్స్‌గానే కాక, రాజకీయాల్లో, మీడియాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అభ్యుదయ శక్తి అయిన ఈ యూనివర్సిటీ బీజేపీ తిరోగమన ఆలోచనలను సవాల్ చేసింది. ఫలితంగా మోడీ కంట్లో నలుసయ్యింది. దేశానికి గొప్పనాయకత్వాన్ని అందిస్తున్న ఆ యూనివర్సిటీని నిర్వీర్యం చేయపూనుకున్నారు. ఒక్క జేఎన్‌యూనే కాదు దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలను తమ ఆలోచనలకు అనుగుణంగా మలుచుకునేందుకు పథకం రచించారు. తమ మాట వినే వాళ్లను వీసీలుగా నియమించుకొని విద్యార్థుల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ప్రగతిశీల భావాలు గల అధ్యాపకులపై కూడా దాడులకు, కక్ష సాధింపులకూ దిగారు.

మోడీ నియంతృత్వ విధానాలపై జేఎన్‌యూ విద్యార్థులు మొదటినుంచి పోరాడుతూనే ఉన్నారు. తమపై ఎన్ని దాడులు చేసినా వెన్ను చూపలేదు. ఈసారి ఎన్నికల్లో కూడా ప్రగతి వైపు నిలబడ్డారు. నూతన విద్యా విధానం-2020ని తెచ్చి విద్యారంగంలో ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలుజేయచూస్తున్న బీజేపీ ప్రభుత్వానికి సవాలుగా నిలిచారు. పేదలకు ఉన్నత విద్యకు దూరంచేసే కుట్రను తిప్పికొట్టగలం అనే నమ్మకాన్ని విద్యార్థిలోకానికి అందించారు. అంతేకాదు ప్రజలపై మోయలేని భారాలు మోపుతూ, కార్పొరేట్లకు మేలు చేసేందుకే ప్రధాని అయిన మోడీ విధానాలను ఐక్యతతో తిప్పికొట్టగలమనే ఆత్మవిశ్వాసాన్ని ప్రజలకిచ్చి, దేశానికి దివిటీలుగా నిలిచారు.

ఈ ఎన్నికల్లో మతోన్మాదులను ఎలాగైనా గెలిపించేందుకు ఏబీవీపీకి అనుకూలంగా జేఎన్‌యూ అడ్మినిస్ట్రేషన్ విభాగం తీవ్రంగా శ్రమించింది. అందులో భాగంగా లెఫ్ట్ కూటమి ప్రధాన కార్యదర్శి అభ్యర్థిని పోలింగ్‌కు రెండురోజుల ముందు అనర్హులుగా ప్రకటించింది. అంతేకాదు ఆర్ఎస్ఎస్, బీజేవైఎం కార్యకర్తలు యూనివర్సిటీలోకి చొరబడి విద్యార్థులపై దాడులు చేశారు. లాభం లేకపోవడంతో కేంద్ర మంత్రులే రంగంలోకి దిగి డబ్బు, ఇతర ప్రలోభాలకు గురిచేశారు. అయినా దేశాన్ని ప్రజాస్వామ్యాన్ని తద్వారా విద్యారంగాన్ని కాపాడుకునే బాధ్యతను జేఎన్‌యూ విద్యార్థులు తమ భుజాలకెత్తుకున్నారు. విద్వేష, హింసా రాజకీయాలను తిరస్కరించి వామపక్ష విద్యార్థి సంఘాలను గెలిపించుకున్నారు. అంతేకాదు 27 ఏండ్ల తర్వాత దళిత విద్యార్థి ధనుంజయ్‌ని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ విజయంతో జేఎన్‌యూ వామపక్షాలకు కంచుకోట అని మరోసారి రుజువు చేశారు. అంతే కాదు గత పన్నెండ్లేలో ఎన్నడూ లేనంతగా ఈ ఎన్నికల్లో 73శాతం ఓట్లు పోలవ్వడం మరో గొప్ప విషయం.

ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, అంబేద్కర్ ఫూలే స్టూడెంట్స్ యూనియన్, డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్, దళిత్ సంఘ్ వంటి అభ్యుదయ సంఘాలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం ఈ కూటమితో కలిసి రావడం మరో విశేషం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు, విద్వేషాలు, విభజనలు లేని, స్వేచ్ఛ కోసం పోరాడాల్సిన అవసరాన్ని తమ విజయం ద్వారా జేఎన్‌యూ విద్యార్థులు దేశానికి గుర్తుచేశారు. వీరి స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా ఉన్న అభ్యుదయ వాదులు, దళిత బలహీన వర్గాల కలయికతో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

---

# కరువు కోరల్లో 'గాజా'

ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ (ఐ.పి.సి) ఈనెల 18న ఓ నివేదిక విడుదల చేసింది. గాజాలో మారణహోమం ఆగకపోతే మే 2024నాటికి పాలస్తీనాలోని గాజా ఉత్తర ప్రాంతం కరువు కోరల్లో చిక్కుకుంటుందని అలాగే మిగిలిన ప్రాంతం కూడా ప్రమాదకరంగా మారబోతోందని హెచ్చరించింది. కరువు పరిస్థితులను గుర్తించడంలో మిలియన్ల మంది ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన ప్రతిస్పందనను తెలియజేయడంలో ఐపిసి కీలక పాత్ర పోషిస్తుంది. ఐపిసి ప్రకటన గాజా ప్రజలు ఎదుర్కొంటున్న భయంకరమైన పరిస్థితిని ఎత్తిచూపింది. సంక్షోభానికి ముందు గాజాలో జనాభాకు సరిపోయినంత ఆహారం ఉండేది. అయిదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు



ఉన్న పిల్లలలో 0.8శాతం మంది మాత్రమే తీవ్రమైన పోషకాహార లోపంతో ఉండేవారు. ఉత్తర ప్రాంతాలలో ఈ ఫిబ్రవరి నాటికి ఆ సంఖ్య 12.4-16.5శాతం మధ్య ఉంది. ఇప్పుడు చాలామంది ప్రజలు చనిపోతున్నారు. ఇంకా అనేకమంది అనారోగ్యంతో ఉన్నారు. బయటనుంచి ఎక్కువ ఆహారాన్ని అనుమతించకపోతే మిలియన్ మందికి పైగా ప్రజలు ఆకలిని విపత్తు ఎదుర్కొంటారని నివేదికలోని అంశాలను గమనిస్తే తెలుస్తోంది.

గాజాలో సగం మంది సుమారు పదిలక్షల ప్రజలు ఆహార భద్రతను కలిగిలేరు. ఉత్తర భాగం జనాభాలో 70 శాతం అంటే సుమారు 2,10,000 మంది కరువు విపత్తులో భాగమవుతారు. మానవతా సంస్థలు పంపించే ఆహారంతో కూడిన ట్రక్కులను గాజా లోనికి పంపించకుండా మోకాలడ్డుతున్న ఇజ్రాయిల్ దళాలు ఈ విపత్తుకు కారకులవుతారు. ఇప్పటికీ ఈ ప్రాంతాలలో సరిపడినంత తాగునీరు లభ్యం కావడంలేదు. పిల్లలు తినడానికి పెద్దలు తమ భోజనాన్ని తగ్గిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి వేలాది మంది జీవితాలు, ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావాలను చూపుతుంది. తీవ్రమైన పోషకాహార లోపం వలన ఇతరేతర అంటువ్యాధులు ప్రబలి పిల్లలు మరణిస్తున్నారు. పరిశుభ్రత, పారిశుధ్య సేవల లోపం దీర్ఘకాలిక ప్రభావాలు చూపి పిల్లల మొత్తం ఎదుగుదలను నిరోధిస్తుంది. కరువు పరిస్థితులలో గాజా ప్రాంతంలో ప్రాణాలను రక్షించే శస్త్రచికిత్సలు లేకపోవడం, అవయవాలను కోల్పోయే జనాలు, క్యాన్సర్, డయాబెటిస్‌తో బాధపడుతున్న రోగులు, జన్మనిచ్చిన తల్లులు, నవజాత శిశువులు, అందరూ ఆకలితో బాధపడటం, దానిని వెంటాడే వ్యాధుల నుండి కోలుకోవడానికి ప్రయత్నించడం కరువు పరిస్థితుల్లో కలగొచ్చు.

కరువు రాకుండా ఉండాలంటే ప్రపంచ దేశాలు దృష్టి పెట్టాలి. గాజాలోని అన్ని కీలకమైన ఆసుపత్రులలో మరింత పోషకాహారం, స్థిరీకరణ కేంద్రాలను జోడించాల్సిన అవసరం ఉంది. స్థానికంగా పోషకాహార లోపాన్ని నివారించడానికి స్వచ్ఛంద కమ్యూనిటీలకు మద్దతు అవసరం. గాజా స్ట్రిప్‌కు మానవతావాద అందుబాటు పునరుద్ధరించేందుకు కృషిచేయాలి. ఆహారం, నీరు, మందులు, పౌరులకు రక్షణ, అలాగే ఆరోగ్యం, నీరు, పారిశుధ్య సేవలు, విద్యుత్, డీజిల్ ఇతర ఇంధనాలు పునరుద్ధరించడానికి అందించడానికి అన్ని ప్రయత్నాలు చేయాలి. ఆహారం, మందులు, స్పెషలిస్ట్ న్యూట్రిషన్ ఉత్పత్తులు, ఇంధనం ఇతర అవసరాలకు మాత్రమే పరిమితం కాకుండా తగినన్ని సహాయ వస్తువుల నిరంతర సరఫరాని మొత్తం గాజా స్ట్రిప్‌లో రోడ్డు మార్గంలో ప్రవేశించడానికి తరలించడానికి అనుమతించబడాలి. అవసరమైన వస్తువుల పరిమాణానికి అనుగుణంగా వాణిజ్య వస్తువుల ట్రాఫిక్‌ను కూడా పూర్తిగా పునరుద్ధరించాలి. చిన్న పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు, దీర్ఘకాలికంగా అనారోగ్యంతో ఉన్న వారికి, వృద్ధులకు కాంప్లిమెంటరీ ఫుడ్స్ మైక్రో న్యూట్రియెంట్ సప్లిమెంట్లను అందించాలి. సాధ్యమయ్యేచోట మార్కెట్ సదుపాయాలు కల్పించాలి. హార్టికల్చర్, చేపలు పట్టడం వంటి ఆహార ఉత్పత్తి వ్యవస్థలను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలి. అన్నింటికీ మించి యుద్ధమాగడానికి ఐక్యరాజ్య సమితితో పాటు ప్రపంచ దేశాలు ప్రయత్నించాలి.

- జనక మోహనరావు దుంగ
8247045230

---


# రజాకార్లను రక్షించిన యూనియన్ సైన్యం



ఎస్ వినయ కుమార్
9989718311

'రజాకార్' చిత్ర నిర్మాతలు దానికి టాగ్‌లైన్‌గా 'హిస్టరీ రి రిటెన్' అని పెట్టుకొన్నారు. ఆ చిత్రం చరిత్రను తిరగరాయలేదు. నిజానికి తిరగేసి రాసింది. అవాస్తవాలను చరిత్రలో జోడించే దుస్సాహసం చేసింది. సినిమాలో చూపినట్లు రజాకార్లు యూనియన్ సైన్యంపై తిరగబడలేదు. నిజాం నవాబులాగే వారూ లొంగిపోయారు. మరాఠ్వాడ జిల్లాల్లో రక్తపాతం జరిగిన మాట వాస్తవమే కాని అది ప్రతిఘటన వల్ల జరగలేదు. అప్పటి ఉస్మానాబాదు జిల్లా కలెక్టర్ మహ్మద్ హైదర్ రాసిన పుస్తకంలో ఈ విషయం స్పష్టంగా రాశారు. యూనియన్ సైన్యాలు హైదరాబాద్ స్టేట్‌లోకి వస్తున్నాయని తెలిసి ఆయన స్వయంగా హైదరాబాద్‌కు వచ్చి నిజాంను, అప్పటికి ఇంకా ప్రధానిగా ఉన్న లియాకత్ అలీని కలిసి తాను ఏమి చేయాలో ఆదేశించమని కోరాడు. అప్పటికే యూనియన్ ప్రభుత్వంతో ఒప్పందానికి వచ్చిన ఎలాంటి ఆదేశం ఇవ్వలేదు. ఆ స్థితిలో తనకింద ఉన్న బలగాలకు జిల్లా కలెక్టర్‌గా ఆయన ఆదేశం జారీ చేయలేదు.

హైదరాబాద్ నగరంలో యూనియన్ సైన్యాలను ప్రజలు హర్షోల్లాసాలతో స్వాగతించారు. ఒప్పందం ప్రకారం యూనియన్ ప్రభుత్వం హైదరాబాదు రాజ్యాన్ని విలీనం చేసుకొని నిజాంను రాజ ప్రముఖ్‌గా నియమించింది. రాజప్రముఖ్‌గా నిజాం అదేశాల ప్రకారమే హైదరాబాదు పరిపాలన 1952లో ఎన్నికలు జరిగే వరకు కొనసాగింది. 1971లో ఇందిరా గాంధీ రాజభరణాలు రద్దు చేసే వరకు నిజాంకు రాజభరణం అందింది. నిజాం ఆకృత్యాలపై ఎలాంటి విచారణ జరగలేదు. రజాకార్ల నాయకుడు కాశీం రజ్వీని అరెస్టు చేసి మలక్‌పేటలోని మహబూబ్ మాన్షన్ (భవంతి)లో ఉంచారు. కాశీం రజ్వీకి అండదండలు అందించిన ప్రధాని లియాకత్ అలీని గృహ నిర్బంధంలో ఉంచారు. అతను అనారోగ్యం పేరుతో నాటకమాడి అంబులెన్సు ద్వారా తప్పించుకొని పాకిస్తాన్ ఉడాయించాడు. యూనియన్ సైన్యం లాలూచీ లేకుండా అది సాధ్యం కాదు. కాశీం రజ్వీని కూడా కొంతకాలం తర్వాత పాకిస్తాన్ పంపారు. తెలంగాణ ప్రజలపై భయంకరమైన హింసాకాండ సాగించి వేలమంది హత్యలకు, అత్యాచారాలకు కారకుడైన రజ్వీ వంటి దుర్మార్గుడికి పడాల్సిన శిక్ష పడలేదు. రజ్వీ పోకడలను వ్యతిరేకించిన కలెక్టర్ హైదర్‌కు మాత్రం జైలుశిక్ష పడింది. కోర్టులో రజ్వీ తరఫున వాదించే న్యాయవాదికి ప్రభుత్వమే ఫీజు చెల్లించింది. భూమి రక్షించుకోవడానికి పోరాడుతున్న రైతులు 2,500 మందిని యూనియన్ సైన్యాలు చంపేశాయి. భూములను మళ్లీ భూస్వాముల పరం చేశాయి. వాస్తవ చరిత్రను చెప్పాలనే ఉద్దేశమే ఉంటే రజాకార్ చిత్రంలో ఇవన్నీ చూపెట్టేవారు. కానీ ముస్లింల పట్ల ద్వేషం రెచ్చగొట్టడమే తమ సంకుచిత రాజకీయ లక్ష్యం గనుక వాస్తవ ఘటనలకు మసిబూసి అబద్ధాలను జనం ముందుంచడానికి ప్రయత్నించారు. నిజాంకు జాగీర్దారీ దొరలతో మంచి దోస్తానా ఉండింది. దొరల నుంచి విలువైన కానుకలందేవి. అందమైన మహిళలను కూడా దొరలు నిజాంకు నజరానాగా బహుకరించేవారు. నిజాం పేర వసూల్ చేసే భూమిశిస్తులో దొరలు కొంత పంపి మిగతా డబ్బును తమ భోగవిలాసాలకు తమ స్వంత గూండాల సైన్యంతో పాటు నిజాం అధికార్లను మేపడానికి వాడేవారు. ప్రజలను జంతువులకంటే హీనంగా చూసేవారు. ప్రశ్నించేవారిని చంపేసేవారు. సాధారణ ఎన్నికల ముందు హిందువులను ఏమార్చి ఓట్లను కొల్లగొట్టడానికి చేసిన ప్రయత్నమే 'రజాకార్' మొదట కాంగ్రెస్‌లో ఉండి వైఎస్ఆర్ మరణం తర్వాత బీజేపీలోకి జంప్ అయిన గూడూరు నారాయణరెడ్డి ఆ చిత్ర నిర్మాత. తెరవెనుక నుండి కథ నడిపింది మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగరరావు వగైరా కాశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీస్ పరంపరలో రజాకార్ మరొకటి.




తెలంగాణలోని జాగీర్దార్లకు, వారికి అండగా నిల్చిన నిజాంకు వ్యతిరేకంగా హైదరాబాదు స్టేట్‌లో వివిధ రూపాల్లో ప్రతిఘటనా పోరాటాలు సాయుధ పోరాటానికి ముందే మొదలయ్యాయి. గ్రంథాలయోద్యమం, ఆంధ్ర జనసభ, ఆంధ్ర మహాసభ ఆ ప్రతిఘటనల్లో భాగంగా ముందుకొచ్చాయి. తెలుగులో చదువుకొనే, కనీసం సభల్లో మాట్లాడే అవకాశం లేని స్థితిలో ఆంధ్రజనసభ ఆ తర్వాత ఆంధ్రమహాసభ ఆవిర్భవించాయి. తెలంగీ బేడంగీ (తెలుగు భాష పద్ధతీ పాడూ లేనిది) అన్న నిజాం తైనాతీల ఎగతాళి మాటలు తెలుగు మాట్లాడే వారి ఆత్మగౌరవాన్ని కించపరిచాయి. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోని చదువులు కూడా కేవలం ఉర్దూలో ఉండటం వల్ల తెలుగువారికే కాదు హైదరాబాదు రాష్ట్రంలోని మరాట్వాడ ప్రాంతంలోని మరాఠీ ప్రజలకు, ఉత్తర కన్నడ జిల్లాల్లోని కన్నడిగులకు కూడా ఈ దుస్థితి మింగుడు పడలేదు. ఆంధ్రమహాసభలోని కమ్యూనిస్టులు ఫ్యూడల్ వ్యతిరేక పోరాటాన్ని మహాసభ వేదికపైకి ఎప్పుడైతే తెచ్చారో అప్పుడు మహాసభలోని భూస్వామ్య అనుకూల వర్గాలు బెంబేలెత్తి మహాసభ నుంచి చీలిపోయారు. ఆ తర్వాత వారి పోరాటాలు అంతగా కన్పించవు.

**ఆర్ఎస్ఎస్ హిందూ మహాసభలు తెలంగాణలో చేసిందేమి లేదు కనుక వారిని చూపెట్టడానికి అవకాశమే లేదు. సావర్కర్ అనుమతితో హిందూ మహాసభ నిజాంకు వ్యతిరేకంగా జరిపిన సత్యాగ్రహంలో గాంధీజీని చంపిన నాథూరాం గాడ్సే పాల్గొన్నాడు. అందుకు పదకొండు నెలల పాటు హైదరాబాదు జైల్లో శిక్షను అనుభవించాడు. జాతిపితను చంపిన గాడ్సె హిందూ మతోన్మాది గనుక ఆ ఘటన ప్రస్తావన కూడా సినిమాలో చూపకుండా జాగ్రత్త పడ్డారు. ఆర్యసమాజ్ వ్యక్తిగత దాడులకు మాత్రమే పరిమితమైంది. నిజాం నవాబుపై వారు చేసిన హత్యాయత్నం ఆ కోవలోనిదే.**

ఆ తర్వాత ఆంధ్రమహాసభ మహోద్వేగంతో ముందుకు సాగింది. జమిందారీ వ్యతిరేక పోరాటం ఉధృతమైంది. జాగీర్దార్ల అరాచకాలకు వ్యతిరేకంగా స్వీయరక్షణ కోసం రైతులు, కూలీ జనం ఆయుధాలను చేపట్టారు. క్రమంగా పోరాటం కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలోకి వెళ్లింది. నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని విస్తారమైన ప్రాంతం మూడు వేల గ్రామాలు జాగిర్దారీ భూస్వామ్య పాలన నుంచి విముక్తి అయ్యాయి. పదిలక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారు. 1946 నుండి 1951 వరకు జరిగిన ఆ పోరాటంలో నాలుగు వేల మంది తమ ప్రాణాలొడ్డారు. రజాకార్లు నిజాం సైన్యం దొర గుండాల చేతుల్లో 1500 మంది చనిపోయారు. రైతులు, వివిధ వృత్తులవారు చేసిన పోరాటాన్ని అణచడానికి జాగీర్దార్ల గుండాలతో పాటు రజాకార్లు సామాన్య ప్రజలపై చెప్పలేని అఘాయిత్యాలకు, క్రూర చర్యలకు పాల్పడ్డారు. సినిమాలో చూసిన ఆకృత్యాలన్నీ రజాకార్లు హిందూ ఫ్యూడల్ దొరల సైన్యాలతో కలిసి చేసినవే. దొరలు రజాకార్లను ఉపయోగించుకొన్న సత్యాన్ని రజాకార్ సినిమా కావాలనే దాచిపెట్టింది. వీరనారి చాకలి ఐలమ్మ పట్ల తెలంగాణ ప్రజల్లో విశేష అభిమానం ఇప్పటికీ ఉంది. కనుక ఆ అభిమానాన్ని కూడా ఎన్నికల్లో తమకు అనుకూలంగా మల్చుకోవడానికి ఐలమ్మ సంఘటనతోనే సినిమా మొదలెట్టారు.

ఆర్ఎస్ఎస్ హిందూ మహాసభలు తెలంగాణలో చేసిందేమి లేదు కనుక వారిని చూపెట్టడానికి అవకాశమే లేదు. సావర్కర్ అనుమతితో హిందూ మహాసభ నిజాంకు వ్యతిరేకంగా జరిపిన సత్యాగ్రహంలో గాంధీజీని చంపిన నాథూరాం గాడ్సే పాల్గొన్నాడు. అందుకు పదకొండు నెలల పాటు హైదరాబాదు జైల్లో శిక్షను అనుభవించాడు. జాతిపితను చంపిన గాడ్సె హిందూ మతోన్మాది గనుక ఆ ఘటన ప్రస్తావన కూడా సినిమాలో చూపకుండా జాగ్రత్త పడ్డారు.ఆర్యసమాజ్ వ్యక్తిగతదాడులకు మాత్రమే పరిమితమైంది. నిజాం నవాబుపై వారు చేసిన హత్యాయత్నం ఆ కోవలోనిదే.

నిజాం ప్రభుత్వ యంత్రాగం ఫ్యూడల్ దొరల దోపిడీకి అనుకూలంగా నిల్చేది. దొరల్లో అత్యధికులు హిందువులే. గ్రామాల్లోని వృత్తికులాలు, సేవాకులాలు దొరలకు అధికారులకు ఉచితంగా తమ ఉత్పత్తులు, సేవలను వెట్టికింద అందించే వారు. దొరల ఇళ్లల్లో పెళ్లైతే పెళ్లి కూతురితో పాటు కొందరు మహిళలను కూడా బానిసలుగా పంపేవారు. దొరలు వారిని తమ కామవాంఛలు తీర్చుకోవడానికే గాదు తమ ఇంటికి అతిథులుగా వచ్చిన వారికి వారిని తార్చేవారు. ఇలాంటి విషయాలేవీ సినిమాలోలేవు. ఈ ఘటనలను చెప్పడమంటే దౌర్జన్యాలకు, దోపిడీకి మతం ప్రాతిపదిక కాదన్న విషయం తెలిసిపోతుంది. అది పరివార్‌కు మింగుడుపడని విషయం గదా?

సినిమాలో పదేపదే హైదరాబాద్‌ను తుర్కిస్తాన్‌గా మార్చడానికి నిజాం ప్రయత్నిస్తున్నట్లు చూపారు. మొదటి నిజాం ఇరాన్ నుంచి వచ్చిన వాడు టర్కీతో పెళ్లి సంబంధాలున్నా, టర్కీతో పాలనా సంబంధాలు లేవు. సినిమాలో వాడిన తుర్కిస్తాన్ అనే మాట మనకు చరిత్రలో కన్పించదు. ముస్లింలను తెలంగాణలో తుర్కోళ్లు అంటారు. ముస్లింలు అలా పిలిపించుకోవడానికి ఇష్టపడరు, వారికి ఆ మాట ఎద్దేవాగా అన్పిస్తుంది. కనుకే తుర్కిస్తాన్ అనే మాటను సృష్టించి సినిమాలో వాడారు. నిజాం ఒక దశలో మత మార్పిడులు చేయించారు. అతనే వాటిని నిలిపేశాడు. కారణం మళ్లీ ఈ దొరలే. మతమార్పిడి వల్ల ఇస్లాంను స్వీకరించిన మాల మాదిగలు, ఇతర శూద్రులు వెట్టిచాకిరీ నిరాకరిస్తే మా గతేమిటి? మీ అధికారులగతేమిటి? అని దొరల ప్రతినిధి వర్గం నిజాంను కలిసి ప్రశ్నించింది. వెంటనే నిజాం మతమార్పిడులను నిలిపేయించాడు. సినిమాలో ఈ విషయంలో దొరల ప్రస్తావన రాకుండా జాగ్రత్తపడ్డారు.

హైదరాబాదు రాష్ట్రంలోని ప్రతి ముస్లిం తనను తాను ప్రభువుగా భావిస్తే నిజాం ప్రభుత్వానికి దోకా ఉండదని కొందరు మేధావులు నిజాంకు సూచించారు. ఆ నేపథ్యంలో "అనల్ మాలిక్" (నేను ప్రభువును) అన్న నినాదం సృష్టించి నిరుపేద ముస్లింను కూడా తనవైపు ఉంచుకోవాలని నిజాం ప్రయత్నించాడు. అది కూడా సాధ్యం కాలేదు. 1917లో రష్యాలో సోషలిస్టు రాజ్యం ఏర్పడ్డాక ఆ స్ఫూర్తితో ఉత్తరాది నుండి వచ్చిన ముస్లిం పాత్రికేయులు హైదరాబాదులో ఉర్దూ పత్రికలు పెట్టి నిజాంను ఏకిపారేశారు. "అనల్ మాలిక్" అన్న భావనను ఎండగడ్తూ మగ్దూం మొహియుద్దీన్ కవితలు రాశాడు. రోజుకు పావలా సంపా దించే ముస్లిం రిక్షాకార్మికుడు ప్రభువు అవుతాడా? అని ప్రశ్నిం చారు. ఇప్పటికీ ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ముస్లింలను ఆ మాటలతోనే కవ్విస్తారు. ఇది మన భూమి, ఈ భూమికి మనమే ప్రభువులం, మన రాజ్యాన్ని లాగేసుకొన్నారు అని రెచ్చగొడ్తారు.

తెలంగాణలో దొరల ఆగడాలను మాభూమి, దాసి, వీరతెలంగాణ, చిల్లరదేవుళ్లు వంటి సినిమాలు, శ్యాంబెనగల్ నిజాం కాలం నాటి తెలంగాణ ఇతివృత్తంతో అంకుర్, నిషాంత్, మండి వంటి సినిమాలు నిర్మించారు. ఇవన్నీ 40 ఏళ్ల క్రితం వచ్చిన సినిమాలు. వాస్తవ ఘటనల ఆధారంగా తీసినవి ఈ తరం వారు వీటిని చూడలేదు. అవి చూస్తే నిజాం పాలన అండగా దొరలు సల్పిన అకృత్యాలు తెలుస్తాయి. ఇవన్నీ యూట్యూబ్‌లో అందుబాటులో ఉన్నాయి. చిత్రాల కంటే ఎక్కువ సంఖ్యలో నవలలు వచ్చాయి. గంగు, ప్రజల మనిషి, చిల్లరదేవుళ్లు, మోదుగు పూలు, జనపదం, తెలుగు గడ్డ, జైత్రయాత్ర వంటి అనేక నవలలు తెలంగాణ సాయుధ పోరాటం ఘటనలను, దానికి ముందు నాటి స్థితిని తెలియచేస్తాయి. ఒక నాటి తెలంగాణ స్థితిగతులను తెలుసుకోవాలనుకొనే వారు పైన పేర్కొన్న నవలలను చదవాలి. సినిమాలు చూడాలి. అప్పుడర్థమవుతుంది సంఘ్ పరివార్ 'రజాకార్' సినిమాను భారీ వ్యయంతో ఎందుకు నిర్మించిందో?

---

# మోడీ పదేండ్ల పాలన-హామీలు, వైఫల్యాలు

**ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసే విధానం కలిగిన బీజేపీని రాబోయే ఎన్నికలలో ఓడించాలి.తాను ఓబిసి ప్రధాన మంత్రినంటాడు. కానీ బీసీకులగణనకు మాత్రం ఒప్పుకోడు. బీహార్‌లో కులగణను అక్కడి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేసింది. 63శాతం ఓబిసి, ఈబీసీ వర్గాలు ఉన్నాయని తేలింది. ఈ సెన్సెస్ ఆధారంగా బీసీలకు సంక్షేమ పథకాలు కల్పించడానికి తోడ్పడుతుంది (ఇది ఇంకా అమలుకు నోచుకోలేదన్నది వేరే విషయం). మోడీ ప్రభుత్వ హయాంలో బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు సర్వసాధారణమై పోయాయి. స్వదేశీ, దేశభక్తి ముసుగులో విభజన, విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్న కార్పోరేట్ - మతతత్వ శక్తయిన బీజేపీ నిలువరించవల్సిన కర్తవ్యం విజ్ఞులైన భారత ప్రజలపైన ఉన్నది.**






గీట్ల ముకుంద రెడ్డి
94900 98857

కేంద్రంలో రెండు దఫాలు, పదేండ్లుగా అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ, ఎన్డీఏ సర్కార్ తమ ఎన్నికల వాగ్దానాలు అనేకం విస్మరించింది. 2014 ఎన్నికల్లో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న మోడీ 30 లక్షల కేంద్ర ప్రభుత్వ ప్రభుత్వరంగ సంస్థలలోని ఖాళీ పోస్టులను కూడా భర్తీ చేయలేదు. నిరుద్యోగం 10.32శాతానికి పెరిగింది. 'మాకు అధికారం ఇస్తే 100 రోజుల్లో స్విస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని' చేసిన వాగ్దానం బుట్టదాఖలైంది. స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన విధంగా వ్యవసాయ ఉత్పత్తులకు కనీసం మద్దతు ధర కల్పిస్తామని 2014 ఎన్నికలలో మోడీ వాగ్దానం చేశారు. అందుకు భిన్నంగా మూడు రైతు వ్యతిరేక నల్లచట్టాలు తీసుకొచ్చారు. రైతాంగ ఉద్యమానికి తలొగ్గి, రైతులకు క్షమాపణ చెప్పి ఆ చట్టాలను వెనక్కి తీసుకున్నారు. రైతు ఉద్యమం కోరిన "పంటలకు కనీస మద్దతు ధర"కు చట్టబద్ధత నేటికి కల్పించలేదు. రైతు కిసాన్ సమ్మాన్ నిధి నూతన రిజిస్ట్రేషన్స్ గత నాలుగేండ్లుగా చేయడం లేదు. రైతుల ఆదాయం డబుల్ చేస్తామన్న వాగ్దానం నెరవేర్చలేదు. ద్రవ్యోల్బణం అదుపు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు. కూరగాయలు, పప్పులు, నూనెల ధరలు రెట్టింపయ్యాయి. ప్రపంచ ఆకలి సూచీలో 125 దేశాల్లో భారత్‌ను 111వ స్థానానికి దిగజార్చారు. 52శాతం వివాహిత స్త్రీలు, 72 శాతం శిశువులు రక్తహీనతతో బాధపడుతున్నారు. మోడీ రెండు టర్మ్‌ల పాలన రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగపరచడమే కాదు, భారతదేశ అభివృద్ధి పునాదులను దెబ్బతీసింది. పేదలను అతి పేదలుగా మార్చింది. ఇందుకు వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ ఇచ్చిన డేటానే చక్కటి ఉదాహరణ. మరోవైపు దేశాన్ని అప్పుల్లో ముంచారు. కేంద్ర ప్రభుత్వ అప్పులు 2014 సం.లో రూ.54 లక్షల 90 వేల కోట్లు కాగా మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 మార్చి నాటికి అప్పులు రూ.ఒక కోటి 56 లక్షల 60 వేల కోట్లకు చేరాయి.

రాజ్యాంగ సంస్థలైన సిబిఐ, ఇడి, ఐటి వంటి సంస్థలను తమ రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీ వినియోగించుకుంటున్నది. విపక్ష పార్టీల్లో ఉంటే అవినీతిపరులు బీజేపీలో చేరితే సచ్ఛీలురు. అవినీతికి పాల్పడినవారు విజయ్ మాల్యా, నీరవ్ మోడీ లాగా 'ఖండంతరాలు దాటవలసిన అవసరం లేదు. కండువా మార్చు కుంటే సరిపోతుంది' అనే నానుడి మోడీ స్థిరపరిచారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఎలక్టోరల్ బాండ్లు బహిరంగ పరచడంతో కార్పొరేట్ మతతత్వ బంధం బయటపడింది. బడా కార్పొరేట్ సంస్థల నుండి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీ పొందిన డబ్బులు రూ.8251.80 కోట్లు. నగదు, చెక్కుల రూపంలో ఇంకా ఎన్ని వేల కోట్లు రూపాయలను బడా కార్పొరేట్ సంస్థల నుండి పొందిందో తెలియదు. ఇదే కాదు అనేక వైఫల్యాలు మోడీ ప్రభుత్వం మూట కట్టుకుంది. 2014 ఎన్నికల ముందు రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర మొన్నటి వరకు రూ.1150కి, ఎన్నికల నేపథ్యంలో కాస్త దిగొచ్చి నేడు రూ.875కు చేరింది. పెట్రోలియం ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం 2014 సం.లో రూ. ఒక లక్ష 72 వేల 65 కోట్ల ఆదాయాన్ని పొందగా 2021-22 ఆర్థిక సం.నాటికి రూ. 4 లక్షల 92 వేల 33 కోట్లకు తన ఆదాయాన్ని పెంచుకున్నది. ఈ పదేండ్ల కాలంలో పెట్రోలియం ఉత్పత్తుల నుండి రూ.31 లక్షల 55 వేల 495 కోట్ల ఆదాయాన్ని కేంద్ర ప్రభుత్వం పొందింది. మరోవైపు కార్పొరేట్ టాక్స్ సుమారు 10శాతం తగ్గించి బడా పెట్టుబడుదారులకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు కల్పించింది. పేదలను దోచి పెద్దలకు పెట్టడమంటే ఇదే. పది కోట్లమంది రైతులకు రెండు లక్షల కోట్ల రుణమాఫీ చేయడానికి మాత్రం మోడీకి చేతులు రావడం లేదు.

మోడీ అధికారంలో చేపట్టే నాటికి 2014 ఏప్రిల్ మాసంలో అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ పీపా ధర 101.5 డాలర్లు ఉన్నది. అప్పుడు లీటర్ డీజిల్ ధర రూ.49.63, లీటర్ పెట్రోల్ ధర రూ.63.09 ఉండగా నేడు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ పీపా ధర 84.97 డాలర్లే ఉన్నప్పటికీ లీటర్ డీజిల్ ధర రూ.99, లీటర్ పెట్రోల్ ధర రూ.107 ఉన్నాయి. విద్యుత్ వినియోగంలో ప్రి-పెయిడ్ మీటర్లు, స్మార్ట్ మీటర్లు, వ్యవసాయానికి మీటర్లు పెట్టడానికి, పీక్ సమయంలో అధిక చార్జీలు విధించాలని, అదేవిధంగా సబ్‌స్టేషన్ల వారిగా, లైన్ల వారీగా డిస్ట్రిబ్యూషన్ ను కాంట్రాక్టులు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమయింది. ఈ సంస్కరణలు గనుక అమలయితే యూనిట్ విద్యుత్ ధర రూ.20 నుండి 50 వరకు ఉంటుంది. ఆస్ట్రేలియా, ఇండోనేషియాలో ఆదాని కంపెనీల బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైంది. భారతదేశంలో థర్మల్ పవర్‌ప్లాంట్‌లు తాము వినియోగించే బొగ్గులో ఆరు శాతం విదేశీ బొగ్గు దిగుమతి చేసుకోవాలని కేంద్రం ఆదేశించింది. స్వదేశీ బొగ్గు సగటున టన్నుకు రూ.2663కు సరఫరా చేస్తుండగా దిగుమతి చేసుకుంటున్న బొగ్గు ధర టన్నుకు రూ.19,325గా ఉన్నది. దేశంలో 500 సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ, డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేయడానికి కోలిండియా సంస్థలకు, సింగరేణికి అనుమతులు ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేసింది. బొగ్గు బ్లాక్‌లను వేలం వేస్తున్నారు.

ఇదే కాదు...రైల్వేరంగంలో మోడీ ప్రభుత్వం మానిటైజేషన్‌కు పూనుకున్నది. రైల్వే యంత్రాలు, పరికరాలు ఉత్పత్తి చేసే 8 ఫ్యాక్టరీలను, 50 శాతం స్టేషన్లని, 68 వేల కిలోమీటర్ల ట్రాక్‌ను, 500 ప్రయాణికుల రైళ్లను, 300 గూడ్స్ షెడ్లను మోనిటైజేషన్ పేరుతో 35 నుండి 99 ఏండ్ల దేశ, విదేశీ సంస్థలకు నామమాత్రపు ధరతో లీజుకివ్వడానికి ప్రయత్నిస్తున్నది. ప్రయాణికుల టిక్కెట్టు చార్జీలు, సరుకు రవాణా చార్జీలను వారి ఇష్టం వచ్చినట్లు నిర్ణయించుకోవచ్చు. రైల్వే సొమ్మేమో భారతీయులది, సోకు కార్పొరేట్లదన్నమాట. ఎయిరిండియాను టాటాలకు కారుచౌకగా ఇచ్చింది. పోర్టులను, ఎయిర్‌పోర్టులను ఆదానీకి అప్పగిస్తున్నది. ఎఫ్‌సిఐ, సిడబ్ల్యుసి గోదాములను, జాతీయ రహదారులను, ట్రాన్స్‌కో లైన్లను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు లీజుకు ఇవ్వనున్నది.

ఎల్ఐసి విషయానికొస్తే "ప్రజల పొదుపు ప్రజల శ్రేయస్సు కోసమే" అనే నినాదంతో దేశ ఆర్థిక వ్యవస్థలో రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులను పెట్టింది ఆ సంస్థ. 40 కోట్ల వినియోగదారులను కలిగి ఉన్న ఎల్ఐసిని దెబ్బకొట్టడానికి విదేశీ పెట్టుబడులు ఆహ్వానించడం, ఐపిఓను తీసుకు రావడం వంటి ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబించింది. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై 18 శాతం జీఎస్టీ విధించడం మోడీకే చెల్లింది. ప్రభుత్వరంగ బ్యాంకులు 1969 సం.లో 8000 బ్రాంచీలు రూ.5 వేల కోట్ల డిపాజిట్లు కలిగి ఉండగా, 2021 నాటికి లక్షా 18 వేల బ్రాంచ్‌లతో రూ.157 లక్షల కోట్లకు డిపాజిట్లు పెరిగాయి. ఏడాదికి రెండు లక్షల కోట్ల నిర్వహణ లాభాలను ప్రభుత్వరంగ బ్యాంకుల గడిస్తున్నాయి. ప్రజా ఆస్తులను మోడీ బడా కార్పొరేట్ సంస్థలకు లూటీ చేసి పెడుతున్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏప్రిల్ 2014 నుండి మార్చి 2023 వరకు రూ.14 లక్షల 56 వేల కోట్ల బ్యాంక్ రుణాలను రద్దుచేశారు. ప్రభుత్వరంగ సంస్థల ఉద్దేశం ఎక్కువ మందికి ఉపాధి కల్పించడం. వాటి ఉత్పత్తులను, సేవలను ప్రజలకు తక్కువ ధరలకే అందించడం. ప్రభుత్వరంగ ఆస్తులు ప్రజలవి. వాటిని ప్రజలే కాపాడుకోవాలి.

ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసే విధానం కలిగిన బీజేపీని రాబోయే ఎన్నికలలో ఓడించాలి. తాను ఓబిసి ప్రధాన మంత్రినంటాడు. కానీ బీసీ కులగణనకు మాత్రం ఒప్పుకోడు. బీహార్‌లో కులగణను అక్కడి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేసింది. 63శాతం ఓబిసి, ఈబీసీ వర్గాలు ఉన్నాయని తేలింది. ఈ సెన్సెస్ ఆధారంగా బీసీలకు సంక్షేమ పథకాలు కల్పించడానికి తోడ్పడుతుంది (ఇది ఇంకా అమలుకు నోచుకోలేదన్నది వేరే విషయం). మోడీ ప్రభుత్వ హయాంలో బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు సర్వసాధారణమైపోయాయి. స్వదేశీ, దేశభక్తి ముసుగులో విభజన, విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్న కార్పొరేట్ - మతతత్వ శక్తయిన బీజేపీ నిలువరించవల్సిన కర్తవ్యం విజ్ఞులైన భారత ప్రజలపైన ఉన్నది.

# నిరుద్యోగమే ప్రధాన సమస్య



## మోడీ పాలనను
# వెక్కిరించిన ఐఎల్ఓ

**నిరుద్యోగుల్లో 83 శాతం యువతే**

- చదువుకున్నవారిలో మరీ ఎక్కువ
- స్పష్టం చేసిన ఐఎల్ఓ, ఐహెచ్‌డీ నివేదిక
- మోడీ ప్రభుత్వ అసమర్థ నిర్వాకం ఫలితమే: ప్రతిపక్షాల విమర్శ

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

ఉపాధి అవకాశాలు బ్రహ్మాండంగా మెరుగుపరిచామని కేంద్రంలోను, రాష్ట్రంలోను పాలకులు అదే పనిగా చేస్తున్న ప్రచారం ఒట్టి బూటకమని మరోసారి స్పష్టమైంది. భారత్‌లో ఉపాధి పరిస్థితి భయంకరంగా ఉందని, నిరుద్యోగిత రేటు, కీలక లేబర్ సూచీలు 2000-2018 మధ్య ఉపాధిలో దీర్ఘకాలిక క్షీణతను సూచిస్తున్నాయని, నిరుద్యోగ సైన్యంలో 83 శాతం మంది యువతేనని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ), ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ (ఐహెచ్‌డీ) తాజాగా వెల్లడించాయి. ఈ రెండు సంస్థలు సంయుక్తంగా రూపొందించిన 'ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్ 2024'ను ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి. అనంత నాగేశ్వరన్ మంగళవారం నాడిక్కడ విడుదల చేశారు. "దేశంలో నిరుద్యోగ సమస్య యువతలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని విద్యావంతులలో ఎక్కువగా ఉంది" అని ఆయన తెలిపారు

నిరుద్యోగుల్లో విద్యావంతులైన యువకులు 2000లో 35.2 శాతం మంది ఉండగా, 2022లో ఇది 65.7 శాతానికి అంటే రెండింతలు పెరిగినట్టు ఆ నివేదిక పేర్కొంది. అలాగే చదువుకున్న నిరుద్యోగుల్లో పురుషుల (62.2 శాతం) కంటే స్త్రీలు (76.7 శాతం) ఎక్కువగా ఉన్నారని తెలిపింది. దేశంలోని పట్టణ ప్రాంత యువ విద్యావంతులలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా కేంద్రీకృతమైందని ఈ నివేదిక పేర్కొంది. 2019లో ఉపాధిలో కొంచెం పెరుగుదల కనిపించినా, కోవిడ్ మహమ్మారి సమయంలో మళ్లీ క్షీణించిందని నివేదిక తెలిపింది. 2000లో మొత్తం ఉపాధి యువత జనాభాలో సగం మంది స్వయం ఉపాధి పొందారు. 13 శాతం మంది రెగ్యులర్ ఉద్యోగాలు కలిగి ఉన్నారు. మిగిలిన 37 శాతం మంది క్యాజువల్ ఉద్యోగాలు కలిగి ఉన్నారు.

మరోవైపు మరో దశాబ్దంలో దేశంలో యువ శ్రామిక శక్తి 7-8 మిలియన్లు (70-80 లక్షలు) చేరుకుంటుందని ఈ అధ్యయనం తెలిపింది. ఈ నేపథ్యంలో ఐదు కీలక విధాన రంగాలపై దృష్టి సారించాలని సూచించింది. ఉద్యోగ సృష్టిని ప్రోత్సహించడం, ఉపాధి నాణ్యతను మెరుగుపరచడం, కార్మిక మార్కెట్‌లో అసమానతలను పరిష్కరించడం, క్రియాశీల కార్మిక మార్కెట్‌తోపాటు లేబర్ మార్కెట్ నైపుణ్యాలు, విధానాలు బలోపేతం చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించింది.

ఈ సందర్భంగా నాగేశ్వరన్ మాట్లాడుతూ, 'ప్రతి సామాజిక, ఆర్థిక సమస్యకు' ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని భావించడం 'సరి కాదు' అని అన్నారు. "మనం ఈ ఆలోచన నుండి బయటపడాలని సుద్దులు చెప్పారు. ప్రధాన ఆర్థిక సలహాదారు వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ నివేదిక నరేంద్ర మోడీ ప్రభుత్వ అసమర్థ నిర్వాకానికి తిరుగులేని తార్కాణమని పేర్కొన్నాయి. యువత భవిష్యత్తును మోడీ ప్రభుత్వం నాశనం చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. నిరుద్యోగ టైం బాంబ్‌పై యువత కూర్చొన్నదని ఆయన అన్నారు.. నిరుద్యోగం వంటి అన్ని సామాజిక, ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేదని మోడీ ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుడు చెబుతూ తమ ప్రియమైన నాయకుడ్ని రక్షిస్తున్నార ఆయన విమర్శించారు. 2012తో పోల్చితే మోడీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువత శాతం మూడు రెట్లు పెరిగిందన్నారు. పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడీ హామీ ఇచ్చారని, అయితే యువత నుంచి 12 కోట్ల ఉద్యోగాలు లాక్కున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో నిరుద్యగ సమస్య పరిష్కారం కోసం 'యువ న్యాయ్' పథకాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిందని ఖర్గే తెలిపారు.

సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ స్పందిస్తూ ఉపాధి విషయంలో దేశంలోని యువకులు అత్యంత దుర్భరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారనడానికి ఐఎల్ఓ నివేదిక ఒక తిరుగులేని ఉదాహరణ అని అన్నారు.

**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. వివిధ రాజకీయ పార్టీలు ప్రచారంలో మునిగితేలుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ, ఇతర బీజేపీ నేతలు ప్రధానంగా పేదలు, యువత, మహిళలు, రైతులను దృష్టిలో పెట్టుకొని హామీల వరద పారిస్తున్నారు. దేశంలో కుల రాజకీయాలకు తావే లేదని చెబుతూ ఈ వర్గాలనే 'నాలుగు కులాలు'గా వారు అభివర్ణిస్తున్నారు. ఈ నాలుగు వర్గాల అభ్యున్నతే తమ లక్ష్యమంటూ ఓటర్లను నమ్మించేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా యువ ఓట్లపై కమలనాథులు కన్నేస్తున్నారు. ప్రధాని మోడీ తన 110వ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో కూడా తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్న యువతకు హితబోధలు చేశారు. 'మేరా పెహలా ఓట్ దేశ్‌కే లియే' అని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

ఈ హామీల సంగతి ఎలా ఉన్నా ఓ ముఖ్యమైన ప్రశ్న ముందుకు వస్తోంది. బీజేపీ అజెండా నిజంగానే యువత ముఖ్యంగా నిరుద్యోగుల ఆందోళనను పరిగణనలోకి తీసుకున్నదా? లోక్‌నీతి-సీఎస్‌డీసీ సర్వే అందించిన వివరాలను పరిశీలిస్తే దేశ రాజధాని ఢిల్లీ ఓటర్ల నాడి తెలుస్తోంది. ఈ నెల మొదటి వారంలో ఈ సర్వేను నిర్వహించారు. ఢిల్లీలోని 611 మంది విద్యార్థులను ప్రశ్నించి వారి నుండి సమాచారాన్ని రాబట్టారు.


### ఉద్యోగం సంపాదించడం కష్టమే

ఇటీవలి కాలంలో ఉద్యోగావకాశాలు పరిమితమై పోయాయని యువత అభిప్రాయపడింది. గత రెండు సంవత్సరాల కాలంలో ఉద్యోగం సంపాదించడం కష్టమైందని 55శాతం మంది అభిప్రాయపడగా బాగా కష్టమైపోయిందని 25 శాతం మంది చెప్పారు. ఉద్యోగం సులభంగానే దొరుకుతోందని కేవలం 16 శాతం మంది తెలుపగా చాలా తేలికగా దొరుకుతోందని 3 శాతం మంది అన్నారు. దేశం ఆర్థికాభివృద్ధి సాధిస్తోందని పాలకులు గొప్పలు చెప్పుకుంటుండగా ఉద్యోగ కల్పన అనేది అతి పెద్ద సవాలుగా మారింది. ఈ అనిశ్చితి భవిష్యత్ ఉద్యోగావకాశాలపై యువత అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తోంది. చాలా మంది యువతీ యువకులు ఉద్యోగావకాశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తమ విద్యార్హతకు తగిన ఉద్యోగాలు లభించడం లేదన్న బాధ వారిలో వ్యక్తమవుతోంది.




### ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేరాలి

నిరుద్యోగ యువతలో 47శాతం మంది తాము ఉద్యోగాల సృష్టికర్తలు కావాలని కోరుకుంటున్నారు. 27శాతం మంది మాత్రం ఉద్యోగాలు చేసేందుకే ఇష్టపడుతున్నారు. ఉద్యోగాలు ఇవ్వడానికి అవసరమైన వనరులు లేవని 12శాతం మంది స్పష్టం చేశారు. ప్రతి ఐదుగురు యువకుల్లో ముగ్గురు తాము ఉద్యోగాలు ఇవ్వడాన్నే ఇష్టపడతామని చెప్పారు. మహిళల్లో మాత్రం అలా చెబుతున్న వారి సంఖ్య తక్కువగానే ఉంది. ప్రతి ఐదుగురిలో ఇద్దరు మాత్రమే తాము ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేరాలని కోరుకుంటున్నారు. ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలని కామర్స్ విద్యార్థులు ఎక్కువగా (54శాతం) ఆశిస్తున్నారు. సైన్స్ (48 శాతం), ఆర్ట్స్ (39 శాతం) విద్యార్థులు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు.




### ప్రభుత్వోద్యోగమే బెటర్

విద్యార్హతలకు తగిన ఉద్యోగం లభిస్తుందని 24% మంది మాత్రమే ఆశాభావంతో ఉన్నారు. ఆ అవకాశం కొంత వరకూ ఉన్నదని 49% మంది అంటే పెద్దగా లేదని 16% మంది చెప్పారు. 10% మంది మాత్రం తమ చదువుకు, దొరికే ఉద్యోగానికి సంబంధమే ఉండదని కుండబద్దలు కొట్టారు. భద్రతతో కూడిన స్థిరమైన ఉద్యోగాలు కావాలని యువత కోరుకుంటోంది. ప్రతి ఐదుగురిలో ముగ్గురు ప్రభుత్వోద్యోగాన్ని ఆశిస్తున్నారు.

### మోడీ సర్కారు వైఫల్యం

ఉద్యోగాలు ఎవరు కల్పించాలని అడిగిన ప్రశ్నకు మెజారిటీ విద్యార్థులు, యువత ప్రభుత్వమేనని సమాధానం చెప్పారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమే ఉద్యోగాలు ఇవ్వాలని 30శాతం మంది... అంటే ప్రతి పది మందిలో ముగ్గురు చెప్పగా అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఢిల్లీ ప్రభుత్వానిదే ఆ బాధ్యత అని 14శాతం మంది తెలిపారు. ఉద్యోగాలు ఇవ్వాల్సింది ప్రభుత్వాలు కాదని, ప్రజలేనని 35శాతం మంది అభిప్రాయపడ్డారు. భారత్‌లోనే కాదు...అన్ని దేశాలలోనూ ఉద్యోగాల సంఖ్య తగ్గిపోతోందని 9శాతం మంది అన్నారు. ఉద్యోగాల కల్పనలో ఆశించిన పురోగతి కన్పించడం లేదని యువత ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఉద్యోగ కల్పనలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని 16శాతం మంది స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వం ప్రయత్నించింది కానీ విఫలమైందని 55శాతం మంది చెప్పారు. ఉద్యోగ కల్పనలో కేంద్రం విజయవంతమైందని కేవలం 25శాతం మంది మాత్రమే తెలిపారు.

**ఓటర్లపై ప్రభావం చూపే అంశం ఇదే**

- తర్వాతి స్థానం ద్రవ్యోల్బణం
- ఉద్యోగ కల్పనలో మోడీ విఫలమయ్యారు : లోక్‌నీతి-సీఎస్‌డీసీ సర్వేలో రాజధాని ఓటర్ల మనోగతం

### ఓటింగ్‌పై ప్రభావం చూపేవి ఇవే

నిరుద్యోగం, ద్రవ్యోల్బణం ప్రధాన సమస్యలుగా ఉన్నాయని రాజధానిలోని యువ ఓటర్లు తెలియజేశారు. తమ ఓటింగ్ నిర్ణయంపై ఈ అంశాలు ప్రభావం చూపుతాయని ప్రతి ఐదుగురిలో నలుగురు చెప్పారు. ఈ రెండింటిలోనూ నిరుద్యోగ సమస్యనే వారు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ఓటింగ్ నిర్ణయంపై నిరుద్యోగం ప్రభావం చూపుతుందని 41శాతం మంది, ద్రవ్యోల్బణం ప్రభావం చూపుతుందని 23శాతం మంది చెప్పారు. నరేంద్ర మోడీ నాయకత్వం ప్రభావం 12శాతం మాత్రమేనని యువత తెలిపారు. తమ ఓటింగ్‌పై అవినీతి ప్రభావం చూపుతుందని 9శాతం మంది, రామమందిరం ప్రభావం చూపుతుందని 5శాతం మంది, మతపరమైన గుర్తింపు ప్రభావం చూపతుందని 2శాతం మంది మాత్రమే అన్నారు. ప్రభుత్వ పథకాల లబ్దిదారుల ప్రభావం కేవలం 1శాతం మాత్రమేనని చెప్పారు. సర్వే వివరాలను విశ్లేషిస్తే నిరుద్యోగం ప్రధాన సమస్యగా ఉన్నదని అర్థమవుతోంది.

# కార్పొరేట్లకు ఊడిగం చేసే బీజేపీని ఓడించండి




**ప్రజా సమస్యలపై పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించండి**

- ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

**నవతెలంగాణ-రామన్నపేట**

దేశ ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న బీజేపీని ఓడించి గద్దె దించాల్సిన అవసరముందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ.జహంగీర్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే జహంగీర్‌ను ప్రజలు ఆదరించి గెలిపించాలని పిలుపునిచ్చారు. 35 ఏండ్లుగా ప్రజా ఉద్యమాలకు సారథ్యం వహించిన మచ్చలేని నాయకుడు జహంగీర్ అని చెప్పారు. బీజేపీ అవినీతిని చట్టబద్ధం చేసి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో లక్షల కోట్లను ఎన్నికలకు ఉపయోగించుకుంటోందని అన్నారు. అవినీతి లేని దేశాన్ని నిర్మిస్తామని చెబుతున్న బీజేపీ ప్రభుత్వం.. గనులను దోచుకున్న గాలి జనార్ధన్‌ను మళ్లీ ఆ పార్టీలోకి ఎలా చేర్చుకుందని ప్రశ్నించారు. సీబీఐ, ఈడీ వంటి సంస్థల ద్వారా ప్రాంతీయ పార్టీలను ప్రలోభపెట్టి ప్రజా స్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తోందని, ఈ కోవలోనే ముఖ్యమంత్రులు సోరేన్, కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించిందని విమర్శించారు.

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. వరి పంటకు రూ.500 బోనస్ ఈ యాసంగి నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, వ్యవసాయ పరికరాలపై సబ్సిడీ కొనసాగించి, కరువు మూలంగా నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు పది లక్షల ఎకరాల భూమిని పంచారని.. అందులో భువనగిరి పార్లమెంటు పరిధిలోనే నాలుగు లక్షల ఎకరాల భూమి పంచారన్నారు. అలాంటి మహాపోరాట యోధుల వారసుడిగా ముందుకొస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు జహంగీర్ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేక అశోక్ రెడ్డి, మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



**మత్తులో విద్యార్థులను**
## బాదిన ఉపాధ్యాయుడు

- గగ్గోలు పెట్టిన అమ్మాయిలు
- ఆగ్రహించి ఉపాధ్యాయుడిని నిర్బంధించిన తల్లిదండ్రులు

**నవతెలంగాణ-చర్ల**

"మా సారు రోజూ బడికి ఆలస్యంగా రావడంతో పాటు, బాగా తాగి వచ్చి మమ్మల్ని పచ్చికర్రలతో ఇష్టమొచ్చినట్టు కొడుతున్నాడు. మీకు దిక్కున చోట చెప్పుకోండి అంటూ బాగా తిడుతున్నాడు. ఈ హిందీ మాస్టారు మాకు వద్దు.. మమ్మల్ని చంపేసేటట్టున్నాడు. కలెక్టరమ్మ మాకు మంచి మాస్టారును పంపండి.." అంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం గొమ్ము పులిబోయిన పల్లి గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు వేడుకుంటున్నారు. పాఠశాలకు మద్యం మత్తులో రావడంతో పాటు విద్యార్థులను ఇష్టానుసారంగా కొట్టే ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలంటూ బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎంపీయూపీఎస్‌జీపీ పల్లిలో విధులు నిర్వహిస్తున్న హిందీ ఉపాధ్యాయుడు బానోత్ కిషన్ రోజూ మద్యం తాగి ఇష్టానుసారంగా పరుష పదజాలాలు వాడుతూ విద్యార్థులను, అమ్మాయిలని కూడా చూడకుండా పచ్చికర్రలతో ఎక్కడపడితే అక్కడ కొట్టి "నీ తల్లిని తీసుకురా పో" అంటూ దురుసుగా మాట్లాడుతున్నాడని విద్యార్థులు వాపోయారు. బుధవారమూ ఇలానే ప్రవర్తించడంతో విసిగిపోయిన విద్యార్థులు తమ ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులకు చెప్పారు. కాయాకష్టం చేసుకుని జీవనం సాగించే తల్లిదండ్రులు అసలు విషయం ఏమిటని తెలుసుకునేందుకు పాఠశాలకు వచ్చారు. ఆదర్శవంతంగా ఉండి విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు మద్యం మత్తులో ఊగడాన్ని గమనించి ఆగ్రహంతో అతన్ని ఓ గదిలో నిర్బంధించారు. విషయం తెలుసుకున్న పాత్రికేయులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడిని ప్రశ్నించగా.. "నేను తాగి వచ్చానని కొద్దిసేపు.. నేను అసలు తాగలేదని మరోసారి.. మీరు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పవలసిన అవసరం నాకు లేదు" అంటూ ఇష్టానుసారంగా ప్రవర్తించాడు. దాంతో ఉపాధ్యాయుడి వ్యవహార శైలిపై మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్ దృష్టికి విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకొని వెళ్లారు. దాంతో స్కూల్ కాంప్లెక్స్ నుంచి ఓ ఉపాధ్యాయుడిని వెంటనే పంపించి పరిశీలించగా.. ఆ ఉపాధ్యాయుడికి సైతం పొంతనలేని సమాధానం చెబుతూ తన ఇష్టమని, పై అధికారులు కూడా తనను ఏమీ చేయలేరంటూ మాట్లాడటం కొసమెరుపు. మద్యం మత్తులో విద్యార్థుల పట్ల అసభ్యకరంగా మాట్లాడటం, కొట్టడం చేసే ఉపాధ్యాయుడిని కలెక్టర్, ఐటీడీఏ పీవో చొరవ చూపి వెంటనే సస్పెండ్ చేసి జీతభత్యాలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలలపై పర్యవేక్షణ లేక ఇటువంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయని, పాఠశాలల పర్యవేక్షించే మండల విద్యాశాఖ అధికారి స్థానికంగా ఉండాలని తల్లిదండ్రులు ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

## జమ్ముకాశ్మీర్‌లో ఎఎఫ్ఎస్‌పిఎ రద్దును పరిశీలిస్తున్నాం : అమిత్ షా




**న్యూఢిల్లీ :** జమ్ముకాశ్మీర్‌లో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎఎఫ్‌సిఎ)ను రద్దు చేసే అవకాశాన్ని పరిశీస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపారు. జెకె మీడియా గ్రూప్‌నకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని, శాంతిభద్రతలను జమ్ముకాశ్మీర్ పోలీసులకే వదిలివేయాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుకు కట్టుబడి సెప్టెంబరులోగా జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. గత ఐదేళ్లలో నకిలీ ఎన్‌కౌంటర్లేమీ జరగలేదన్నారు. తీవ్రవాదులకు నిధుల అంశంపై 22కు పైగా కేసులు నమోదు చేశామని, రూ.150 కోట్ల విలువైన ఆస్తులను స్తంభింపజేశామని చెప్పారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించి, సమస్యలు పరిష్కరించాలి



**తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్**

- మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన కార్మికులు
- సానుకూలంగా స్పందించిన కమిషనర్

**నవతెలంగాణ-కామారెడ్డి**

మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్మికులు కామారెడ్డి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన నిర్వహించారు. కార్యాలయం డోర్ గడియ బిగించి కార్యాలయం ఎదుట బైటాయించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. మున్సిపాల్టీలో పని చేస్తున్న వందలమంది కార్మికులకు వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఏరియర్స్ చెల్లించాలని మున్సిపల్ సానిటేషన్, వాటర్ వర్క్స్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి మున్సిపాలిటీలో 30 ఏండ్లుగా వివిధ రకాల పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న వాటర్ సప్లయ్, ఎలక్ట్రిషియన్, పార్కుల్లో ఇతర కేటగిరీల్లో పనులు నిర్వహిస్తున్న 350 మంది కార్మికులతో పాటు పట్టణం విస్తరించడంతో అవసరాల నిమిత్తం నాలుగేండ్ల క్రితం 100 మంది కార్మికులను శానిటేషన్ పనుల కోసం విధుల్లోకి తీసుకున్నట్టు గుర్తుచేశారు. పాత కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలు, వారికి అందించే ఇతర పథకాలు, అలవెన్స్‌లు కొత్తవారికి అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలల నుంచి ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు కూడా చెల్లించడం లేదనీ, ఇది చట్టరీత్యా నేరమని తెలిపారు. అనంతరం కామారెడ్డి మున్సిపాలిటీలో కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అందరితో పాటు సమానంగా చెల్లించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుజాత స్పందిస్తూ.. నేడు ఒక నెల వేతనం, వారం రోజుల్లో రెండు నెలల వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అలాగే వాటర్ వర్క్స్ కార్మికులకు నాలుగేండ్ల ఏరియాస్, వారాంత సెలవులు, సంవత్సరానికి 15 క్యాజువల్ లీవులు ఇస్తామని, వందమంది కార్మికులతోపాటు అన్ని కేటగిరీల కార్మికులకు రూ.17,600 వేతనాన్ని ఏప్రిల్ నెల నుంచి అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజనర్సు, కార్యదర్శులు మహబూబ్, పోతారం ప్రభాకర్, దీపక్, నాయకులు దీవెన, జి.లక్ష్మి, భూదేవి, ఎర్రోళ్ల నరసవ్వ, జ్యోతి, కళావతి, గంగవ్వ, జనార్ధన్, ఎల్ శంకర్, ప్రభు, విజయ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు జైలుకెళ్లడం తథ్యం

- బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

లిక్కర్ దందా కేసులో కవిత జైలుకెళ్లిన మాదిరిగానే రేపోమాపో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్, డ్రగ్స్ దందా, భూకబ్జాల్లో కేటీఆర్, కాళేశ్వరం అవినీతిలో హరీశ్‌రావు జైలుకెళ్లడం తప్పదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డిపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుబట్టారు. గత ప్రభుత్వంలో షాడో సీఎంగా వ్యవహరించిన కేటీఆర్ ఈసారి సీఎం కావాలని కలలు కన్నాడనీ, రాష్ట్ర ప్రజలు మాత్రం కేసీఆర్ కుటుంబ పాలన వద్దని ఓడించారని చెప్పారు. అధికారం చేజారటంతో కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు చేయించడంలోనూ, ఎంఎంటీఎస్ రెండో దశ విస్తరణ, రీజనల్ రింగురోడ్డు, దానికి సమాంతరంగా రైల్వే లైన్‌ను తీసుకురావడంలో కిషన్‌రెడ్డిదే కీలక పాత్ర అని వివరించారు. కేంద్ర ప్రభుత్వం రూ. 200 కోట్లతో చర్లపల్లి టర్మినల్ ను అభివృద్ధి చేస్తుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం భూమి కూడా ఇవ్వలేదని విమర్శించారు. సీఎం కోరగానే కంటోన్మెంట్ పరిధిలో రక్షణశాఖకు చెందిన భూమిని తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిందని తెలిపారు. ప్రధాని మోడీని విమర్శించే ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## ఆర్థిక ఇబ్బందులతో.. భార్యాభర్తల ఆత్మహత్య

**నవతెలంగాణ-జనగామ**

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో భార్యాభర్తలిద్దరూ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని మధురైకు చెందిన దంపతులు సెల్వరాజ్ (55), భాగ్యలక్ష్మి (46).. పట్టణంలోని రివర్స్ కాలనీలో ఆహార ఉత్పత్తుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా వారి వ్యాపారం సరిగ్గా సాగక.. అప్పుల పాలయ్యారు. దీంతో మనస్తాపం చెందిన వారు.. బుధవారం తెల్లవారుజామున ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కొద్ది రోజులుగా వీరిద్దరి మధ్య కలహాలు చోటు చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై జనగామ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## చికెన్ ధరలు
### హైదరాబాద్
**బ్రాయిలర్ చికెన్**

| | | |
|---|---|---|
| ఫారం రేటు | రూ. | 118 |
| రిటైల్ (లైవ్) | రూ. | 140 |
| స్కిన్‌తో | రూ. | 203 |
| స్కిన్‌లెస్ | రూ. | 231 |



## హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

| | | |
|---|---|---|
| 24 క్యారెట్లు | - 63,930 | ▲ 220 |
| 22 క్యారెట్లు | - 61,350 | ▲ 200 |
| కిలో వెండి | - 80,200 | ▲ 300 |

# పేరుకే జిల్లా అధ్యక్షులు..!

- నామమాత్రంగా కొన్ని ప్రాంతాలకే పరిమితం
- జిల్లా అంతటా కనిపించని జోష్, ఉత్సాహం
- పార్లమెంట్ ఎన్నికలపై ఎఫెక్ట్ పడే ఛాన్స్

**జిల్లాల్లో తమ పార్టీలను బలోపేతం చేస్తూ, అన్ని నియోజకవర్గాల పార్టీ క్యాడర్‌కు దిక్సూచిలా ఉండాల్సిన ప్రధాన రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులు నామమాత్రంగా మారిపోతున్నారు. కొందరు వారి నియోజకవర్గాలకే పరిమితమవుతుండగా.. మరికొందరు మేజర్ ఏరియాల్లోనే కనిపిస్తున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఆశించి భంగపడటంతోనే ఆయా రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులు ఇలా వ్యవహరిస్తున్నారనే చర్చ జోరుగా జరుగుతోంది.**




నవతెలంగాణ- సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. జిల్లాకు హెడ్ క్వార్టర్‌గా మేడ్చల్ ఉంది. ప్రధాన రాజకీయ పార్టీల్లో బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కాంగ్రెస్‌కు గతంలో నందికంటి శ్రీధర్, ప్రస్తుతం సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని జిల్లా అధ్యక్షులుగా నియమించారు. బీజేపీలో జిల్లాను అర్బన్, రూరల్‌గా విభజించి రూరల్‌కు విక్రంరెడ్డి, అర్బన్‌కు హరీశ్‌రెడ్డిని జిల్లా అధ్యక్షులుగా నియమించారు. శంభీపూర్ రాజు కుత్బుల్లాపూర్, హరివర్ధన్‌రెడ్డి, విక్రంరెడ్డి మేడ్చల్, హరీష్‌రెడ్డి కూకట్‌పల్లి నియోజకవర్గాలకు చెందిన నాయకులు.

**బీఆర్ఎస్ అధ్యక్షుడు ఇలా..**

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు జిల్లాపై ఏమాత్రం పట్టు సాధించకుండా, కేవలం తన నియోజకవర్గానికే పరిమితమయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నాయకుడు కావడంతో ఇక్కడి నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి కనబర్చారు. టికెట్ దక్కకపోవడంతో సైలెంట్ అయ్యారు. ఆ తర్వాత మల్కాజిగిరి మినహా ఇతర నియోజకవర్గాల్లో ఎక్కడా కనిపించలేదు. పార్లమెంట్ ఎన్నికల సమయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన పార్లమెంట్ ముఖ్య నాయకుల సమావేశంలో తప్ప ఎక్కడా పెద్దగా కనిపించడం లేదు. ఎమ్మెల్యే టికెట్టు దక్కకపోవడం, పార్లమెంట్ ఎన్నికల నాటికి పార్టీ అధికారంలో లేకపోవడమే ఇందుకు కారణం అంటూ ప్రచారం జరుగుతోంది.

**కాంగ్రెస్‌లో కలవరం..**

అసెంబ్లీ ఎన్నికల చివరి వరకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నందికంటి శ్రీధర్ సైతం ఒక్క నియోజకవర్గానికే పరిమితమయ్యారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోనే పర్యటించారు. అసెంబ్లీ టికెట్టు ఆశించి దక్కకపోడంతో బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఆ తర్వాత మేడ్చల్ అసెంబ్లీ టికెట్ ఆశించిన హరివర్ధన్‌రెడ్డి జిల్లా అధ్యక్షులుగా నియమితులయ్యారు. కానీ టికెట్ రాకపోవడంతో తీవ్ర అసంతృప్తిలో ఉన్న ఈయన సొంత నియోజకవర్గమైన మేడ్చల్‌లో పార్టీ అభ్యర్థి వజ్రేష్ యాదవ్ తరపున సరైన ప్రచారం చేయలేదనే విమర్శలు వచ్చాయి. మల్కాజిగిరి ఎంపీ టికెట్టు కూడా దక్కకపోవడంతో హరివర్ధన్‌రెడ్డి ఇటీవల తూంకుంటలో నిర్వహించిన మేడ్చల్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ముందే తన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో తనకు ప్రాధాన్యత తగ్గుతోందనీ, అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్లు దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు బహిరంగంగానే చెప్పారు. దీంతో ఈసారి కూడా పార్టీ ఎంపీ అభ్యర్థికి సహకరిస్తారా..? లేదా..? అనే చర్చ జరుగుతోంది.

**బీజేపీ అధ్యక్షులు ఇలా..**

బీజేపీ రూరల్, అర్బన్ అధ్యక్షులు కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితం అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. విక్రంరెడ్డి, హరీశ్‌రెడ్డి సైతం అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారి నియోజకవర్గాలకే పరిమితమై ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటముల్లో కీలక పాత్ర పోషించలేదు. కొద్ది రోజుల కిందట హరీశ్‌రెడ్డి పార్టీకి రాజీమానా చేశారు.

**గ్రూపు రాజకీయాలతో సతమతం**

అప్పటి, ఇప్పటి కాంగ్రెస్ అధ్యక్షులు నందికంటి శ్రీధర్, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా పోటీ చేయాలనుకున్నారు. పట్టు కోసం నందికంటి శ్రీధర్ మల్కాజిగిరి, హరివర్ధన్‌రెడ్డి మేడ్చల్ నియోజకవర్గాలకే అధిక సమయం కేటాయించారు. జిల్లాలో ఆ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే లేకపోయినా జిల్లా అధ్యక్షుడిగా ఇద్దరూ.. అప్పుడు, ఇప్పుడు ఎక్కడా తిరిగిన దాఖలాల పెద్దగా లేవు. అన్ని నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ గ్రూపు రాజకీయాలతో సతమతం అవుతున్నా జిల్లా అధ్యక్షులు పోషించాల్సిన పాత్ర, ముద్ర ఎక్కడా కనిపించడం లేదు. ఇలా బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అంటీముట్టనట్టుగా వ్యవహరించడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మినహా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తీవ్ర నష్టమే జరిగిందనే చర్చ వచ్చింది. జిల్లాలో ఈ రెండు పార్టీలూ ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా గెలుచుకోలేకపోయాయి. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే సీన్ రిపీట్ అవుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పుడీ ప్రమాదం బీఆర్ఎస్‌కూ పొంచి వుంది. ఆయా ప్రాంతాల్లో సొంత పార్టీ నాయకులే తిరుగుబాటు బావుట ఎగరేసినా జిల్లా అధ్యక్షులు సముదాయించడానికి ప్రయత్నాలు చేయడం లేదు.

## గ్యారెంటీలు పోయి.. గారడీలు షురూ..

(మొదటిపేజీ తరువాయి)

ఓటేయండి...' అంటూ కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఆ ఎంపీ స్థానం పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అయితే అక్కడి నుంచి టిక్కెట్ ఆశించి భంగపడ్డ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాత్రం డుమ్మా కొట్టారు. సమీక్ష సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... మల్కాజిగిరి ఎంపీ స్థానం నుంచి పోటీకి దిగాలంటూ తాను ముఖ్యమంత్రి రేవంత్‌కు సవాల్ విసిరితే... ఆయన ఇంత వరకూ స్పందించ లేదని ఎద్దేవా చేశారు. అక్కడ పోటీ చేస్తే ఓడిపోతాననే భయం రేవంత్‌కు పట్టుకుందని వ్యాఖ్యానించారు. మల్కాజిగిరిలో బీఆర్ఎస్‌కు తిరుగులేదన్న విషయం సీఎంకు తెలుసుననీ, అందుకే ఆయన తన సవాల్‌పైన స్పందించటం లేదన్నారు. సచివాలయంలో లంకెలు బిందెలున్నాయంటూ గతంలో రేవంత్ మాట్లాడారనీ, వాటి సంగతేమోగానీ ఇప్పుడు హైదరాబాద్‌లో నీరు దొరక్క ఖాళీ బిందెలు దర్శనమిస్తున్నాయని తెలిపారు. మాట్లాడితే రాష్ట్రాన్ని గుజరాత్ మోడల్‌గా తీర్చిదిద్దుతానంటూ ముఖ్యమంత్రి అంటున్నారనీ, గుజరాత్ మోడల్ అంటే గోధ్రా హింసా? పేదలపైకి బుల్డోజర్లు తీసుకొస్తారా? అని ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్లటం ఖాయమని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్‌కు చెందిన 30, 40 మంది ఎమ్మెల్యేలతో ఆయన ఫ్లేటు ఫిరాయించటం ఖాయమని అన్నారు. ఈ అంశంపై సీఎం ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. దేశంలో ఆయన తిరగని పార్టీ అంటూ లేదని ఎద్దేవా చేశారు. అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయటాన్ని రాహుల్ గాంధీ తప్పుబట్టారనీ, అది అన్యాయమంటూ ఖండించారని గుర్తు చేశారు. కానీ అదే కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేస్తే మాత్రం రేవంత్ స్పందించటం లేదని వాపోయారు. స్కాములు, స్కీములు, ట్యాపింగ్‌ల పేరుతో ఎందుకు డ్రామా లాడుతున్నాంటూ సీఎంను ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం సంక్షోభంలో చిక్కుకున్నా, కరువు కోరలు చాస్తున్నా ప్రభుత్వానికి పట్టటం లేదని కేటీఆర్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

**గజ్వేల్‌లో ఓడి..మల్కాజిగిరికి...**

**ఈటలపై సెటైర్లు**

సమీక్ష సందర్భంగా మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై కేటీఆర్ సెటైర్లు విసిరారు. అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్‌లో ఓడిన ఆయన ఇప్పుడు మల్కాజిగిరికి వచ్చారంటూ ఎద్దేవా చేశారు. గతంలో హుజూరాబాద్ ఉప ఎన్నికలో ఆయన సెంటిమెంటుతోనే గెలిచారని అన్నారు. మల్కాజిగిరికి బీజేపీ, ప్రధాని మోడీ ఏం చేశారంటూ ప్రశ్నించారు. ఆ పార్టీకి ప్రజలు ఎందుకు ఓట్లేయాలంటూ నిలదీశారు. కార్పొరేట్లకు రూ.14.50 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన మోడీ, రైతుల రుణాల గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. అలాంటి బీజేపీలో ఉన్న ఈటల రైతు రుణమాఫీ గురించి మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు.

**బీఆర్ఎస్‌కు రంజిత్ రెడ్డి ద్రోహం**

బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడం ద్వారా చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి బీఆర్ఎస్‌కు ద్రోహం చేశారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలతో ఆయన సమావేశమయ్యారు. బీఆర్ఎస్ నుంచి గెలిపించుకున్నాకే రంజిత్ రెడ్డి ఎవరో ప్రపంచానికి తెలిసిందని చెప్పారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయను అని పార్టీ ముందు అశక్తతను వ్యక్త్యం చేసి, రాజకీయాల నుంచి తప్పుకుంటాను అని చెప్పిన రంజిత్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన స్వార్థపరుడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల ముందు పార్టీ వీడిన కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ఎదురైన ఫలితమే రంజిత్ రెడ్డికి చవి చూస్తారని హెచ్చరించారు. ఒక పార్టీ కన్నా తానే పెద్ద అనే అహంకారం ఉన్న వ్యక్తులు రాజకీయాల్లో గెలవరని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, రంజిత్ రెడ్డిల మనసులు కలిసినంత మాత్రాన, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో కలిసిపోతారనుకోవడం వారి రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కు చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ సొంతంగా అభ్యర్థిని నిలబెట్టలేదనీ, ఆయా స్థానాల్లో ఆ పార్టీ గెలవడం అసాధ్యమన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో 13వ తేదీన కేసీఆర్ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ బీసీల హక్కుల కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న మంచి మనిషి అని తెలిపారు.

## గురుకుల డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో దరఖాస్తులకు ఆహ్వానం

- ఎంజేపీ కార్యదర్శి సైదులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గురుకుల డిగ్రీ, జూనియర్ కాలేజీలకు దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల సొసైటీ (ఎంజేపీ) కార్యదర్శి సైదులు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. బీసీలకు 29 రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులకు 9,120 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గురుకుల జూనియర్ కాలేజీలు 261 ఉండగా బాలికలకు 127 కాలేజీల్లో 10,560 సీట్లు , బాలురకు 130 కాలేజీల్లో 11,360 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఎంట్రెన్స్ ద్వారా అడ్మిషన్లు పొందాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవటానికి వచ్చేనెల 12 చివరితేదీ కాగా, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 28న ఉంటుందని తెలిపారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు ప్రవేశాలను కల్పిస్తామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 28 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామనీ, ఏప్రిల్ 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అమ్మాయిల కోసం 15, అబ్బాయిల కోసం 14 గురుకుల డిగ్రీ కాలేజీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఈ విద్యా సంవత్సరం 9,120 సీట్లను భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

## లైసెన్స్ లేని మెడికల్ షాప్ మూసివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలో లైసెన్స్ లేని మెడికల్ షాపును అధికారులు సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు జి.నర్సింహ ఎలాంటి అనుమతి లేకుండా మెడికల్ షాపును నడుపుతున్నట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు గుర్తించారు. అవసరమైన అర్హతలు లేకుండా తనను రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్‌గా చెప్పుకుంటూ క్లినిక్ నడుపుతున్న మంతరాల రంతూ భాషాకు చెందిన క్లినిక్‌లో ఈ మెడికల్ షాపు ఉన్నది. రెండు చోట్లా రూ.1.15 లక్షల విలువైన 145 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా టాస్క్‌ఫోర్స్‌తో కలిసి డీసీఏ అధికారులు హైదరాబాద్ మెహిదీపట్నం, ఆసిఫ్ నగర్‌లో చట్ట వ్యతిరేకంగా పల్స్ యునిసెక్స్ ఏసీ జిమ్‌లో అమ్మకానికి ఉంచిన కార్డియాక్ స్టిమ్యులేట్ ఔషధాన్ని సీజ్ చేశారు. రాష్ట్రంలో లైసెన్స్ లేకుండా నడిపే ప్రతి మెడికల్ షాపును మూసివేస్తామని ఈ సందర్భంగా డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి హెచ్చరించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల గోల్‌మాల్

- నలుగురు నిందితుల అరెస్ట్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు తీసుకొని లబ్దిదారులకు ఇవ్వకుండా గోల్‌మాల్ చేసిన కేసులో నలుగురు నిందితులను హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లాకు చెందిన దూమ రవినాయక్ గతంలో పొలం పనులు చేస్తుండగా అతని భార్య పాముకాటుకు గురైంది. సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రిలో ఆమెకు ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. అయితే, ఆమె పరిస్థితి విషమించి మృతి చెందింది. అప్పటికే భార్య ఆస్పత్రి ఖర్చుల కోసం సుమారు రూ.5 లక్షల వరకు రవి నాయక్ ఖర్చు చేశాడు. దాంతో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేశాడు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా.. సీఎం రిలీఫ్ ఫండ్‌పై స్పష్టత రాలేదు. దీంతో రవి నాయక్ సీఎంఓలో సంప్రదించాడు. అప్పుడు అసలు విషయం బయటపడింది. రవి నాయక్ భార్య పేరిట సీఎం రిలీఫ్ ఫండ్ మంజూ రైందని సీఎంఓ వర్గాలు తెలిపాయి. జోగు నరేష్ కుమార్ అనే వ్యక్తి చెక్కు అందుకున్నట్టు తెలిసింది. దాంతో బాధితుడు రవి నాయక్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి.. జోగుల నరేష్ కుమార్, కొర్లపాటి వంశీ, వెంకటేష్ గౌడ్, ఓంకార్‌ను అరెస్టు చేశారు. నిందితుడు నరేష్ మాజీ మంత్రి హరీశ్‌రావు వద్ద గతంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేసినట్టుగా తెలిసింది.

# మతతత్వ పార్టీకి గుణపాఠం చెప్పాలి

- కార్మిక సంఘాలకు కలిసే అవకాశం ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్




నవతెలంగాణ-భూపాలపల్లి

మతతత్వ, నిరంకుశ, కార్పొరేట్ పాలన సాగిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో జిల్లా నాయకులు కంపేటి రాజయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఈ పదేండ్లలో బీజేపీ ప్రభుత్వం రైతులకు ఒక్కసారి కూడా కనీస మద్దతు ధర ప్రకటించలేదన్నారు. బడా పారిశ్రామికవేత్తల కోసం ప్రజా స్వామ్యాన్ని పణంగా పెట్టి అంబానీ, అదానీ లాంటి వ్యాపారవేత్తలకు ప్రజాధనాన్ని వినియోగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన జీఎస్టీ నిధులను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ కేంద్రంగా రైతుల నల్ల చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన రైతులపై బాష్ప వాయువులు ప్రయోగించి అనేకమంది రైతుల మరణానికి కారణమైన బీజేపీని ఓడించాలన్నారు. పొరుగు రాష్ట్రాల్లో కనీస వేతనం రూ.21 వేలు అమలవు తున్నా తెలంగాణలో మాత్రం రూ.16000 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేండ్లలో కొత్త రేషన్ కార్డులు జారీ చేయలేదని, పథకాల అమలులో తెల్ల రేషన్ కార్డులకే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేసిన తర్వాత 6 గ్యారంటీల పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాడు ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రిని, మంత్రులను ప్రగతిభవన్‌లో కలిసే అవకాశం కల్పిస్తామని చెప్పి కార్మిక సంఘాలతో మాట్లాడే అవకాశం కల్పించలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేష్, జిల్లా అధ్యక్షులు బందు సాయిలు, కార్యదర్శి చెన్నూరు రమేష్, జిల్లా నాయకులు కంపేట రాజన్న, వెలిశెట్టి రాజన్న, పొలం రాజేందర్, ఆకుదారి రమేష్‌తో పాటు ఆర్టీసీ, అంగన్వాడీ, ఆశ, విద్యుత్తు, మున్సిపాలిటీ, హమాలీ, భవన నిర్మాణ సంఘాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచాలి

- మైనార్టీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శికి ఎమ్మెల్సీ అలుగుబెల్లి లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి అయేషా మస్రత్ ఖానమ్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలోని 204 మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అడ్మిషన్లు తీసుకుంటున్న నేపథ్యంలో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు రెండు సెక్షన్లలో , ఒక్కొక్క సెక్షన్‌కు 40 మంది విద్యార్థుల చొప్పున ప్రతి తరగతిలో 80 మంది విద్యార్థులను చేర్చుకుంటున్నట్టు తెలిసిందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్‌లో కూడా ప్రతి పాఠశాలలో రెండు గ్రూపులు, ఒక్కొక్క గ్రూపులో 40 మంది విద్యార్థుల చొప్పున 80 మంది విద్యార్థులను చేర్చుకుంటున్నారని తెలిపారు. 204 పాఠశాలల్లో ఒక్కొక్క దానిలో 80 మంది విద్యార్థుల చొప్పున 16,320 మంది విద్యార్థులను ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్చుకునే అవకాశమున్నదని పేర్కొన్నారు. కానీ, ఈ విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 10,155 మంది విద్యార్థులు చేరినట్టు తెలిసిందని పేర్కొన్నారు. ఇంకా 6,165 అడ్మిషన్లు (38శాతం) మిగిలిపోయినట్టు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం(2024-25)లో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్, ఇంటర్మీడియట్ కోర్సుల్లో పూర్తి స్థాయిలో విద్యార్థులు చేరేలా తగు చర్యలు తీసుకో వాలని విజ్ఞప్తి చేశారు. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్లలో కూడా 25శాతం అడ్మిషన్లు భర్తీ కావటం లేదని తెలిపారు. పాఠశాల స్థాయిలో పూర్తి స్థాయిలో విద్యార్థులు చేరేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## 14 మందితో కాంగ్రెస్ 8 వ జాబితా

(మొదటిపేజీ తరువాయి)

స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. కేవలం 15 నిమిషాల్లోనే తెలంగాణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఎనిమిది స్థానాలపై ఈ సమావేశంలో చర్చించి నాలుగింటిని ఖరారు చేశారు. జాబితా ఆధారంగా సామాజిక సమతుల్యం, గెలుపోటము లు, సర్వేలు, స్థానిక నేతల అభిప్రాయాలపై సవివరంగా ఆరా తీశారు. నాలుగు స్థానాలపై ఏకాభిప్రాయం రాగా, నాలుగు స్థానాలపై నేతల మధ్య భిన్నాభిప్రాయాలు వచ్చినట్లు తెలిసింది. కొన్ని స్థానాలకు సంబంధించి ఇన్‌చార్జ్ దీపా మున్షి, సీఎం రేవంత్ రెడ్డి ఒకరి పేరు ప్రస్తావించగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు మరొకరి పేరును తెరపైకి తెచ్చినట్లు తెలిసింది. దీంతో ఎవరి వర్గానికి వారు మద్దతుగా నిలవడంతో నాలుగు స్థానాలపై నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిసింది. ఈ నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు ఈనెల 31న మరోసారి భేటీ కావాలని నిర్ణయానికి వచ్చింది.

**ఖర్గే, సోనియాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ...!**

సీఈసీ భేటీ అనంతరం రాష్ట్ర నేతలతో అధిష్టాన పెద్దలు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. సమావేశంలో భిన్నాభిప్రాయాలు రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో విడివిడిగా చర్చించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. గోవా, జార్ఖండ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ కు సంబంధించిన అభ్యర్థుల ఎంపికపై బుధవారం సీఈసీ భేటీ జరిగింది. అయితే ఆ రాష్ట్రాలకు సంబంధించిన సమావేశాలు పూర్తికాగానే ఆ రాష్ట్ర నేతలు ఏఐసీసీ నుంచి వెళ్లిపోయారు. కానీ తెలంగాణకు సంబంధించిన నేతలు మాత్రం...మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీతో సమావేశం అయ్యారు. దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో అధిష్టానం నేతల్ని బుజ్జగించినట్లు తెలిసింది. అయితే తొలుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీటింగ్ నుంచి బయటకు రాగా... మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. కాసేపటికి బయటకు వచ్చిన ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా సంబంధిత నేతలు మాత్రమే మాట్లాడుతారంటూ వెళ్లిపోయారు. ఇక ఏఐసీసీ కార్యాలయం నుంచి సోనియా గాంధీ వెళ్లిన తర్వాత కూడా సీఎం రేవంత్ అక్కడే ఉన్నారు. కాసేపు ఆగి పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గేతో సీఎం మంతనాలు జరిపారు. చివరిగా రాత్రి 8:20 కి ఏఐసీసీ నుంచి నేరుగా ఢిల్లీ ఎయిర్ పోర్ట్ బయలు దేరి, అక్కడ నుంచి హైదరాబాద్ పయనమయ్యారు

## ఎన్నికల వేళ.. దేశవ్యాప్తంగా ఈడీ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

షిప్పింగ్- లాజిస్టిక్స్, దాని డైరెక్టర్లు విజయ్ కుమార్ శుక్లా, సంజయ్ గోస్వామిల ఇళ్లతోపాటు అనుబంధ సంస్థల్లో సోదాలు నిర్వహించామన్నారు. వారితోపాటు అనుబంధ సంస్థలుగా ఉన్న లక్ష్మీటన్ మారిటైమ్, హిందుస్థాన్ ఇంటర్నేషనల్, రాజనందిని మెటల్స్ లిమిటెడ్, స్టావర్ట్ అల్లాయ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కుమారి, భాగ్యనగర్ లిమిటెడ్, వినాయక్ స్టీల్స్ లిమిటెడ్, వశిష్ఠ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు / భాగస్వాములు సందీప్ గార్గ్, వినోద్ కేడియా, ఇతరులకు చెందిన ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, కురుక్షేత్ర, కోల్‌కతాలోని వివిధ ప్రదేశాలలో తనిఖీలు చేశామన్నారు. సోదాల సమయంలో, వివిధ నేరారోపణ పత్రాలు, డిజిటల్ పరికరాలు, లెక్కల్లో చూపని నగదు రూ. 2.54 కోట్లను వాషింగ్ మిషన్‌లో గుర్తించి సీజ్ చేశామని, 47 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశామని ఈడీ పేర్కొంది.

# మతలబేంటి ..!?

**ఆరేండ్లుగా ఉప్పల్-నారపల్లి**

- ఎలివేటేడ్ కారిడార్ పనులు పెండింగ్ !!
- కాంట్రాక్టర్‌కు బీజేపీ సర్కారు అండ
- పనులు చేయకున్నా గడువు పొడిగింపు
- కేంద్ర ఉపరితల రవాణా శాఖ నిర్వాకం
- వాహనదారులకు 'భారత్‌మాల' నరకం




నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆ బడా కాంట్రాక్టు సంస్థ ఓ పేరు మోసిన రాజకీయ నేతది. అది ఆడింది ఆట పాడింది పాటగా నడుస్తున్నది. యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించునే పరిస్థితి లేదు. భారత్‌మాల పథకం కింద రెండేండ్లల్లో పూర్తిచేయాల్సిన ఉప్పల్-నారపల్లి ఎలివేటేడ్ కారిడార్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ఆరేండ్లుగా సాగదీస్తూనే ఉంది. మార్గదర్శకాల ప్రకారం ఆ వర్కింగ్ ఏజెన్సీకి అప్పగించిన కాంట్రాక్టును రద్దుచేసి మరొక కంపెనీతో పనులు చేయించాల్సిన కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ చోద్యం చూస్తున్నది. సదరు కాంట్రాక్టు సంస్థపై అలవిమాలిన ప్రేమను ఒలకబోస్తున్నది. అమ్యామ్యాలకు ఆశపడి జనజీవనాన్ని నిత్యం నరకం చేస్తున్నది. పదే పదే గడువు పొడిగిస్తూ ఆ సంస్థ పట్ల తమ విధేయత చాటుకుంటున్నది. పనులు నత్తనడకన సాగుతుండడంతో ఏండ్లతరబడి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఆ కంపెనీతో కేంద్ర రవాణా శాఖ కుమ్మక్కయిందనే అరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వరంగల్ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులను నివారించే ఉద్దేశంతో రోడ్డు, రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ(ఎంఓఆర్‌టీఏహెచ్) ఆధ్వర్యంలో ఉప్పల్ జంక్షన్ నుంచి మేడిపల్లి సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ పనులకు మే 2018లో శంకుస్థాపన చేయగా, 18 నెలల్లో పనులు పూర్తి చేసేందుకు ఎంవోయూ కుదిరింది. ఓ ప్రముఖ కాంట్రాక్టర్‌కు చెందిన ఏజెన్సీ ఆ పనులు చేపట్టింది. తొలుత భూసేకరణలో కొంత జాప్యం చోటుచేసుకోగా, జీహెచ్ఎంసీ ఆ మేరకు సహకరించింది. కాంట్రాక్టు పనులను మే 2021లోగా పూర్తిచేయాలని అప్పట్లోనే అగ్రిమెంట్ జరిగింది. భూసేకరణ వ్యయం కలుపుకొని మొత్తం రూ. 675 కోట్లతో 45 మీటర్ల వెడెల్పు, 6.2 కిలోమీటర్ల పొడవునా నిర్మిస్తున్న ఈ కారిడార్ హైదరాబాద్‌లోని పీవీ నరసింహరావు ఎక్స్‌ప్రెస్‌వే కారిడార్(11.6కి.మీ.లు) తరువాత రెండో అతి పొడవైన ఎలివేటెడ్ కారిడార్ కావడం గమనార్హం. వరంగల్ వెళ్లే జాతీయ రహదారి కావడం, ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వరకు భారీ సంఖ్యలో కొత్త కాలనీలు ఏర్పడటం, యాదాద్రి పునర్నిర్మాణంతో యాత్రీకుల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఈ రోడ్డు అత్యంత ట్రాఫిక్ ఉన్న రోడ్డుగా మారిపోయింది. ఆ ఫ్లైఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందనుకుంటే పనులు నత్తతో పోటీపడుతుండటంతో వాహనదారులు నిత్యం నరకాన్ని అనుభవించాల్సిన దుస్థితి ఉత్పన్నమైంది.

**ఆరేండ్లయినా సగం కూడా..**

భూసేకరణ ఖర్చులుపోగా ఫ్లైఓవర్‌కు సుమారు రూ. 400 కోట్లకు పనులు దక్కించుకుని సదరు ఏజెన్సీ నిర్మాణం చేపట్టింది. కానీ పనులు దక్కించుకోవడంలో పడ్డ పోటీ, చేయడంలో కనిపించడం లేదు. పనుల్లో తీవ్ర ఆలస్యం చోటుచేసుకోవడంతో నిర్మాణ వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. దీంతో పనులు పూర్తిచేయలేని దుస్థితి ఏర్పడింది. శంకుస్థాపనచేసి ఆరేండ్లు పూర్తయింది. అయినా ఇప్పటికీ కేవలం రూ. 170 కోట్ల విలువ చేసే పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా రూ. 230కోట్ల వ్యయమయ్యే పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం నెలకు రూ. 3 నుంచి రూ.4 కోట్ల పనులు మాత్రమే జరుగుతున్నట్టు సమాచారం. కనీసం నెలకు రూ. 20 కోట్ల పనులు చేస్తేనే, వచ్చే ఏడాది-ఏడాదిన్నరకాలంలో ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారిక సమాచారం. ఇలాగే పనులు జరిగితే మాత్రం, మరో ఐదేండ్లయినా ఫ్లైఓవర్ పూర్తికావడం అనుమానమే.

**కాంట్రాక్టర్‌తో కేంద్రం మిలాకత్....?**

సాధారణంగా కాంట్రాక్టర్లు ఎంవోయూ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం ముందుకుపోవచ్చు. చర్యలు తీసుకోవచ్చు. అయినా కేంద్ర ప్రభుత్వం చడీచప్పుడు చేయడం లేదు. గడువులోగా పనులు పూర్తిచేయకుంటే సదరు ఏజెన్సీకి ఇచ్చిన కాంట్రాక్టును రద్దుచేయడంతోపాటు వారి డిపాజిట్ మొత్తాన్ని జప్తు చేయాల్సి ఉంటుంది. అంతేగాక మరో ఏజెన్సీని ఎంపిక చేసి పనులు అప్పగించాలి. రెండేండ్లల్లో పూర్తికావాల్సిన పనులు ఆరేండ్లయినా సగం కూడా పూర్తికాకున్నా ఏజెన్సీని రద్దుచేసేందుకు కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ పూనుకోవడం లేదు. పైగా తాత్సారం చేస్తున్నది. కాంట్రాక్టును రద్దుచేసి ఇతర ఏజెన్సీకి పనులు అప్పగించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ , ఎంఓఆర్‌టీఏహెచ్‌కి పలు దఫాలు విజ్ఞప్తిచేసినా ఫలితం లేకుండా పోయింది. సదరు కాంట్రాక్టు సంస్థ ప్రముఖ రాజకీయ నేతది కావడం, ఢిల్లీలోని బీజేపీ నాయకులతో మంచి సంబంధాలు ఉండడంతో కాంట్రాక్టును రద్దు చేయకుండా కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు పర్యవేక్షిస్తున్న ఆర్అండ్‌బీ శాఖ అధికారులు సైతం ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.

**ఆర్అండ్‌బీకి ఉచిత సలహా..**

గాయత్రి కన్‌స్ట్రక్షన్స్‌కు కేటాయించిన కాంట్రాక్టును రద్దుచేసి పనులు త్వరితగతిన పూర్తిచేయాల్సిన కేంద్రం, అలా కాకుండా ఫ్లైఓవర్‌కు ఇరువైపులా ఉన్న గుంతలు లేకుండా చేసి వాహనదారులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆర్అండ్‌బీ శాఖకు ఉచిత సలహా పడేసింది. ఆ రోడ్డు పునరుద్ధరణ పనులకు సదరు ఏజెన్సీకి చెందిన ఈఎండీ(ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) నుంచి రూ. 4 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. అయితే నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుండడంతో రోడ్డు మరమ్మతులు సైతం వేగంగా సాగడంలేదని అధికారులే అంటున్నారు. ఉప్పల్ నుంచి నారపల్లి వరకు వాహనాలు చాలా నెమ్మదిగా పోవాల్సి వస్తున్నది. దీనివల్ల రద్దీవేళల్లో విపరీతమైన ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతుండటం తెలిసిందే ఈ విషయమై రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను వివరణ కోరగా అందుబాటులో లేరు.

హయత్‌నగర్

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భిక్షపతి



**నవతెలంగాణ - హయత్‌నగర్**

14వ మేజిస్ట్రేట్ కోర్ట్ హయత్ నగర్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా బొడ్డు భిక్షపతి గౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం ఎన్నికల అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా భిక్షపతి గౌడ్‌ను ఎన్నుకున్నట్టు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ఎం.రవి, ప్రధాన కార్యదర్శిగా సంతోష్ కుమార్, కోశాధికారిగా తొర్పునూరి ఈశ్వర్, జాయింట్ సెక్రటరీగా బండి నరేష్, లైబ్రరీ సెక్రటరీగా సతీష్, స్పోర్ట్స్ అండ్ కల్చరర్ సెక్రటరీగా శివ కుమార్, మహిళా ప్రతినిధిగా సరిత ఎన్నికైనట్టు పేర్కొన్నారు.

## ఆలయ హుండీ లెక్కింపు



**నవతెలంగాణ - సంతోష్‌నగర్**

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం హుండీని బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా కార్య నిర్వహణ అధికారి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ రూ.20 లక్షలా 60 వేలు 652, అమెరికా డాలర్లు 410, యూకే పౌండ్స్ 10 ఆదాయం వచ్చిందన్నారు. ఈ లెక్కింపులో ఆలయ చైర్మన్ రఘుమారెడ్డి, ధర్మకర్తలు బబ్బూరి ఆనంద్ గౌడ్ , మేక సురేందర్ రెడ్డి, నారగొని శ్రీనివాస్ యాదవ్, చాలిరి మధుసూదన్ సాగర్, చీర తిరుమలేష్, గోగిరెడ్డి అంజిరెడ్డి, మేకల యాదగిరి, బిల్లకంటి కిరణ్ కుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్ వ్యాపారస్తులకు సహకరించాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**నవతెలంగాణ- ఎల్బీనగర్**

ఫుట్‌పాత్ వ్యాపారస్తులకు ట్రాఫిక్ పోలీస్‌లు సహకరించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. చైతన్యపూరి మెట్రో వెనుక ఉన్న ఫూట్ పాత్ మీద పండ్ల వ్యాపారాలు చేసుకునే పలువురు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి పలు సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఫుట్‌పాత్‌ల మీద ట్రాఫిక్ పోలీసులు తమను వ్యాపారాలు చేసుకోనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు తమ వస్తువులను తీసుకుపోవడం జరుగుతుందన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫుట్‌పాత్ వ్యాపారాల వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు రోడ్డు మీద పోయే ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు చెప్పారని తెలిపారు. అందువలనే ట్రాఫిక్ పోలీసులు అలా ప్రవర్తించారని అన్నారు. మీ మీద ట్రాఫిక్ పోలీసులకు ఎలాంటి కోపం ఉండదన్నారు. ఇతరులు పోలీసులకు సమాచారం ఇవ్వడం వలనే వారు మీ దగ్గరకు రావడం జరుగుతుందన్నారు. పై అధికారులతో మాట్లాడి మీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే మీరు వ్యాపారం చేసుకునే క్రమంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు.

## పోస్టల్ బ్యాలెట్ తప్పనిసరిగా వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

ఎన్నికల విధులలో ఉన్న అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో హైదరాబాద్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అందజేయడం, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, నిబంధనలు, ఫెసిలిటేషన్ సెంటర్‌ల ఏర్పాటు, తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ తమ ఓటు వేసేలా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ప్రక్రియ పకడ్బందీగా ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఎన్నికల కమిషన్ సూచనల మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బందికి మొదటి విడత శిక్షణ కార్యక్రమంలోనే ఫారం - 12 అందించి, పోస్టల్ బ్యాలెట్‌పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అన్ని వివరాలతో దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటింగ్ వేసే విధంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. అందుకు అన్ని ఏర్పాట్లను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకుని జిల్లాలో ఓటింగ్ శాతం పెంచడంలో భాగస్వాములు అయ్యేలా చైతన్య పరచాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే వారు తమ ఎపిక్ కార్డుతో పాటు పార్ట్ నంబర్, సీరియల్ నంబర్ కూడా శిక్షణ తరగతుల హాజరయ్యే సందర్భంలో తీసుకొని వచ్చే విధంగా మెసేజ్ పంపించాలని లేదా ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో సరి చూసుకోవాలని సూచించారు.

ఎలక్షన్ కమిషన్ సూచించిన ఎమర్జెన్సీ సర్వీస్ శాఖలకు నోడల్ ఆఫీసర్ నియామకం చేయుటకు తగు లేఖ వ్రాసి నోడల్ అధికారుల వివరాలను పంపించుటకు తగు చర్యలు తీసుకోవాలని ఎలక్షన్ అడిషనల్ కమిషనర్‌ను జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. ఎన్నికల విధులు నిర్వహణకు ఉత్తర్వులు జారీ చేసిన వారు శిక్షణకు గైర్హాజరు అయిన పక్షంలో వారిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్‌తో పాటు ఎఫ్.ఐ.ఆర్ కూడా నమోదు చేయుటకు వెనుకాడవద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా అడిషనల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, జీహెచ్ఎంసీ ఎన్నికల అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, ఏ.ఆర్.ఓలు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనక్ ప్రసాద్‌ను సన్మానించిన నాయకులు



**నవతెలంగాణ- నాగోల్**

ఇటీవల తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్‌ను సింగరేణి విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలైన కోల్ మైన్స్ పెన్షన్-1998 సవరించి, కనీస పెన్షన్ 15,000 రూపాయలు చెల్లించాలని, పెన్షన్ పథకంలోని నిబంధన ప్రకారం ప్రతి మూడేండ్లకు ఒక సారి సమీక్షించి కరువు భత్యంతో కూడిన పెన్షన్ చెల్లించాలని జనక్ ప్రసాద్‌ను కోరారు. కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్(సిపిఆర్ యం ఎస్) స్కీం కార్డ్ ద్వారా అపరిమిత వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు.

హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, లాంటి పరిసర ప్రాంతాల్లో నివసించే విశ్రాంత ఉద్యోగులకు ఉచితంగా ఔట్ పేషంట్ వైద్యం కోసం ప్రత్యేక వైద్య విభాగం ఏర్పాటు చేయాలని కోరారు. వివిధ ఏరియాలలో ఖాళీగా ఉన్న క్వాటర్స్‌లను విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాలని, విశ్రాంత ఉద్యోగుల మెడికల్ కార్డ్స్ దేశ వ్యాప్తంగా అపరిమిత వైద్యసేవలు అన్ని హాస్పిటల్ నందు చెల్లుబాటు అయ్యే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. బీబీనగర్‌లోని ఎయిమ్స్ హాస్పిటల్ నందు మెడికల్ కార్డ్ ద్వారా వైద్య సౌకర్యం కల్పించాలని, సింగరేణి ఆసుపత్రుల్లో వైద్యం స్వీకరించిన విశ్రాంత ఉద్యోగులకు సిపిఆర్ యం ఎస్ కార్డుల నుంచి నిమ్స్ టారిఫ్ లో 40% రికవరీ నిలుపుదల చేసి ఉచితంగా వైద్యం అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే వృద్ధాప్య పెన్షన్ సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు వర్తింపజేయాలని, తెల్లరేషన్ కార్డులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యంతో సంప్రదింపులు జరపాలన్నారు. అనంతరం పై సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వాసుదేవ్ రావ్, ఎ. బుచ్చిప్రసాద్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఆర్.సి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం. బాబు రావు, ఏనుగు రవీందర్ రెడ్డి, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళ వందార్ వేణు మాధవ్, ఉపాధ్యక్షులు కె.బీరయ్య, వెంకటరమణ, ప్రభాకర్ రావు, సత్యనారాయణ రెడ్డి, లక్ష్మా రెడ్డి, ఐ.ఆర్.కె రావు, మాధవరెడ్డి, సత్యలింగం, ఎ.చంద్రమౌళి తదితర విశ్రాంత ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.



## పేదింటి ఆడబిడ్డకు పుస్తెలు అందజేత

**నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్**

పేదింటి ఆడబిడ్డ పెండ్లికి పుస్తెలు బహుకరించి ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దండెం రామ్‌రెడ్డి మానవత్వాన్ని చాటు కున్నారు. అబ్దుల్లా పూర్‌మెట్ మండలం, గండిచెర్వు గ్రామానికి చెందిన కీ.శే. మోడెపు సంతోష, బాలరాజ్ గౌడ్‌ల దంపతుల కుమార్తె అనూషకు ఏప్రిల్ 4న వివాహం నిశ్చయమైంది. అనూష ఆర్థిక పరిస్థితి అంతంతే. ఈ విషయం తెలు సుకున్న దండెం రాంరెడ్డి ఆమె వివాహానికి పుస్తె మెట్టెలు, పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా దండెం రాంరెడ్డి మాట్లాడుతూ ముమ్ముందు కూడా ఇలాంటి సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వధువు అనూష, ఆమె మేనమామ దానయ్య స్థాని కులు మల్లా రెడ్డి, రాంబాబు, సత్యనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వార్షిక బ్రహోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే తీగల



**నవతెలంగాణ - చైతన్యపురి**

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని రామకృష్ణాపురం డివిజన్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహోత్సవాలకు మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను శాసన సభ్యులుగా, హుడా చైర్మన్‌గా ఉన్న సమయంలో సరూర్‌నగర్, రామకృష్ణాపురంలోని కాలనీలకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయించానని అని చెప్పారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ జగిని రమేష్ గుప్త, నాయకులు బేరా బాలకిషన్, ఆకుల అరవింద్, చామల శైలజ రెడ్డి, భూపాల్ రెడ్డి, లింగస్వామి గౌడ్, పగడాల ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

2013 వేతన సవరణ

## బకాయిల బాండ్లు వెంటనే చెల్లించాలి



- ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ వినతి

**నవతెలంగాణ - సిటీబ్యూరో**

ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన 2013 వేతన సవరణ బకాయిల 50శాతం బాండ్ల డబ్బులను వెంటనే చెల్లించాలని ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ హనుమంతు ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్ ఆధ్వర్యంలో బుధవారం బస్‌భవన్‌లో టీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్టీసీ ఉద్యోగులు ఎంతో కాలంగా ఈ డబ్బుల గురించి నిరీక్షిస్తున్నారని, ఇందుకు సంబంధించి ఇప్పటికే ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారన్నారు. ఆలస్యం చేయకుండా వెంటనే ఉద్యోగులకు చెల్లించాలని ఈ సందర్భంగా వారు ఎండీని కోరారు. కేవలం 30 కోట్ల రూపాయలు బాండ్ డబ్బులు వచ్చాయని, మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం రూ.250 కోట్లు చెల్లించిందని తెలిపారు. బకాయి బాండ్ల చెల్లింపునకు త్వరతగతిన చర్యలు తీసుకుంటామని, సదరు బకాయి చెల్లింపులకు ఇన్‌కమ్ టాక్స్ ఉంటుందని ఎండీ చెప్పారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్, వైస్ చైర్మన్ మల్లేశం, సీపీపీ బెన్ సుశీల్, అదనపు ప్రధాన కార్యదర్శి అబ్రహం, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు గోలి రవీందర్, స్వాములయ్య, పి సుభాష్, ఎండీ ఆఫీస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన ఎల్బీనగర్ టీడీపీ ఇన్‌చార్జి



**నవతెలంగాణ - చైతన్యపురి/ సంతోష్‌నగర్**

తెలుగు దేశం పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి ఎస్‌వీ కృష్ణప్రసాద్ సీఎం నివాసంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, తెలంగాణ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు చంపాపేట్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ సామ రమణ రెడ్డి, ఎల్బీనగర్ మున్సిపాలిటీ మాజీ కో ఆప్షన్ మెంబర్ మల్లారం శాలిని, గడ్డిఅన్నారం డివిజన్ టీడీపీ అధ్యక్షులు యం.సునీల్ బాబు, మురళీధర్ రెడ్డి, రాష్ట్ర తెలంగాణ తెలుగు యువత అధికార ప్రతినిధి, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు వెలగ చంద్రశేఖర్, చంపాపేట్ డివిజన్ ఉపాధ్యక్షులు ఆరే కృష్ణలు కాంగ్రెస్‌లో చేరారు.

## రిజర్వేషన్లను తప్పకుండా పాటించాలి



- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్

**నవతెలంగాణ- నాగోల్**

రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను తప్పకుండా పాటించి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఉన్నత పదవులను పొందేలా చూడాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ కోరారు. జీఎస్ఐలో రిజర్వేషన్స్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్, జనరల్ లెక్చర్ ఫర్ ఎస్సీ, ఎస్టీపై ఉపన్యాస కార్యక్రమాన్ని జియోలాజికల్ సర్వే ఇండియా ప్రాంగణంలోని మల్టీ పర్పస్ హాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఎస్సీ, ఎస్టీ పోస్టులను జీఎస్ఐలో భర్తీ చేయాలనీ అన్నారు. రిజర్వేషన్ల యందు పొరపాట్లు జరిగితే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. తర్వాత రామచందర్ ను ఆలిండియా జీఎస్ఐ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేష్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ, ఏడీజీ మరియు హెచ్ ఓ డీసీహెచ్ వెంకటేశ్వర్ రావులు శాలువాతో సన్మానించి, అంబేద్కర్ చిత్రంతో ఉన్న సీల్డ్‌ను అందజేశారు. అనంతరం పదవి విరమణ పొందుతున్న ఏడీజీ అండ్ హెచ్‌ఓడీ సిహెచ్ వెంకటేశ్వర్ రావు సన్మానించారు. ఈ సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ జనరల్ అండ్ హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ సిహెచ్ వెంకటేశ్వర రావు, ఆలిండియా జీఎస్ఐఎస్‌సిఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేష్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ, డీడిజిలు ఎల్‌పి సింగ్, ఎస్ యెన్ మహాపాత్ర, డైరెక్టర్ నేషనల్ కమిషన్ ఫర్ ఎస్ సి జి సునీల్ కుమార్ బాబు, రీసెర్చ్ ఆఫీసర్ వరప్రసాద్, డైరెక్టర్లు ఎంఎల్ దొర, అనూప్ ఎన్ కంబ్లె, ఎస్.తరకేశ్వర్ రాయి, అసోసియేషన్ ప్రతినిధులు జీ. శ్రీనివాస్ రావు కిషోర్ కుమార్, బి. ఆనంద కుమార్, ఆర్. అరుణ్ కుమార్, చెక్రేశ్వర్, ఏ. శివ శంకర్, ఏ. మేఘరాజ్, జీ. మల్లేష్, జీ. యాదగిరి, బి. శ్రీనివాస్ రావు, అనిల్ కుమార్, బి కె అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## జల్సాల కోసం చోరీలు చేస్తున్న ఫేస్‌బుక్ ఫ్రెండ్స్

- మెట్రో స్టేషన్‌లో నిలిపే ద్విచక్ర వాహనాలే టార్గెట్
- 18 పల్సర్ బైకులు స్వాధీనం

**నవతెలంగాణ- హయత్ నగర్**

ఫేస్ బుక్ ద్వారా పరిచయం అయిన ఇద్దరు స్నేహితులు జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నారు. వీరిని ఎల్బీనగర్ క్రైమ్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఎల్బీనగర్‌లోని పోలీస్ కార్యాలయంలో ఏసీపీ కృష్ణయ్య నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించారు. ఇందిరా నగర్, ముసారాంబాగ్‌లో మల్లె భరత్ కుమార్ నివాసం ఉంటున్నాడు. ఇతని స్వస్థలం కడప జిల్లా, ప్రొద్దుటూరు, వాజపేయి నగర్. ఇతను తన ఊరిలో కార్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ప్రొద్దుటూరులో ఇతనిపై పోక్సో, ఖాజీపేటలో 9 ఇంటి దొంగతనాలు, ఆంధ్రప్రదేశ్‌లోని బద్వేల్‌లో 4 ద్విచక్ర వాహనాల దొంగతనాలు చేసి జైల్‌కు వెళ్ళాడు. రాచకొండ పరిధిలో 10 కేసులు.హైదరాబాద్ పరిధిలో 7 కేసులు.సైబరాబాద్ పరిధిలో ఒక కేస్ నమోదైంది. బద్వేల్ జైల్ నుండి విడుదల అయ్యాక నగరానికి మకాం మార్చి మలక్ పేటలో నివాసం ఉంటున్నాడు. ఈ ఏడాది జనవరి నుంచి నగరంలో ఉన్న మూడు కమిషనరేట్ పరిధిలో 18 కేసులో పల్సర్ బైకులను అపహరించి తన ఇంటి ఆవరణలో ఉంచుకుని రూ.30 నుండి 40 వేలకు ఒక్కో బైకును విక్రయించాడు. అతనికి నారాయణపేట జిల్లా, రాకొండ గ్రామం, మరికల్ మండలానికి చెందిన వలిమోని చిన్నయ్య అలియాస్ కిట్టు ఫేస్ బుక్ ఫ్రెండ్. ఇతను సంగారెడ్డి జిల్లా, బీడీఎల్, భానుర్‌లో ఉంటున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించాలని అనుకొని మెట్రో స్టేషన్ల వద్ద తాళం వేసి ఉన్న వాహనాలను చోరీ చేసేవారు. సిరీస్ రోడ్‌లో ఉన్న డీవీఎం కళాశాల వద్ద బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో వారు పట్టుబడ్డారు. వారి నుండి 18 పల్సర్ బైకులు, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం వాటి విలువ రూ.18లక్షలు ఉంటుందన్నారు. చిన్నయ్యకు చెందిన బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.22,205 నగదు సీజ్ చేశారు. ఆయన వెంట ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, క్రైమ్ ఎస్ఐ నరేందర్, సిబ్బంది ఏఎస్ఐ జంగయ్య, అనిల్, జంగయ్య శ్రీనివాస్, సందీప్, పృథ్వీ, యాదగిరి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




నీటి పొదుపులో

## మహిళల పాత్ర కీలకం

- సీడ్ ఎన్జీవో హాయత్ నగర్ సర్కిల్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరాం






**నవతెలంగాణ - నాగోల్**

నీటిని పొదుపు చేయడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని సీడ్ ఎన్జీవో హయత్ నగర్ సర్కిల్ ప్రాజెక్టు మేనేజర్ బలరాం అన్నారు. ప్రపంచ నీటి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా శాంతి కోసం నీరు అనే అంశంతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా బుధవారం జైపూర్ కాలనీలో టౌన్ లెవెల్ మహిళా సంఘం సభ్యులకు డివిజన్ 10-బిలోని నాగోల్ వార్డ్‌లో నీటి విలువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నీటి విలువ తెలిసేలా సీడ్ ఎన్జీవో ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. జలమండలి ఏరియా మేనేజర్ అర్చన మాట్లాడుతూ మహిళల పాత్ర నీటి పొదుపులో ప్రాముఖ్యతను సంతరించుకొందన్నారు. సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎస్. నాగబ్రహ్మ చారి మాట్లాడుతూ వర్షం నీరును భూగర్భ జలాలుగా మార్చుకునేందుకు ప్రతి ఒక్కరీ ఇంటిలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ బోర్డు అధికారులు మెప్మా, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ రాజు, మమత, టి.యల్.ఎఫ్. లీడర్స్ నాగభూషణమ్మ సీడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మల్‌రెడ్డి రాంరెడ్డిని కలిసిన పండ్ల వ్యాపారులు



**నవతెలంగాణ - ఎల్బీనగర్**

కొత్తపేటకు చెందిన పండ్ల వ్యాపారులు రోడ్ల అభివృద్ధి చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి రాంరెడ్డిని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుమారు 35 ఏండ్ల నుండి కొత్తపేట్ ఫ్రూట్ మార్కెట్ సమీపంలో పండ్ల వ్యాపారం చేసుకుంటున్నామని, గతంలో కొత్తపేటలో ఉన్న హెూల్‌సేల్ పండ్ల మార్కెట్‌ను రెండేళ్ల కిందట బాటసింగారానికి తరలించగా, చైతన్యపురి మెట్రో రైలు స్టేషన్‌కు సమీపంలో ఉన్న చాలా మంది పండ్ల వ్యాపారులు ఫుట్‌పాత్ పరిసర ప్రాంతాలను మార్కెట్‌గా చేసుకొని చిరు వ్యాపారం చేసుకుంటూ అక్కడే జీవనోపాధి పొందుతున్నారని వివరించారు. గత వారం నుండి ట్రాఫిక్ కారణంగా పోలీసులు విక్రయదారులను పూర్తిగా ఖాళీ చేయించారని అన్నారు. దీంతో జీవనోపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన రాంరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొత్తపేట్‌లో పండ్ల వ్యాపారం ముక్కలుగా చీలిపోయిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో మిమ్మల్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## ఉప్పల్ సర్కిల్‌లో ఉప కమిషనర్ పర్యటన



**నవతెలంగాణ-ఉప్పల్**

ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఉప్పల్ సర్కిల్ ఉప కమిషనర్ ఆంజనేయులు సంబంధిత అధికారులతో కలిసి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లోని ప్రజలు వారి సమస్యలను ఉప కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. చిల్కానగర్ డివిజన్ బ్యాంక్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హబ్సిగూడ డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలో ఓ అపార్టుమెంట్ వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. వారి సమస్యలపై సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అండ్ సైంటిసన్ విభాగం సెక్షన్ హెడ్ చందన, సానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, కాలనీ అసోసియేషన్ వారు పాల్గొన్నారు.

### కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి..

## బాలవికాస సంస్థ ఆర్థిక సాయం



- రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందజేత
- కృతజ్ఞతలు తెలిపిన కాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేష్

**నవతెలంగాణ-జవహర్‌నగర్**

మదర్ థెరిస్సా కాలనీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం సహకరించిన బాలవికాస సంస్థ యజమాన్యానికి రుణపడి ఉంటామని కాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేష్ అన్నారు. బుధవారం బాలవికాస డైరెక్టర్ శౌర్యా రెడ్డిని ఘట్కేసర్ కుందన్ పల్లి బాలవికాస ఆఫీస్ వద్ద బాలవికాస హైదరాబాద్ సిటీ డైరెక్టర్, మదర్ థెరిస్సా కాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేష్ కలిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని కోరడంతో డైరెక్టర్ శౌర్యా రెడ్డి రూ.1.50లక్షలు సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# పాలీ క్లినిక్, ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ సీజ్

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య బృందం ఆకస్మిక తనిఖీలు





**నవతెలంగాణ-సిటీబ్యూరో**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య బృందం బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ లేని రెండు క్లినిక్‌లను సీజ్ చేశారు. ఉప్పల్‌లోని శ్రీ మణికంఠ హెల్త్‌కేర్ అండ్ పాలీ క్లినిక్, చిలుకానగర్‌లోని శ్రీ రాజు ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లకు తాళం వేశారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రఘునాథస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్స్ సిఫార్సుల ఆధారంగా ఈ తనిఖీలు చేసినట్టు తెలిపారు. తనిఖీల్లో భాగంగా క్లినిక్‌లలో దొరికిన వైద్య పరికరాల ఆధారంగా (సర్జికల్ కుట్టు సూదులు, సర్జికల్ కత్తెరలు, అన్ని పరిమాణాల మెడికల్ కట్టింగ్ షియర్స్, ఈఎన్‌టీ ప్రొసీడ్యూరల్ మెటీరియల్స్, ఎపిడ్యూరల్ స్టెరాయిడ్ ఇంజెక్షన్‌లు, బి-టైప్ (10 లీటర్లు) ఆక్సిజన్ సిలిండర్, సర్జికల్ పిన్స్ డిస్టాప్లర్ వంటివి) ఆధారంగా రుజువైనట్టు తెలిపారు. యాజమాన్యం అర్హత గల వైద్యులు, సిబ్బంది లేకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ క్లినిక్‌లను నడిపిస్తున్నారనీ, ఇది ప్రజలకు నష్టం కలిగిస్తుందని తెలిపారు. ఈ క్లినిక్‌లు చట్టవిరుద్ధంగా అర్హత కలిగిన వైద్యులతో నమోదు లేకుండా చిన్న శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాయనీ, అనుమతి లేకుండా వైద్య నిపుణులుగా ప్రాక్టీస్ చేసి ప్రచారం చేసుకుంటున్నారని కూడా గమనించినట్టు తెలియడంతో తమ బృందం పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి వెళ్లి సీజ్ చేసినట్టు తెలిపారు. జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించిన ఏ హాస్పిటల్‌పై అయినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సరైన దస్తావేజులు లేకపోవడంతో చిలుకానగర్‌లోని మహాలక్ష్మి క్లినిక్‌కు క్లినిక్ తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్స్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్ 2010 (కేంద్ర చట్టం నెం.23 ఆఫ్ 2010) అండ్ రూల్స్ 2022 కింద నోటీసు జారీ చేసినట్టు తెలిపారు.

ఈ తనిఖీల్లో కీసర డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.నారాయణరావు, ప్రోగ్రామ్ అధికారిణి గీత ప్రసాద్, ఉప్పల్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సౌందర్య లత, డెమో అంజయ్య, బి.ప్రకాష్, పి.శ్రీనివాస్, పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి



**నవతెలంగాణ-కాప్రా**

ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. బుధవారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఉప్పల్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్‌లోని ఏఎస్‌రావు నగర్ మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి తన కార్యకర్తలతో కాంగ్రెస్‌లో చేరారు. వారికి సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తోందని, కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని చూసే భారీ ఎత్తున చేరికలు కొనసాగుతున్నా యని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారిలో సుదర్శన్ రెడ్డి, వంజరి ప్రవీణ్, వెంకట్ రెడ్డి, సురేందర్ చారి, బాల్‌నర్సింహ, కాశ్యపిరెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డి, విజయేందర్, నర్సింహులు, కాంతారెడ్డి, రాజు, సాయి, శ్రీనివాస్, కుందంపల్లి నర్సింహ, గోవర్దన్, రాజేంద్ర ప్రసాద్, సత్తి రెడ్డి, రెడ్డిఅప్పరెడ్డి, సుధాకర్, రాజు,మోహన్, రాకేష్ ఉన్నారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి, అంజిరెడ్డి,సీతారాంరెడ్డి ఉన్నారు.

## అంబేద్కర్ చిత్రపటాలు అందజేత



**నవతెలంగాణ-కీసర**

కీసర మండల అంబేద్కర్ సంఘం నిర్వహిస్తున్న వారంవారం జ్ఞానమాల కార్యక్రమానికి వచ్చే అతిథులకు అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు బక్కని నర్సింగ్‌రావు 100 అంబేద్కర్ చిత్ర పటాలను కీసర మండల అంబేద్కర్ సంఘానికి అందజేశారు. కీసరలో అంబేద్కర్ జ్ఞానమాల 113 వారాలు పూర్తి చేసుకుని విజయవంతంగా కొనసాగుతుండడంతో కీసర మండల అధ్యక్షుడు సూచన మేరకు నర్సింగ్‌రావు అంబేద్కర్ పటాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలహీన వర్గాల కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బక్కని కుమార్, కోశాధికారి కానుకుంట శ్యామ్, సంయుక్త కార్యదర్శులు కంచెమిది సంతోష్, మొరుగు నవీన్, బత్తుల ఆంజనేయులు, గంగి ఆంజనేయులు, వేణుగోపాల్,శంకరయ్యలు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో స్థిరాస్థి పన్ను రూ.30 కోట్లు వసూలు



**నవతెలంగాణ-అల్వాల్**

అల్వాల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో స్థిరాస్తి పన్ను రూ.30 కోట్లు వసూలు చేసినట్టు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఓటీఎస్ పథకం మార్చి 31 ముగుస్తుందని తెలిపారు. గడువు లోగా మరో కోటి రూపాయల వసూలు చేస్తామని పేర్కొన్నారు. అల్వాల్ మున్సి పల్ కార్పొరేషన్‌లో స్థిరాస్తి, వాణిజ్య పన్నుల వసూళ్లలో మూడో స్థానంలో ఉంద ని వివరించారు. గత వార్షిక సంవత్సరంలో రూ.27 కోట్లు వసూలు కాగా ఈ వార్షిక సంవత్సరం రూ. 30 కోట్లు వసూళ్ల పూర్తయ్యాయని తెలిపారు.

## డిజిటల్ లావాదేవీలు, యోనో యాప్‌లపై ఖాతాదారులకు అవగాహన



**నవతెలంగాణ-కాప్రా**

ఏటీఎం డెబిట్ కార్డు లేకుండానే ఆర్థికపరమైన లావాదేవీల నిర్వహణపై ఖాతాదారులు అవగాహనను కలిగి ఉండాలని ఈసీఐఎల్ ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కె.రాంబాబు పేర్కొన్నారు. బుధవారం ఈసీఐఎల్‌లోని బ్యాంకు శాఖలో 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు 'యోనోయాప్ బిజినెస్' పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో డిజిటల్ లావాదేవీల నిర్వహణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనుమానాలు, నిర్వహణ అంశాలపై ఖాతాదారులు బ్యాంకుకు వచ్చి సందేహాలను నివృత్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ శిబిరంలో 510 మంది ఖాతాదారులకు యోనో యాప్ ఇన్‌స్టాల్ చేసి శిక్ష నిచ్చినట్టు తెలిపారు. ఎస్‌బీఐ యోనోయాప్ ద్వారా ఏటీఎం డెబిట్ కార్డులు లేకుండా చరవాణిలోనే సులువుగా అన్ని రకాలైన ఆర్థిక లావాదేవీలు, డిజిటల్ బ్యాంకింగ్ నిర్వహణ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీబీఎం రేణక, డిజిటల్ బ్యాంకింగ్ ఇన్‌చార్జి నాగేంద రావాసుకి, నాగార్జున, అర్చన, లక్ష్మీప్రసన్న కిషోర్, సాయికృష్ణ, పాల్గొన్నారు.

## 'కేసీఆర్ కారణజన్ముడు' పాటల సీడీ ఆవిష్కరణ




**నవతెలంగాణ-కాప్రా**

దండెం దరువు యుట్యూబ్ ఛానెల్ ద్వారా దండెం నరేందర్ రచించిన కేసీఆర్ కారణజన్ముడు, కలియుగ రాముడు పాటల సీడీని మాజీ మంత్రి కేటీఆర్ తెలంగాణ భవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, సాయి కుమార్, భూపతి అశోక్, మానుపాటి నరేష్, కత్తుల రాజ్ కుమార్, రాంచెర్ల బాలనర్సింహా, పూస రమేష్, భూపాల్ గౌడ్, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు ఐదుగురు కౌన్సిలర్లు రాజీనామా?









- బీజేపీలోకి ముగ్గురు, కాంగ్రెస్‌లోకి ఇద్దరు

**నవతెలంగాణ- మేడ్చల్**

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. మున్సిపాలిటీకి చెందిన ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేశారు. 1వ వార్డు కౌన్సిలర్ రజితావెంకటేష్ ముదిరాజ్, 7వ వార్డు కౌన్సిలర్ మారేపల్లి రాజకుమారిసుధాకర్, 13వ వార్డు కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, 2వ వార్డు కౌన్సిలర్ లక్కిరెడ్డి శ్రీలతాశ్రీనివాస్‌రెడ్డి, 8వ వార్డు కౌన్సిలర్ అంతోనమ్మ ఫిలిప్స్, కో ఆప్షన్ సభ్యులు చిన్నప్పరెడ్డి, బట్టికాడి దేవేందర్ ముదిరాజ్ తదితరులు బీఆర్ఎస్ రాజీనామా చేసి కాంగ్రెస్, బీజేపీ పార్టీలో చేరనున్నట్లుగా తెలుస్తోంది. కాగా కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, లక్కిరెడ్డి శ్రీలత శ్రీనివాస్ రెడ్డి, రజిత వెంకటేష్ ముదిరాజ్ బీజేపీలో, మిగతా కౌన్సిలర్లు అంతోనమ్మ ఫిలిప్స్, మారేపల్లి రాజకుమారి సుధాకర్, కోఆప్షన్ సభ్యులు బట్టికాడి దేవేందర్ ముదిరాజ్, చిన్నప్పరెడ్డి, 5వ వార్డు యువ నాయకుడు కుండ భానుచందర్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లుగా సమాచారం. తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించడంలో మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు.

## స్వీప్ ఆధ్వర్యంలో ఓటుపై అహగాహన



- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి, మెప్మా పీడీ అనీల్

**నవతెలంగాణ-జవహర్‌నగర్**

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి, మెప్మా పీడీ అనీల్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ అధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎటువంటి ప్రలోబాలకు గురికావద్దని తెలిపారు. ప్రజాస్వామ్య మనుగడ ఓటు హక్కుతోనే ముడిపడి ఉందని స్వీప్ అధికారులు చెప్పారు. నీ ఓటు.. నీ హక్కు అనే నినాదంపై మున్సిపవల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి, మెప్మా పీడీ అనీల్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు

- ప్రారంభించిన జవహర్ నగర్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా



**నవతెలంగాణ-జవహర్‌నగర్**

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జవహర్ నగర్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం జవహర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా, డ్వాక్రా భవన్ ప్రాంగణంలో, మార్కెట్ వీధి పాత బస్టాండ్, బాలాజీ నగర్ ప్రధాన రహదారి, కూరగాయల మార్కెట్లల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీలైనంత వరకు పట్టణంలోని అన్ని ఏరియాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనునిత్యం ప్రజా సేవలో ఉంటూ ప్రజా అవసరాలను తీర్చడంలో ఎంతో ఆనందం ఉందని పేర్కొన్నారు. వేసవికాలం ముగిసేంతవరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ప్రజలు మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లొద్దని సూచించారు. ముఖ్యంగా వృద్దులు, చిన్నారులు బయటికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా?



- దాడికి గురైన వాళ్లపైనే పోలీసులు లాఠీఛార్జ్ చేస్తారా
- తక్షణమే బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- చెంగిచర్ల ఘటనపై ఎంపీ బండి సజయ్

**నవతెలంగాణ-బోడుప్పల్**

మేడ్చల్ జిల్లా చెంగిచర్ల ప్రాంతంలో ఎస్టీ సామాజిక తరగతి మహిళలపై దాడిని బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఖండించారు. "ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా? కేసీఆర్ పాలనలో రజాకార్ల అరాచకాలను చూపించారు.. మీరు ఎమర్జెన్సీ టైంలో ఇందిరమ్మ పాలన ఎలా ఉందో ఇప్పుడు చూపించాలనుకుంటున్నారా?" అని ప్రశ్నించారు. బుధవారం చెంగిచర్లలో ఆయన పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. హెూలీ పండుగలో ఎస్టీ సామాజిక తరగతి ప్రజలు కాముడి దహన కార్యక్రమంలో ఉండగా.. ఒక తరగతికి చెందిన కొందరు దాడి చేయడం దుర్మార్గం అన్నారు. మహిళలని చూడకుండా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో రూప అనే మహిళ తీవ్రంగా గాయపడి చావుబతుకుల మధ్య పోరాడుతోందన్నారు. మరో మహిళ తీవ్రంగా గాయపడిందని చెప్పారు. దాడులు చేసిన వాళ్లను వదిలేసి.. దాడులకు గురైన వాళ్లపైనే పోలీసులు లాఠీఛార్జి చేస్తారా? అని ప్రశ్నించారు. పండుగ చేసుకుంటే వాళ్లకు వచ్చిన ఇబ్బందేమిటి? పోలీసులెందుకు పట్టించుకోవడం లేదు.. దాడి చేసిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని అన్నారు. అందరినీ సమానంగా చూడాలి కానీ ఓట్ల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక తరగతికి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. "మేం ప్రశాంత వాతావరణం కోరుకుంటున్నాం.. మా సహనాన్ని చేతకానితనంగా భావిస్తే ఖబడ్దార్.." అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌ను ప్రజలు ఏ విధంగా బొంద పెట్టారో.. కాంగ్రెస్‌కు అదే గతి పడుతుందని అన్నారు. చెంగిచర్ల ఘటనకు బాధ్యులైన దుండగులపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఏనుగు సుదర్శన్ రెడ్డి, ఏర్పుల మహేష్ తదితరులు ఉన్నారు.

## దేశంలోనే మొదటి మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీ



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

దేశంలో మొట్ట మొదటిసారిగా మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీ చేసినట్టు పల్స్ హార్ట్ హాస్పటల్స్ ఎండీ డాక్టర్ ముఖర్జీ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండా రోగికి చికిత్స చేసి విజయం సాధించామన్నారు. మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీతో కార్సినోయిడ్ గుండె జబ్బుతో బాధపడుతున్న 59 ఏండ్ల మహిళా రోగికి ట్రాన్స్‌కాథెటర్ పల్మనరీ వాల్వ్ రీప్లేస్‌మెంట్, ట్రైకస్పిడ్ వాల్వ్ రీప్లేస్‌మెంట్‌ను నిర్వహించి ఆమెకు పునర్జీవం కల్పించామన్నారు. మియాపూర్ పల్స్ హార్ట్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎంఎస్ఎస్ ముఖర్జీ, డాక్టర్ మొవ్వా శ్రీనివాస్ నేతత్వంలోని సర్జన్ల బృందం కార్సినోయిడ్ గుండె జబ్బుతో బాధపడుతున్న రోగికి కుడివైపు గుండె కవాటాలు ట్రైకస్పిడ్, పల్మనరీ వాల్వ్‌లు రెండూ తీవ్రంగా లీకేజీకి గురయ్యాయని గుర్తించారు. దీంతో శస్త్ర చికిత్స లేకుండా రోగికి ట్రాన్స్‌కాథెటర్ పల్మనరీ వాల్వ్ రీప్లేస్‌మెంట్, ట్రైకస్పిడ్ వాల్వ్ రీప్లేస్‌మెంట్‌ను నిర్వహించారు. టీపీఆర్ అనేది భారతదేశంలోని ఎంపిక చేయబడిన కొన్ని వైద్య కేంద్రాల్లో మాత్రమే చేయడానికి అవకాశం ఉన్న చాలా అరుదైన ప్రక్రియ. అయితే టీఆర్ ఐసీ వాల్వ్ భర్తీ కోసం ప్రత్యేక శిక్షణ, నైపుణ్యం అవసరమయ్యే మరింత అరుదైన ప్రక్రియ. ఈ రెండు విధానాలను ఒకే రోగిలో నిర్వహించడం అనేది ఒక ప్రత్యేకమైందని ఆయన అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నాలుగు చోట్ల ఇలాంటి చికిత్స నిర్వహించగా.. మన దేశంలో మియాపూర్ పల్స్ హార్ట్ ఆస్పత్రిలో నిర్వహించడం పట్ల డాక్టర్ ముఖర్జీ ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రోగి కోలుకుని చికిత్స తర్వాత నడుస్తుందని ఆయన తెలిపారు.

## 'వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్'పై అంతర్జాతీయ సదస్సు

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ పిలానీ వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ విభాగం ఏప్రిల్ 15, 16 తేదీల్లో తమ హైదరాబాద్ క్యాంపస్‌లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ నిర్వహించనుంది. 'వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్' క్లిష్టమైన నిర్దిష్ట డొమైన్‌లో భవిష్యత్ కోసం నిర్మాణాత్మక దిశలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించింది. భారత ప్రభుత్వం అఖిల భారత సాంకేతిక విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ సీతారాం, ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రావాలని బిట్స్ పిలానీ చేసిన ఆహ్వానాన్ని మన్నించారు. కీలక ప్రసంగాలు, ప్యానెల్ చర్చలు, పేపర్, కేస్ స్టడీ ప్రెజెంటేషన్‌లను ఆకర్షించడం ఈ సదస్సులో విద్యా రంగం, పరిశ్రమల నుంచి అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన ఆలోచనా నాయకులతో కీలక ప్రసంగాలు, ప్యానెల్ చర్చలు (వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ స్పేస్‌లో సమకాలీన అంశాలపై) ఉంటాయి.

ఈ సమావేశానికి హాజరయ్యే ప్రముఖ వక్తల్లో ప్రొఫెసర్ మను కపూర్, జూరిచ్, ప్రొఫెసర్ డానియల్ జోనాథన్ బెర్న్‌స్టెయిన్, ప్రొఫెసర్-ఎమిరిటస్, కాన్సాస్ విశ్వవిద్యాల యం, యుఎస్ఏ , ప్రొఫెసర్ నెల్సన్ లేసీ, ప్రొఫెసర్-ఎమెరిటస్, యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్, డాక్టర్ లక్ష్మీనారాయణన్ సామవేదం, అసోసియేట్ ప్రొఫెసర్, సింగపూర్ విశ్వవిద్యాలయం, డాక్టర్ ఎడమన ప్రసాద్, ప్రొఫెసర్, ఐఐటీ-మద్రాస్, పిబి కోటూర్, ఇంజినీరింగ్ అకాడమీ గ్లోబల్ హెడ్, ఎల్ అండ్ టి టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఉన్నారు.

ఈ సదస్సులో ఐదు ఆకర్షణీయమైన అంశాలపై పరిశోధకులు, అభ్యాసకుల నుంచి పేపర్, కేస్ స్టడీ ప్రెజెంటేషన్‌లు ఉంటాయి. ఈ అంశాల్లో వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ కోసం భవిష్యత్ దిశల పై అంచనాలు, బోధనా పద్ధతులు, అంచనా నమూనాలు, ఆవిష్కరణ, అభ్యాస సాంకేతికతలు, పరిశ్రమ-విద్యా సహకారం ఉంటాయి.

## 'ఈటల రాజేందర్‌కు పద్మశాలీల సంపూర్ణ మద్దతు'



**నవతెలంగాణ-కాప్రా**

బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని పద్మశాలీలు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బుధవారం మార్కండేయ నగర్ కాలనీలోని కాప్రా పద్మశాలి సంక్షేమ సంఘం భవనంలో అఖిల భారత యునైటెడ్, రాష్ట్ర, పద్మశాలీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో ఉన్న 2.50 లక్షల పద్మశాలీలు ఈటల రాజేందర్‌కు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఈటలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, అఖిల భారత యునైటెడ్ పద్మ శాలీ సంఘం అధ్యక్షుడు బాబూరావు, వనమాలి శంకర్, కంది శ్రీ రాములు, బొమ్మ రఘు రామ్, పట్టాభి, సత్యనారాయణ ఉన్నారు.

## మచ్చబొల్లారంలో ఓబీసీల సమావేశం

- హాజరైన తెలంగాణ ఓబీసీ మోర్చా ఇన్‌చార్జి రాజేశ్యామ్

**నవతెలంగాణ-అల్వాల్**

అల్వాల్ డివిజన్ మచ్చబొల్లారంలో ఓబీసీ సామాజిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఇన్‌చార్జి రాజేశ్యామ్, తెలంగాణ రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన ముద్ర లోన్స్ గురించి వివరించారు. 18 రకాల చేతివృత్తులపై అవగాహన కల్పించారు. విశ్వకర్మ యోజన కింద బీసీల్లోని వివిధ రకాల చేతివృత్తుల వారికి కేంద్ర ప్రభుత్వం బాసటగా ఉంటుందని చెప్పారు కార్యక్రమంలో మొయి సుజాత, జిల్లా ఓబీసీ ప్రెసిడెంట్ మంగేష్, దివాకర్, వినయ్,శంకర్ మల్లికార్జునగౌడ్ , వెంకటేష్, శంకర్ సుధా, పద్మిని సుజాత పాల్గొన్నారు.



అల్వాల్ సర్కిల్‌లోని సాయిబాబా నగర్, మంగాపురం, పాత అల్వాల్ ప్రాంతంలో కొనసాగుతున్న పనులను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాషా అభినవ్ బుధవారం పరిశీలించారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు ఉన్నారు. - నవతెలంగాణ,అల్వాల్

## అల్వాల్‌లో పోలీసుల తనిఖీలు



**నవతెలంగాణ -అల్వాల్**

పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో అల్వాల్ పోలీసులు ఈ సేవా కేంద్రం వద్ద బుధవారం తనిఖీలు చేపట్టారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల్లో మద్యం, డబ్బు తరలించకుండా చెకింగ్ చేస్తున్నామని అల్వాల్ ఎస్సై జ్యోతి తెలిపారు. ఆమె వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

## రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

- ఆల్విన్ కాలనీ డివిజన్ నాయకులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని, ఆల్విన్ కాలని డివిజన్ నుంచి ముఖ్య నాయకులు, క్రిస్టియన్ సోదరులు కలిశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలిపిస్తామని మద్దతు తెలియచేస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, అనిల్ రెడ్డి, మల్లేష్, ఇశ్రాయిల్, సత్యరాజు, శామ్యూల్, నాగభూషణం, ఫ్రారూఖ్ తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్‌లో చేరిన ఇతర పార్టీల నాయకులు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ 22వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు మేడా శ్రీనివాస్, 3వ డివిజన్ కాంగ్రెస్ నాయకురాలు షేక్ రఫియా బేగం ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పార్టీ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి, నిజాంపేట్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి ఎన్ఎంసీ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డిల సమక్షంలో పార్టీ కండువా కప్పి 3వ డివిజన్ వాసులు జి.లోకనాథ్, టి.శాంతి స్వరూప్, ఎం.రాము, ఏ.వేణు మాధవ్ రెడ్డి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమ పతకాలకు ఆకర్షితులై చేరామని తెలిపారు.

## బీఆర్ఎస్ మల్కాజిగిరి అభ్యర్థి విజయమే లక్ష్యం



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి/ కేపీహెచ్‌బీ

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన, బుధవారం తెలంగాణ భవన్‌లో, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పరిచయ కార్యక్రమాన్ని, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే అండగా నిలబడ్డారని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎవరైతే తోడుగా ఉంటారో వారిని ఎప్పటికీ మర్చిపోమని తెలిపారు. తిరిగి మళ్ళీ అఖండ మెజారిటీతో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రాబోతుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. తనకు ఆరోగ్యం సహకరించకున్న కూడా మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి విజయం లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్న ఉద్దేశంతో సంకల్పించుకున్నానని పేర్కొన్నారు. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, కండ్ల ముందు కనబడుతుందన్నారు. నేడు కనీసం ఎవరితో అన్నా మాట్లాడినా ఇతర పార్టీలోకి వెళ్తున్నారన్న గుసగుసలు వినబడటం ఎంతో బాధ కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఏడు నియోజకవర్గాల్లో అందరూ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు నాయకులు కృషిచేసి రాగిడి లక్ష్మారెడ్డినీ భారీ మెజారిటీతో గెలిపిస్తామని పిలుపునిచ్చారు.

## నీటి వృధాపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- రోడ్లపై వృధాగా పోతున్న నీరు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కాలనీల్లో, బస్తీల్లో నీటిని వృధాగా రోడ్ల పై వరదలా పారుతున్నారు. నీటిని వృధా కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత సంబంధిత జలమండలి అధికారులకు ఉందని, కొందరు స్థానికులు కోరుతున్నారు. అసలే ఎండా కాలం, ఎండల వేడి తాపానికి భగర్భ జలాలు అడుగంటిపోయి, బోర్‌లలో నీరు ఇంకిపోయి నీటి కొరత ఏర్పడటంతో ప్రతి ఇంట్లోనూ సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలో, ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటే కొంతవరకు నీటి సమస్యను అధిగమించగలరు. కానీ కూకట్‌పల్లి సర్కిల్, ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలో ఫేస్ వన్ బస్టాప్ నుంచి నాగార్జున స్కూల్ వెళ్ళే దారిలో, ప్రతి రోజూ ఉదయం పూట ఇండ్ల నుంచి వచ్చే నీరు రోడ్డు పై వరదలా ప్రవహిస్తూంది. పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుంది. అసలే ఎండాకాలం భూగర్భ జలాలు అడుగంటి, బోర్‌లు డ్రై అయిపోయి, నీరు రాకపోవడంతో నానా కష్టాలు పడుతున్న ప్రజలు, నాలుగు రోజులకోసారి వచ్చే నల్లా నీళ్లతో చాలీ చాలని నీళ్లతో పూట గడుపుతున్నారు.

నీటిని వృధా చేయడంలో కొందరు అవగాహనా రాహిత్యంగా ఉండటంపై, ఇటు సంబంధిత జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి, ప్రజలకు అవగాహన కల్పించి నీటి వృధాను అరికట్టలని స్థానికులు కోరారు. నీటి కష్టాల నుంచి కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్థానికులు తెలిపారు.

## ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలి



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అధికారులు ఎప్పటికప్పుడు డివిజన్‌లో పర్యవేక్షించి ప్రజా సమస్యలతో ఇబ్బందులు పడకుండా చూడాలని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం ప్రాంతంలోని రాంకీ అపార్ట్‌మెంట్స్ సమీపంలో పెట్టినటువంటి జిమ్, మాల్ వల్ల రోడ్లపై పెడుతున్న వెహికల్స్ వల్ల కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఈ మేరకు బుధవారం కాలనీవాసులతో కలిసి సమస్యను పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం గాజులరామారం ప్రధాన రహదారిలో జరుగుతున్న భూగర్భ డ్రయినేజీ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజలు ఇబ్బందులు పడకుండా పనులు తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదాల్లో పోలీసుల అత్యుత్సాహం తగదు



నవతెలంగాణ-దుండిగల్

భూ వివాదాల్లో పోలీసుల జోక్యం తగదని కోర్టులు సైతం పదేపదే చెబుతున్న మరోవైపు పోలీసులు మాత్రం భూ వివాదాలు పరిష్కరించకపోగా, భూ కబ్జాదారులకు వత్తాసు పలుకుతూ పోలీసులే అట్టి భూ వివాదంలో అత్యుత్సహంగా మారుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం వి. మనోహర్ రావు, ఇతర బాధితులు మీడియాతో మాట్లాడారు. వారు తెలిపిన వివరాల ప్రకారం దుండిగల్ మండలం మల్లంపేట గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 295 లో వి. మనోహర్ రావు, వారి సంబంధించిన ఇతరులకు చెందిన 4.14 ఎకరాల పట్టా భూమిలో గత 16 సంవత్సరాలుగా బోర్ వేసుకొని ఆవుల పెంపకం చేస్తున్నారు. కోట్ల విలువచేసే సంబంధిత భూమిని ఇటీవల ఇంటూరి రమేష్ అనే కబ్జాదారుడు తన అనుచరులతో కలిసి కబ్జాచేయడానికి ప్రయత్నిస్తూ బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోకుండా, బాధితులకు ఎలాంటి ఇబ్బంది కల్గించకూడదని హైకోర్టును ఆశ్రయించాం. అయినప్పటికి డీసీపీ స్థాయి ఉన్నతాధికారి నుంచి కింది స్థాయి పోలీసులు సైతం కబ్జాదారుడికి కొమ్ముకాస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. భూకబ్జాదారుడికి వంత పాడుతున్న డీసీపీ, ఇతర పోలీస్ సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవడమే కాక తమ భూమితో పాటు తమకూ వారినుంచి రక్షణ కల్పించాల్సిందిగా బాధితులు ఉన్నతాధికారులను కోరుతున్నారు. పోలీసులు కబ్జాదారుడిని కాపాడడం కోసం వారు తమపై ప్రవర్తిస్తున్న తీరుపై సీసీ ఫుటేజ్‌లతో సహా ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, న్యాయస్థాన చట్టంపై గౌరవం ఉందని, బాధితులు సీసీ ఫుటేజీలను మీడియాకు చూపించారు.

## ప్రసాద్ ఘంట గానం సుమధురం




నవతెలంగాణ-కల్చరల్

జబ్ దీప్ జలే అనా హిందీ చిత్రం లోని జేసుదాసు పాటను ప్రసాద్ గంటా సుమధురంగా ఆలపించి శ్రోతలను ముగ్ధులను చేశారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా దీక్షితులు కళా వేదిక పై సుబ్బు ముజిక్ అకాడెమీ నిర్వహణ హిందీ చిత్ర గీతాలు విభావరి జరిగింది. ప్రధాన గాయకుడు ప్రసాద్ సహా గాయకులు కెఈ.రాజు, రామ సుబ్రహ్మణ్యం, భాగ్య శ్రీ, భావన,నీరజ, భువనేశ్వరి, స్వప్న అనంత జ్యోతి తదితరులతో కలిసి పలు హిందీ గీతాలు మధురంగా ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా ప్రముఖ గాయకులు త్రినాథ రావు వై.ఎస్. రామ కృష్ణలు పాల్గొని, మాట్లాడుతూ అమెరికాలో స్థిర పడినప్పటికీ మాతృ భాష తెలుగు దేశ భాష హిందీనీ మరువక తన గళంలో ఆ భాషా గీతాలు మధురంగా గానం చేస్తున్నారని ప్రశంసించారు. సంస్థ స్థాపకుడు రామ సుబ్రహ్మణ్యం ప్రసాద్‌ను సత్కరించారు.


## రస రంజని శాశ్వత వేదికకు కృషి చేస్తాం...



నవతెలంగాణ-కల్చరల్

తెలుగు నాటక రంగ పురోభివృద్ధికి ఏర్పడిన రస రంజని సంస్థ గత ముప్పై ఏండ్లుగా శాశ్వత ప్రదర్శన వేదిక ఏర్పాటు చేసుకోలేక పోవటం విచరకరమే అని ఇక పై ఇందుకు గాను కృషి చేస్తామని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కె.వి.రమణ తెలిపారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై రస రంజని 31 వార్షిక వేడుకల సందర్భంగా నిర్వహిస్తున్న నాటకోతచాలులో భాగంగా బుధవారం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని మాట్లాడారు నాటక రంగం అభివృద్ధికి ప్రతి జిల్లాలో ఆడిటోరియం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన గత ప్రభుత్వ కాలం నుంచి కాగితం వరకే వుండి పోయిందన్నారు. నేడు ప్రదర్శిస్తున్నన చి కేతు నాటకంకి దర్శకత్వం వహిస్తున్న కోట్ల హనుమంత రావు రస రంజని పూల వనంలో గులాబి అని అభివర్ణించారు. సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ మాట్లాడుతూ నేడు తెలుగు నాటకం సౌజన్య దాతల వల్లనే కొనసాగుతోందన్నారు. పొరుగు రాష్ట్రాలలో వారి భాషా నాటకాలకు ప్రభుత్వ సహకారం వుందని తెలుగు నాటక అభివృద్ధికి ప్రతి జిల్లాలో ఆడిటోరియం ఏర్పాటు కావాలని పత్రికలలో డిజిటల్ పేజీ లోనైన నాటక ప్రక్రియకు ప్రాధాన్యత ఇవ్వాలని పత్రికల్లో నాటక విమర్శ వుండాలని సూచించారు. కళా పోషకుడు సారిపల్లి కొండలరావు అధ్యక్షత వహించిన సభలో ప్రముఖులు డీఎస్ఎన్ మూర్తి సుధామ పాల్గొన్నారు. కార్యదర్శి ముట్నూరి కామేశ్వర రావు నివేదిక సమర్పించిన సభను నటరాజ్ మోహన్ సేనాపతి, నారాయణ స్వామి, రాధా కృష్ణ అరుణ కుమార్‌లు పర్యవేక్షణ చేశారు. అనంతరం ఆకెళ్ళ శివ ప్రసాద్ రచించిన నచికేత నాటకం ఆచార్య కోట్ల హనుమంతరావు దర్శకత్వంలో ప్రదర్శించారు. యముడు స్వయంగా జ్ఞానీ నచి కేతుకు బోధించిన మరణ రహస్యాన్ని ఆధునిక కాలంకు ఆపాదిస్తూ చెప్పిన కథాంశం నచి కేతు నాటకం.

## కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపిన వడ్డేపల్లి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లిలో బుధవారం వై జంక్షన్‌లో గల అభినంద్ గ్రాండ్‌లో జరిగిన కందా రాంబాబు, పద్మావతిల పుత్రుడు అరుణ్ కుమార్, సాయి ప్రియల వివాహ వేడుకలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పాల్గొన్నారు. అనంతరం నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహ చారి, భరత్ కుమార్, చింటూ రావు, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

**కేపీహెచ్‌బీ :** కే.పీ.హెచ్.బీ కాలనీ ఫేజ్ 7 లో గల శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన మూసాపేట్‌కు చెందిన కోటేశ్వర రావు- రాజేశ్వరిల కుమార్తె వాసవి, వెంకటేష్ వివాహ వేడుకకు రాష్ట్ర కార్యవర్గ బీజేపీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు హాజరయ్యారు. అనంతరం నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్, ఎర్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.



## వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

వ్యక్తి అదృశ్యమైన సంఘటన పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... న్యూ టౌన షిఫ్ షాద్ నగర్‌లో నివాసం ఉండే మల్లారెడ్డి ఈ నెల 19న కొంగర కాలాన్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భూ సమస్య పరిష్కారం కోసం బైక్ నెంబర్ ఏ.పి.22 ఏ.అర్.5801పై ఈ నెల 12 న ఇంటి నుంచి బయటకు వెళ్లి తుక్కుగూడలోని అతని స్నేహితుడు కందాడి మల్లేష్ అర్.ఎం.పి.డాక్టర్ ఇంటి వద్ద పెట్టి పని నిమిత్తం రాజమండ్రి వెళ్లినట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న సెల్ నెంబర్ 9848741404 పోన్ చేయగా స్విచ్చాఫ్ రావటంతో ఆందోళనకు గురైన కుమారుడు ద్యాప సాయి కృష్టారెడ్డి ఆచూకీ కోసం బంధువులను స్నేహితులను సంప్రదించగా సమాచారం అందక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నెంబర్

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్






నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు, ఓటర్ల సౌకర్యార్థం ఈ నిర్ణయం చేసినట్టు తెలిపారు. ఈ నెంబర్ 24 గంటలు పని చేసే విధంగా ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఎన్నికల సమయం కావడంతో ఏమైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 2050 కు ఫోన్ చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు డబ్బు తరలింపులు, ఇతర ప్రలోభాలకు గురి చేసినట్టు ఎవరైనా గుర్తిస్తే వెంటనే ఈ టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచా రం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

## గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మెగాస్టార్ చిరంజీవి తనయుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 39వ జన్మదిన వేడుకలు అఖిల భారత రామ్ చరణ్ యువత అరవింద్ చెర్రీ, సందీప్ ధనపాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా అభిమానులు శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం ప్రాంగణంలో రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు రవణం స్వామి నాయుడుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ యువకులు రక్తదానం చేయడం అంటే ప్రాణం దానం చేయడమే అని అన్నారు. నేటి యువత మానవతా థృక్పదంతో సమాజంలో ఇలాంటి కార్యక్రమంలో నిర్వర్తించడము, పాల్గొనడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నూతి రాంబాబు, భట్టో రాంబాబు, కొల్లా శంకర్, పి.సుభాష్, షణ్ముఖ, పులగం సుబ్బు, మధుసూధన్ రెడ్డి, సుధాకర్, నవీన్, అంజి, మెగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

టాలీవుడ్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ జన్మదినం సందర్భంగా మెగా అభిమానుల సమక్షంలో బుధవారం కేపీహెచ్‌బీ 5వ ఫేస్ జనసేన పార్టీ కార్యాలయంలో రామ్ చరణ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి ఆస్కార్ పురస్కారాలు పొందిన చిత్రంలో నటించి గ్లోబల్ స్టార్ స్థాయికి చేరుకున్న రామ్ చరణ్‌కు నా హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడిగా ముందుకు వెళ్తున్న చరణ్ రానున్న రోజుల్లో మరిన్ని విజ యాలను అందుకోవాలని మన స్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, మెగా అభి మానులు తదితరులు పాల్గొన్నారు



## ఆలయ పునఃనిర్మాణ పనులను ప్రారంభించిన వడ్డేపల్లి



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్‌లోని రాజు కాలనీలో ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం, దుర్గమాత ఆలయ పునః నిర్మాణ మహోత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పాల్గొని ప్రసన్న ఆంజనేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో బుధవారం దేవాలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు మానసిక ప్రశాంత నిలయాలని, ఆలయానికి తన వంతు సహకారం అందిస్తాని తెలిపారు. ఆలయ నిర్మాణం త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు రమేష్, డివిజన్ కార్యదర్శులు లక్ష్మణ్, వెంకట సేనా రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు శివరంజని, సూర్య ప్రకాష్ రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి

- డాక్టర్ కట్టా నర్సింహా రెడ్డి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్త వహించి, మానసికంగా ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా మనను మనమే కాపాడు కోవాలని జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కట్టా నర్సింహా రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో బుధవారం యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎస్ శోభా రాణి, డాక్టర్ ఎం.పద్మావతిల ఆధ్వర్యంలో యూనివర్సిటీ క్యాంపస్ హెల్త్ సెంటర్ డాక్టర్స్ పర్యవేక్షణలో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనకు ఎంత సంపద ఉన్న అనుభవించడానికి ఆరోగ్యం చాలా అవసరం, ఆరోగ్యం సరిగా లేకపోతే మనం ఏమి చేయలేమన్నారు. ఆరోగ్యం సమస్య చిన్నగా ఉన్న సమయంలో అనుభవం గల డాక్టర్స్ సంప్రదించి వారు చెప్పిన విధంగా నడుచుకుంటూపోవాలన్నారు. యూని వర్సిటీ ఎన్ఎస్-ఎస్, కాలేజీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ ఇరువురు కూడ అపోలో లాంటి పెద్ద ఆసుపత్రి వారిని సంప్రదించి ఇక్కడ హెల్త్ చెక్ క్యాంపు ఏర్పాటు చేయడంలో వారి కృషిని అభినందనలు తెలిపారు. క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జివి.నర్సింహా రెడ్డి మాట్లాడుతూ కరోనా వచ్చి తగ్గిన తర్వాత కరోనా టైమ్‌లో చిన్న, పెద్ద, పేద, ధనిక అనే బేధం లేకుండా అందరూ కూడ నేడు ఆరోగ్యం మీద చాలా శ్రద్ధ చూపుతున్నారన్నారు. విద్యా ర్థులు యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. శోభా రాణి కాలేజ్, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ డాక్టర్ ఎం. పద్మావతి, ఇట్టి హెల్త్ క్యాప్ రెండు రోజులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కంటి పరీక్షలు పంటి పరీక్షలు ఈసీజీ, కాన్సర్ పరీక్షలు పలు రక్త పరీక్షలు షుగర్ టెస్ట్ గుండెకు సంబంధించిన పరీక్షలు నేడు రేపు నిర్వహించడం జరుగుతుంది అని పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రసన్న తెలియచేశారు. యూని వర్సిటీ రెక్టర్ డాక్టర్ విజయ కుమార్ రెడ్డి, యూనివర్సిటీ రిజిస్టార్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు ఎన్ఎస్ఎస్ వారి సేవలు అభినందనలు తెలియచేస్తూ ఇరువురు కంటి పరీక్షలు చేయించుకున్నారు.

నేడు అనేక కొత్త ఆలోచనతో యువత ముందుకు వెళ్తుందని జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్ లర్ డాక్టర్ కట్టా నర్సింహా రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ యూనివర్సిటీలో "ఇగ్నైట్ సర్టిఫికేట్. ప్రోగ్రాము"ను డైరెక్టరేట్ అఫ్ ఎంటర్ప్రెన్యూర్షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ డైరెక్ట్ డాక్టర్ ఆర్.శ్రీదేవి ఆధ్వర్యంలో వాధ్వాని ఫౌండేషన్ సహాయంతో స్టార్టప్ విషయంపై శిక్షణ సెమినార్ బుధవారం నిర్వహించారు. ఈ సెమినార్‌కు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కట్టా నర్సింహా రెడ్డి ము ఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న విషయాలు వారి వారి ఆలోచనలకు తగిన విధంగా కొ త్త స్టార్టప్ తయారు చేసుకొని వారు ఉపాధి పొందడం కాకుండా మరో పది మంది యువ కులుకు ఉపాధి అవకాశం ఇస్తున్నారన్నారు. రెక్టర్ డాక్టర్ కె.విజయ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆలోచన విషయం పట్ల అవగాహన, కొత్త ఆలోచన వచ్చిన దాన్ని ఎలా సాధించాలి అన్న పట్టుదలతో ఉన్నారని తెలిపారు. రిజిస్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలి అన్న యువత చేతుల్లోనే ఉందని, మీ ఆలోచన విధానం వల్ల దేశం ఆయా రంగాల్లో అభివృద్ధి సాధ్యం అన్నారు. సెమినార్‌కు యూనివర్సిటీ అనుబంధ కాలేజీ లో ఉన్న స్టార్టప్ ఇన్‌చార్జి ప్రొఫెసర్స్ సుమారు 75 మంది పాల్గొన్నారు. వ్యవస్థాపక స్ఫూర్తిని కలిపించి ఆయారంగాల విజయానికి అవసరమైన నైపుణ్యాలు అందించి వారిని సిద్ధం చేస్తారని డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
10
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
గురువారం | మార్చి 28, 2024 | www.navatelangana.com







ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో బుధవారం ఐపీఎల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌కు భారీగా ప్రేక్షకులు తరలివచ్చారు. మ్యాచ్‌లో ముంబై పై సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు విజయం సాధించడంతో ఫ్యాన్స్‌లో జోష్ కనిపించింది.
నవతెలంగాణ-సిటీబ్యూరో

## ఇద్దరు కుమారులతో గృహిణి అదృశ్యం




**నవతెలంగాణ-బడంగ్ పేట్**

ఇద్దరు కుమారులతో కలిసి గృహిణి అదృశ్యమైన సంఘటన పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర నాందేడ్ కు చెందిన షేక్ యునుస్ భార్య ఇద్దరు కుమారులతో కలిసి ఉపాధి కోసం గత 6సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లోని బాలాపూర్ మండలం జల్ పల్లికి వచ్చి నివాసం ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.ఈ నెల 25న ఉదయం అతను భర్త ఇంటి నుండి బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. భార్య హిన, 10 ఏండ్ల అర్మాన్, 8 ఏండ్ల సాజిద్ కనిపించక పోవటంతో ఇంటి పక్కల ఉన్న పలువురిని బంధువులను, స్నేహితులను, ఆచూకీ కోసం సంప్రదించగా సమాచారం అంద లేదు. భర్త పిర్యాదు మేరకు పహడి షరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నారు.. జల్ పల్లి గేట్ దగ్గర నివాసం ఉండే ఇస్మాల్ పై అనుమానం ఉన్నట్లు తెలిపారు.



## శ్రీనివాస సమాజ సేవా ట్రస్ట్ సేవలు ఎంతో గొప్పవి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**నవతెలంగాణ-బేగంపేట్**

పేదల కోసం శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలు ఎంతో గొప్పవని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం ఏప్రిల్ 10 వ తేదీ నుంచి సనత్ నగర్ డివిజన్ లోని బీకే గూడ పార్క్ వద్ద ఉచిత భోజన పంపిణీ కార్యక్రమం, చలివేంద్రం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ప్రారంభోత్సవానికి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను బుధవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని వారి నివాసంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత భోజన కార్యక్రమం చేపట్టి సుమారు రెండు నెలల పాటు అనేకమంది ఆకలి తీరుస్తున్నారని ప్రశంసించారు. మేనేజింగ్ ట్రస్టీ డి. పార్థసారధి, ట్రస్ట్ సభ్యులు, సీనియర్ సిటీజన్స్ కష్టారెడ్డి, కష్ట దేవ్ గౌడ్, అరవింద్ గౌడ్ తదితరులు ఉన్నారు.



## బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ నేతలు

**నవతెలంగాణ-ఓయూ**

బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి తీగుల్ల పద్మారావు, బీఎస్పీ సికింద్రాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు రుద్రవరం సునీల్ ఆధ్వర్యంలో బుధవారం బీఎస్పీ నుంచి పలువురు బీఎస్పీ నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం పజ్జన్న మాట్లాడుతు సికింద్రాబాద్ పార్లమెంటును గెలుచుకోవాలని దానికి మీరంతా పట్టు వదలకుండా కషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అంబర్‌పేట్ మాజీ అధ్యక్షులు పిల్లీ జగన్ గంగ పుత్ర, ఇన్‌చార్జి వేల్పుల రవితేజ, సికింద్రాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కొంపల్లి రఘు, ఉపాధ్యక్షులు ఆశ, ముషీరాబాద్ అసెంబ్లీ అధ్యక్షులు పల్లెర్ల పరమేష్, మైనార్టీ కన్వీనర్ రహీంఖాన్, కంటోన్మెంట్ అధ్యక్షులు శివ లింగం, ఇన్చార్జి రేపాక రాజు, మోత్యార్ కుమార్, అందోల్ బాబు, ప్రశాంత్, నాంపల్లి నాయకులు యాకయ్య హుస్సేన్, బాలయ్య, సనత్ నగర్ నాయకులు పథ్వీరాజ్, అబ్దుల్ మజీద్, పాల్గొన్నారు.




## బహుజన్ ముక్తి పార్టీ ఎంపీ అభ్యర్థుల ప్రకటన

**నవతెలంగాణ-ఓయూ**

హబ్సిగూడాలోని రాష్ట్ర తెలంగాణ బహుజన్ ముక్తి పార్టీ కార్యాలయంలో లోకసభ అభ్యర్థుల ఎంపిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల కు తెలంగాణ బహుజన్ ముక్తి పార్టీ (బీఎంపీ) మొదటి జాబిత అభ్యర్థులను రాష్ట్ర అధ్యక్షులు మా. అంసోల్ లక్ష్మణ్ ప్రకటించారు. నాగర్ కర్నూల్ - గడ్డం విజయ్ నిజామాబాద్ -దేవతి శ్రీనివాస్, మల్కాజిగిరి - ఉప్పులేటి రాజేందర్, ఆదిలాబాద్ - భూక్యా రాజు, పెద్దపల్లి - మొయ్యి వేణుగోపాల్ లను ప్రకటించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొ ధర్మయ్య,రాష్ట్ర కార్యదర్శి ఎండీ. ఫయూముద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. నరేందర్ పవార్, స్టేట్ సెక్రటరీ మహమ్మద్ అన్సారీ, పాల్గొన్నారు.




## ప్రభుత్వం హైకోర్టు నిర్మాణాన్ని ఆపేయాలి

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ

**నవతెలంగాణ-బంజారా హిల్స్**

ప్రభుత్వం పునరాలోచించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మిస్తున్న హైకోర్టు నిర్మాణాన్ని ఆపివేసి ప్రజా సంక్షేమ నిర్ణయాలను తీసుకోవాలని అఖిలభారత విద్య పరిషత్ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏబీవీపీ ప్రతినిధులతో కలిసి ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో 100 ఎకరాల్లో నిర్మిస్తున్న హైకోర్టు నిర్మాణ పనులు వెంటనే ఆపివేయాలని కోరారు. ఈ ప్రారంభోత్సవానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్ర చుడ్, వస్తున్నారని ఆయన మీద గౌరవంతో తాము తలపెట్టిన బంద్‌ను విరమించుకున్నామన్నారు. ఈ ప్రారంభోత్సవం వలన ఆ ప్రాంతంలో జరిగే నష్టాన్ని రైతులతోపాటు విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడే ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి హైకోర్టు నిర్మాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు.

## సమ న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి

- సీహెచ్. భూపాల్ గౌడ్

**నవతెలంగాణ-బంజారా హిల్స్**




దేశ ప్రజలకు న్యాయ వ్యవస్థలో సమ న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సీహెచ్. భూపాల్ గౌడ్ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ దేశ రైతులు, సైనికులు ఆరు కాలలు కష్టపడి రౌడీలకు,ఆకతాయిలకూ కాపలా కాయడం అవసరమా అని అన్నారు. 146 స్కాంలు జరిగాయని వాటిపై రాబోయే కాలంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

## జీవితాన్ని ప్రతిబింబిస్తున్న సినిమా

- ప్రొ.ఆర్.లింబాద్రి
- తెలుగు సినిమా ఎంతో అభివృద్ధి చెందింది : మామిడి హరికష్ణ..
- ఓయూలో ఘనంగా ప్రారంభమైన జష్న్ - ఎ- సైన్మా



**నవతెలంగాణ-ఓయూ**

జీవితాన్ని సినిమా ఎంతో ప్రతిబింబిస్తోందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి మండలి చైర్మెన్ ప్రొ.ఆర్.లింబాద్రి అన్నారు బుధవారం ఓయూ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో రెండు రోజుల సినిమాల పండుగ జష్న్ -ఎ- సైన్మా ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రేక్షకులపై ముఖ్యంగా యువతపై సినిమాల ప్రభావం ఎక్కువగా ఉందని తెలిపారు. సాంకేతికత వల్ల యువ చిత్ర నిర్మాతలు ఇటీవలి చిత్రాలలో చాలా సృజనాత్మకమైన మార్గాల్లో తాజా కథలను బయటకు తీసుకొచ్చారని, అలాంటివి గొప్ప విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. పలువురు సినీ నటులు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ కు సీఎం గా అయినట్టు గుర్తు చేశారు.ఎన్ని పుస్తకాలు రాసినా చదివినా అర్థం కానీ కొన్ని విషయాలు మూడు గంటల సినిమా తో అర్థం చేసుకోవచ్చు అన్నారు.సమాజంలో సంస్కృతి, సంప్రదాయలు ఆర్థిక సామాజిక రాజకీయ పరిస్థితి, కట్టు, బోట్టు, వేషధారణ, ఇవ్వన్ని ఒక సినిమా ప్రతిబింబిస్తున్నట్టు చెప్పారు. యూత్ , విద్యార్థులను ఆకట్టుకోవడం లో సినిమా ముందు వరుసలో ఉందన్నారు.

సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికష్ణ సినిమా పరిణామాన్ని వివరిస్తూ షార్ట్ ఫిల్మ్‌లదే భవిష్యత్తు అని, 'సాంప్రదాయానికి విరుద్ధంగా, అడ్డంకులను ఛేదించడమే' ప్రస్తుత కాలపు స్ఫూర్తి అని అన్నారు.తెలుగు సినిమా నేడు ఎంతో అభివృద్ధి చెందిన్నట్టు చెప్పారు. సినిమా గొప్ప దానాన్ని దాని భవిష్యత్తు ను వివరించారు.ఓయూ వీసీ ప్రొ. డి.రవీందర్ మాట్లాడుతూ. క్యాంపస్‌లో సినిమాలను ప్రదర్శించిన విద్యార్థి రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. "సినిమాలు ముఖ్యంగా విలువల పరంగా చాలా ప్రభావం చూపుతాయి" ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని అవగాహనలో మార్పును ప్రతిబింబించేలా షార్ట్ ఫిల్మ్‌లు తీయాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో విభాగం హెడ్ ప్రొ.టి.సతీష్ కుమార్ అధ్యక్షత వహించగా ఆయన కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు.ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.కె.అర్జున్ రావు కుతాడి సినిమా పండుగను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. విభాగం హెడ్ ప్రొ. సతీష్ కుమార్ అతిథులకు స్వాగతం పలికి పండుగను ప్రారంభించారు. రెండు రోజుల పాటు, పండుగలో టీజర్ కట్‌లు, షార్ట్ ఫిల్మ్‌లు, ఆకస్మిక క్విజ్, ఇతర ఈవెంట్‌లపై పోటీలు ఉంటాయి అని చెప్పారు. సినిమా కోసం సౌండ్ డిజైన్‌పై మాస్టర్ క్లాస్, ఫిల్మ్ మేకింగ్‌లోని ఇతర చక్కని అంశాల గురించి ప్యానల్ డిస్కర్షన్‌లో చర్చించారు. కార్యక్రమంలో మాజీ విభాగం, హెడ్ ,డీన్ ప్రొ.స్టీవెన్ సన్, డా.రామస్వామి, డా.రామకృష్ణ, నిర్మల, మానస, రవి, అలివేలి రాజు, రాకేష్, హేమంత్, సమి, శ్యామ్, ధరణి, అక్షిత, మాళవిక, ప్రతుష, జాసన్, మహిత్, సాయి, జర్నలిజం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ప్రత్యామ్నాయ పార్టీలకు అవకాశమివ్వాలి

- ఏఐఎంఈపీ వ్యవస్థాపక అధ్యక్షురాలు నౌహిరా షేక్...
- ఏఐఎంఈపీ తొలి జాబితా విడుదల

**నవతెలంగాణ - బంజారాహిల్స్**

రాబోవు పార్లమెంట్ ఎన్నికలలో తెలంగాణలోని అన్ని స్థానాల నుంచి పోటీ చేస్తున్నట్టు ఆల్ ఇండియా మహిళా ఎంపవర్మెంట్ పార్టీ (ఏఐఎంఈపీ) వ్యవస్థాపక అధ్యక్షురాలు నౌహీరా షేక్ ప్రకటించారు. సోమాజిగూడలోని ఓ హెూటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకుడు జాన్ మస్క్‌తో కలిసి తొలి జాబితాను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి తాను స్వయంగా పోటీ చేస్తున్నానని తెలిపారు. చేవెళ్ల నుంచి ఇమామ్ హుస్సేన్, వరంగల్ నుంచి నవ్య, ఖమ్మం నుంచి శామ్యూల్, మెదక్ నుంచి రామచందర్‌లు బరిలో ఉంటారని చెప్పారు. మతాలకతీతంగా ఆధ్యాత్మిక చింతనలో కొనసాగుతున్న వ్యక్తులకు పార్టీ నుంచి టికెట్లు ఇస్తున్నట్టు తెలిపారు. ఇతర పార్టీలలో లాగా ప్రజలను మభ్య పెట్టబోమని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన పరిమితిలోనే అభ్యర్థులు ఖర్చు చేస్తూ ప్రజల్లోకి వెళ్తారన్నారు. సాంప్రదాయ రాజకీయాలకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పార్టీలకు అవకాశం ఇవ్వాలని ప్రజలను అభ్యర్థిస్తామని తెలిపారు.

## వన్ టైమ్ సర్వీస్‌ను సద్వినియోగించుకోండి



- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

వన్ టైమ్ సర్వీస్ (ఓటీఎస్) ద్వారా కూకట్ పల్లి ఐడీపీఎల్ కంపెనీ బకాయి ఉన్న రూ.16 కోట్ల చెక్కు రూపేణ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు కంపెనీ ప్రతినిధులు బుధవారం అందజేశారు. ఓటీఎస్ ద్వారా ఐడీపీఎల్ సంస్థ బకాయిలు చెల్లించినందుకు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. మిగతా ప్రభుత్వ కంపెనీలు, కార్యాలయాలు, ఆస్తిపన్ను బకాయి దారులు వన్ టైమ్ సర్వీస్ ద్వారా బకాయిలు మార్చి 31 వరకు చెల్లించి వడ్డీపై 90 శాతం రాయితీ పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ బకాయిలను వెంటనే చెల్లించాలని 2023-24 సంవత్సరంలో ఇంటి పన్ను బకాయిలను కూడా చెల్లించవచ్చునని కమిషనర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐడీపీఎల్ కంపెనీ ప్రతినిధులు, అడిషనల్ కమిషనర్లు జయరాజ్ కెన్నెడీ, గీతరాధిక, వాల్యుయేషన్ ఆఫీసర్ మహేష్ కులకర్ణి పాల్గొన్నారు.

## జై స్వరాజ్ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థిగా థామస్

- ఏఐఎంఈపీ వ్యవస్థాపక అధ్యక్షురాలు నౌహిరా షేక్
- ఏఐఎంఈపీ తొలి జాబితా విడుదల



**నవతెలంగాణ-ఓయూ**

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలోని సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ జై స్వరాజ్ పార్టీ అభ్యర్థిగా ఆర్ ఎస్ జె థామస్‌ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కాసాని శ్రీనివాసరావుగౌడ్ ఖరారు చేశారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన థామస్ సీనియర్ జర్నలిస్ట్, అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సమాజం పట్ల ఆయనకు ఉన్న సేవా దృక్పథాన్ని పరిగణనలోకి తీసుకుని థామస్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్టు కాసాని తెలిపారు. సికింద్రాబాద్ లో ఉన్న జై స్వరాజ్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ సమావేశాల్లో థామస్‌ను కండువా కప్పి పార్టీలోకి కాసాని ఆహ్వానించారు. అనాధలు, అభాగ్యులు, పేదలకు తన ఎన్జీఓ సంస్థ ద్వారా సేవలు అందించే థామస్ జై స్వరాజ్ పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులయ్యారు. సామాన్య ప్రజల సమస్యలను మరింతగా పరిష్కరించాలంటే రాజకీయాల ద్వారానే సాధ్యమని ఆలోచించి జై స్వరాజ్ పార్టీలో చేరానని ఆర్ ఎస్ జె థామస్ అన్నారు. తన పట్ల నమ్మకంతో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి ఖరారు చేసిన జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావుగౌడ్ కు థామస్ ధన్యవాదాలు తెలిపారు.దేశంలో పేదవాడు లేకుండా అందరికీ ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎదిగేందుకు తమ పార్టీ పనిచేస్తుందని జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కాసాని శ్రీనివాసరావు గౌడ్ అన్నారు. మెట్టుగూడలోని ప్రధాన పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ. దేశవ్యాప్తంగా రాష్ట్రాల్లో పార్టీ తరపున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తామని తాము పేదవాడికి సౌకర్యాలు కల్పించేందుకు వైద్య విద్య గృహవసతుల్లాంటి కనీస సౌకర్యాలు కల్పిస్తూ దేశంలో పేదరిక నిర్మూలించేందుకు పనిచేస్తామని తమ ఏజెండాతో తమ అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని అసెంబ్లీ స్థానాలకు పార్లమెంట్ స్థానాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాలకు పోటీ చేయనున్నట్లు జై స్వరాజ్ పార్టీ నుంచి ఎనిమిది మంది అభ్యర్థులను ఆయన ప్రకటించారు. ఈ అభ్యర్థులంతా తమ మేనిఫెస్టో ప్రకారం ప్రజలకు సేవ చేస్తారని ఆయన వెల్లడించారు. తాము రాజకీయంగా పార్టీ పరంగా వెనకబడి ఉన్నప్పటికీ సిద్ధాంతపరంగా లక్ష్యాన్ని చేరుకుంటామని గతంలో పనిచేసిన పార్టీలన్నీ ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయయని అలా కాకుండా తాము రాజకీయాల్లో స్థిరంగా ముందుకెళ్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి పరుష రాములు గౌడ్ , ఆర్ ఎస్ జె. థామస్ మార్ల ఆంజనేయులు, మాట్లాడారు.

## 5 కేజీల గంజాయి పట్టివేత

**నవతెలంగాణ-జూబ్లీహిల్స్**




బోరబండ బస్టాప్ వద్ద 5 కేజీల గంజాయిని అమీర్‌పేట ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అమీర్‌పేట ఎక్సైజ్ అధికారుల పరిధిలోని బోరబండ బస్టాప్ వద్ద, అమీర్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పటేల్ బానోత్, సిబ్బంది బుధవారం సాయంత్రం రూట్ వాచ్ చేయుచుండగా, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రహ్లాద్ గుప్త నుంచి 5 కేజీల ఎండిన గంజాయి ప్యాకెట్లను, మోటర్ సైకిల్‌ను స్వాధీన పరచుకొని, సదరు వ్యక్తిని రిమాండ్ కు తరలించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పటేల్ బానోతు మాట్లాడుతూ ఏ వ్యక్తి అయినా అక్రమంగా నార్కోటిక్, గాంజా తరలించి వ్యాపారం చేయాలనుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విధమైన వ్యాపారాలు చేయటం చట్ట ప్రకారం నేరమని కఠిన శిక్షలు పడతాయన్నారు. ఈ దాడులలో సబ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ మాధవరెడ్డి, గోపాల్, కానిస్టేబుల్ చారి పాల్గొన్నారు.

## టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి



- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య

**నవతెలంగాణ-ఓయూ**

టెట్ అర్హత ఫీజు తగ్గించాలని కోరుతూ టెట్ సూపరింటెండెంట్ నాగరాజుకు బుధవారం బీఆర్ఎస్‌వీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ గతంలో టెట్ ఒక పేపర్‌కు రూ.200 ఫీజు ఉండగా దాన్ని రూ.1000కి పెంచారని, రెండు పేపర్లు రాసే అభ్యర్థులకు గతంలో రూ.300గా ఉన్న ఫీజును ఏకంగా రూ.2,000 వరకు పెంచారని తెలిపారు. ఫీజులను ఈ స్థాయిలో పెంచడం నిరుద్యోగులకు అన్యాయం చేసినట్టేనన్నారు. ఇప్పటికే కోచింగ్, శిక్షణ,హాస్టల్ ఫీజులకే వేలకు వేల రూపాయలు ఖర్చుపెడుతున్న అభ్యర్థులకు ఇది భారం కానుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఇంత ఫీజు చెల్లించాలనడం మూర్ఖత్వమేనని అన్నారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయబోమని చెప్పి ఇప్పుడు మాట మార్చడం సరికాదన్నారు. వెంటనే టెట్ ఫీజు తగ్గించాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు నాగేందర్, అవినాష్, శ్రీకాంత్, రాకేష్, క్రాంతి, జాన్, వంశీ, పాల్గొన్నారు.



## మంత్రిని కలిసిన బీసీ విద్యార్థి సంఘం నాయకులు

**నవతెలంగాణ-ఓయూ**

టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలని కోరుతూ బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహను బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ తక్షణమే స్పందించి పాఠశాల కమిషనర్ అండ్ డైరెక్టర్ దేవసేన కు ఫోన్ చేసి మాట్లాడారని.. తక్షణమే టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలని అధికారులకు ఆదేశించడం జరిగిందన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ అభ్యర్థులకు అన్యాయం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సురేష్ , రాజేందర్ , పాండారి , బద్రి , రాజశేఖర్ , మహేష్ , పవన్, కిరణ్, సంతోష్, పాల్గొన్నారు.

## 'స్టార్' లో అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ సూట్



**నవతెలంగాణ-బంజారాహిల్స్**

హైదరాబాద్‌కు చెందిన స్టార్ హాస్పిటల్స్ బుధవారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న తన హాస్పిటల్ కాంప్లెక్స్‌లో అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ సూట్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది ఈ లాంచ్ వేడుకలో హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పల్మోనాలజిస్ట్ డాక్టర్ ఆర్ విజయ్ కుమార్, హైదరాబాద్ స్టార్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మన్నం సూట్ లోగోను ఆవిష్కరించారు.

ఊపిరితిత్తులు వాయుమార్గాల వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో విప్లవాత్మక మార్పులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమీకృతం చేస్తూ, ఊపిరితిత్తుల వైద్యంలో ఈ గ్రౌండ్ బ్రేకింగ్ సదుపాయం ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ, మెడిసిన్ ఒక ప్రత్యేక విభాగం, పలు రకాలైన పల్మనరీ వ్యాధులను రూపుమాపడానికి రూపొందించబడిన మినిమల్ ఇన్వాసివ్ విధానాలను ఉపయోగిస్తుంది, ఈ విధానంలో స్వల్పమైన రోగి ప్రమాదం, ఖచ్చితమైన ప్రయోజనాలను నిర్ధారిస్తుంది.

స్టార్ హాస్పిటల్స్‌లోని సూట్ ప్రాథమిక ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స, మెటాస్టాటిక్ ఊపిరితిత్తుల కణితుల నిర్వహణ, వాయుమార్గ అడ్డంకుల ఉపశమనం, ప్లూరల్ వ్యాధుల చికిత్సతో సహా అనేక రకాల సేవలను అందిస్తుంది. ఖచ్చితమైన, ప్రభావవంతమైన జోక్యాలను నిర్ధారించడానికి అత్యాధునిక పరికరాలను ఉపయోగించి ఎండోబ్రోన్షియల్ అల్ట్రాసౌండ్ (ఈబీయూఎస్), నావిగేషనల్ బ్రోంకోస్కోపీ,మెడికల్ ప్లూరోస్కోపీ వంటి అధునాతన విధానాలు నిర్వహిస్తారు.

ఈ సందర్భంగా స్టార్ హాస్పిటల్స్‌లోని ఇంటర్‌వెన్షనల్ పల్మోనాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ కిషన్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. తమ ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ సూట్ ప్రారంభం పల్మనరీ మెడిసిన్‌లో ఒక నమూనా మార్పును సూచిస్తుందన్నారు. అధునాతన వైద్య సంరక్షణను అందించడానికి రోగుల వైద్య ఫలితాలను మెరుగుపరచడానికి వీలుకల్పిస్తుందని తెలిపారు.

ఆధునిత నైపుణ్యత కలిగిన పరికరాలతో పాటు నిపుణులైన వైద్యులు క్రిటికల్ కేర్‌లో సూట్ ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ,క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ చందన ఇలా అన్నారు. ఈ సదుపాయం సంక్లిష్టమైన పల్మనరీ పరిస్థితులను తక్షణమే ప్రభావవంతంగా పరిష్కరించే తమ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందనీ, సరైన రోగి సంరక్షణకు భరోసా ఇస్తుందనీ ఆమె తెలిపారు. అనంతరం డాక్టర్ అనురాధ, సూట్ మల్టీడిసిప్లినరీ విధానాన్ని హైలైట్ చేస్తూ, "ప్రతి రోగి ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా వ్యక్తిగతీకరించిన సంరక్షణను అందించడానికి తమ బృందం అంకితం చేయబడిందనీ ఉన్నతమైన ఫలితాలను సాధించడానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తుందని ఆమె తెలిపారు.

నవతెలంగాణ
హైదరాబాద్
HMDA
గురువారం | మార్చి 28, 2024 | www.navatelangana.com

## హైదరాబాద్‌కు ఐపీఎల్ ఫీవర్









ఐపీఎల్ 17వ సీజన్‌లో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్‌నేషనల్ క్రికెట్ స్టేడియంలో హైదరాబాద్ - ముంబయి మధ్య మ్యాచ్ జరిగింది. ఇరు జట్లు భారీ స్కోర్లు నమోదు చేయడంతో మ్యాచ్‌కు వచ్చిన ప్రేక్షకులు ఫుల్ ఖుషీ అయ్యారు.

# రూ. 13 లక్షలు హవాలా డబ్బులు స్వాధీనం

- ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో..

**నవతెలంగాణ- జూబ్లీహిల్స్.**

ఎస్ ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా హవాలా డబ్బును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకెళ్తే.. ఎస్ ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటీఎం మిషన్ లో భారీ మొత్తంలో నగదు డిపాజిట్ చేయుటకు ఒక వ్యక్తి మంగళవారం రాత్రి బ్యాగుతో లోపలకు ప్రవేశించగా స్థానికులు గమనించి ఎస్ఆర్ నగర్ పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు బ్యాగుతోపాటు షాదిల్ అనే వ్యక్తిని అదుపులోనికి తీసుకుని ద్విచక్ర వాహనాన్ని, రూ. లక్ష 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు .అతనిని విచారించగా ఎం షాదిల్ బంజారా హిల్స్, జహీరా నగర్‌లో ఉంటూ కార్ల వ్యాపారం చేస్తున్నాడని, మంగళవారం రాత్రి ఏటీఎం మిషన్‌లో డబ్బు డిపాజిట్ చేయుటకు వచ్చినట్టు తెలిసింది. లోతుగా విచారించగా జహీరా నగర్ లో ఉండే మరో ఇద్దరు స్నేహితుల వద్ద డబ్బులు ఉన్నట్టు తెలపగా, వెంటనే అతనిని తీసుకొని అక్కడికి వెళ్లి రూమ్ లో నుంచి రూ. 11,70,000 డబ్బుతో పాటు ఏసీ మెకానిక్ ఇజాజ్ ,ఫజల్ లను అరెస్ట్ చేశారు. మొత్తం డబ్బులకు సంబంధించి సరైన సమాచారం ఇవ్వకపోవడంతో హవాలా డబ్బుగా నిర్ధారించారు. డబ్బులు ఎక్కడి నుండి తెచ్చారు అన్న దానిపై లోతుగా విచారణ జరుపుతున్నారు. కాగా గతంలో కూడా షాదిల్ వద్ద ఒక కోటి రూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు కేరళకు చెందిన వారుగా గుర్తించారు. ఇంకా లోతుగా విచారించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సార్ నగర్ పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ముగ్గురు నిందితులు ఎస్సార్ నగర్ పోలీసుల ఆధీనంలో ఉన్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న కేటీఆర్



**నవతెలంగాణ-కంటోన్మెంట్**

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని గన్ బజార్ రసూల్‌పురా 313 గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలకు ఖర్జురా తినిపించి ఉపవాసం విరమింప జేశారు. కేటీఆర్ ఇఫ్తార్ విందుకు వచ్చిన సంగతి తెలుసు కొని స్థానిక నారాయణ జోపిడి సంఘం బస్తీవాసులు ఆయనను కలసి వారి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలను వివరించారు. త్వరగా డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులతో మాట్లాడి పనులు జరిగేలా చూస్తానని కేటీఆర్ హామీచ్చారు. కేటీఆర్ తో పాటు మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హాజర య్యారు. నాయకులు మన్నే క్రిశాంక్, నివేదిత, గజ్జెల నాగేష్, ఎర్రోళ్ళ శ్రీనివాస్, టిఎన్. శ్రీనివాస్, 313 గ్రూప్ ముస్లీం సోదరులు పాల్గొన్నారు.






# అందరి మద్దతుతోనే సామాజిక సేవా కార్యక్రమాలు

- ఉద్యోగులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి
- ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు బాగుండాలని ప్రత్యేక ప్రార్థనలు
- టీఎన్జీవోస్ దావత్-ఏ-ఇఫ్తార్‌లో అధ్యక్షుడు డాక్టర్ ముజీబ్
- ఇఫ్తార్‌కు హాజరైనా టీజీవో, టీఎన్జీవోస్ ముఖ్యనాయకులు, కార్యవర్గ సభ్యులు




**నవతెలంగాణ-సిటీబ్యూరో**

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్) ఆధ్వర్యంలో బుధవారం నాంపల్లిలోని గృహకల్ప కార్యాలయం ప్రాంగణంలో దావత్-ఎ-ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యులు, యూనిట్ అధ్యక్షులు, సెక్రటరీలు, ప్రాథమిక సభ్యులు, మహిళా ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు పెద్దసంఖ్యలో పాల్గొని గ్రాండ్ సక్సెస్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు ఆరోగ్యం, సుఖసం పాదలతో బాగుండాలని మౌలానా మొహమ్మద్ రియాజుద్దీన్ రక్షబంది, మౌలానా మహమ్మద్ ఖలీముద్దీన్‌తో నమాజ్-ఎ-మగ్రిబ్ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం డాక్టర్ ముజీబ్ మీడియాతో మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో పేద రోగుల అటెండర్లకు ఆహార వితరణతో పాటు దేవాలయాల్లో అన్నదానం ఏర్పాటు, అనాథ ఆశ్రమంలో అవసరమైన సరుకులు అందించడం, రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం తన తల్లిదం డ్రుల ఆశీర్వాదం, కుటుంబ సభ్యులు, యూనియన్ మద్దతుతో చేయగలుగుతున్నానని చెప్పారు. ఇఫ్తార్ దావత్‌లో పాల్గొన్న ఉద్యోగులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ బొల్లు కిషన్, టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్, సెక్రటరీ సత్యనారాయణ, టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ప్రెసిడెంట్ మారం జగదీశ్వర్, అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకట్, కొండల్ రెడ్డి, శైలజ పాల్గొన్నారు.




## దారుషిఫా అంధుల పాఠశాలకు కంప్యూటర్లు వితరణ

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

ప్రభుత్వ అంధుల దారుషిఫా ఉన్నత పాఠశాల విద్యార్థులకు వోయిత్ టర్బో ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ పది కంప్యూటర్లు, ఒక స్కానర్, ప్రింటర్ వితరణ చేసింది. ఈ మేరకు బుధవారం ఆ సంస్థ ఏజీఎం వెంకటరమణ, కంపెనీ సెక్రటరీ ఇంద్రజ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇంద్రజ మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇందుకు తమ పాఠశాల తరపున వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం ఖుదిషియా, ప్రైమరీ హెచ్‌ఎం మందడి వెంకట్ రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు రామారావు, శ్రీనివాస్ రెడ్డి, సద్గుణ, సునంద, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.










# నగరంలో ఐపీఎల్ సందడి






## లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలు..

**అబిడ్స్ ఇన్ స్పెక్టర్ జి.రాజగోపాల్ రెడ్డి**



**నవతెలంగాణ-సుల్తాన్‌బజార్**

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలోకి కోడ్ అమల్లోకి వచ్చిందని అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ జి.రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం అబిడ్స్ పోలీస్ స్టేషన్ లోని ఆయన ఛాంబర్‌లో మాట్లాడుతూ అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలను చేపడుతున్నామన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేలకు మించిన నగదు తీసుకెళ్లే ప్రజలు సంబంధిత పత్రాలను చూపాలన్నారు. అత్యవసర వైద్యం, వ్యాపారం, శుభకార్యాలు, ఇతర అవసరాల నిమిత్తం పరిమితికి మించి నగదు తీసుకెళుతున్నవారు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రి పనులు అయితే సంబంధిత వివరాలు వైద్య ఖర్చుల బిల్లులు ఉండాలన్నారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## మెట్రో రైళ్ల సంఖ్య సమయం పొడిగింపు



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

నగరంలో ఐపీఎల్ సందడి షురువైంది. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు ఉప్పల్ వేదికగా మొత్తం ఏడు మ్యాచుల్లో ఆడనున్నది. ఈక్రమంలో క్రికెట్ అభిమానులకు మెట్రో గుడ్ న్యూస్ చెప్పింది. హైదరా బాద్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగే రోజుల్లో మెట్రో రైళ్ల సమయం పొడిగించారు. బుధవారం ఉప్పల్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య సాయంత్రం 7.30గంటల నుంచి మ్యాచ్ జరిగింది. ఈ క్రమంలో ఉప్పల్ మార్గంలో మెట్రో రైలు సమయం పొడిగించామని, రైళ్లు నిర్దీత సమయానికి మించి నడుస్తాయని మెట్రో ఎండీ ఎన్వీఎస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాగోల్, ఉప్పల్ స్టేడియం, ఎన్‌జీఆర్ఐ స్టేషన్లలో చివరి రైళ్లు రాత్రి 12:15 గంటలకు బయలుదేరి 1:10 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటాయని ఆయన చెప్పారు.




## వరుస చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడు అరెస్టు



**నవతెలంగాణ-ముషీరాబాద్**

వరుస నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలియ జేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాకు చెందిన చాగంటి పవన్ తిరుమలేష్ అనే వ్యక్తి వరుస చోరీలకు పాల్పడుతున్నాడు. విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలని మద్యం గంజాయి వంటి అనేక రకాల చెడు అలవాట్లకు బానిసై ఖరీదైన ద్విచక్ర వాహనాలను దొంగలి స్తుంటాడు. వాహనాలు దొంగలించడమే కాకుండా దృష్టి మళ్లించి నేరాలకు పాల్పడుతూ అలవాటుగా మార్చుకున్నాడు. నిందితుడుపై గతంలో గుంటూరు, విశాఖపట్నం, వరంగల్, నల్గొండ, విజయవాడ, ప్రకాశం, హైదరాబాద్ మొదలగు నగరాలలో పలు పోలీస్ స్టేషన్ లలో 39 కేసులు నమోదయ్యాయని తెలిపారు. నిందితుడు చాగంటి పవన్ తిరుమలేష్ చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానస్పదంగా సంచరించడం గమనించిన పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా విచారణలో చిక్కడపల్లి పరిధిలో చోరీకి గురైన రెండు ద్విచక్ర వాహనాలను తానే దొంగలించానని ఒప్పుకున్నాడు. నిందితుడిని చాకచక్యంగా చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ క్రైమ్ స్టాఫ్‌ను వరుస నేరాలకు పాల్పడుతున్న నిందితుని పట్టుకున్నందుకుగాను అభినందించారు.

## 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హిందువులపై దాడులు పెరిగిపోయాయి'




- తెలంగాణ విశ్వహిందూ పరిషత్

**నవతెలంగాణ-హిమాయత్ నగర్**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందువులపై దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని తెలంగాణ విశ్వహిందూ పరిషత్ ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 'బజరంగ్ దళ్ హిందూ శక్తి ప్రదర్శన యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్, ఉపాధ్యక్షులు జగదీశ్వర్, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివ రాములు, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి వీరేశలింగం తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టన్నారు. హిందూ సంఘటన కోసం ప్రతి ఒక్కరూ చైతన్య వంతులు కావాలని సూచించారు. బజరంగ్ దళ్ హిందూ శక్తి ప్రదర్శన యాత్రకు సన్నద్ధమవుతోందని, ముస్లిం సంతుష్టీకరణ చేపడుతున్న పాలకులకు బుద్ధి చెప్పేందుకు సమాజాన్ని జాగృతం చేస్తోందన్నారు. బజరంగ్ దళ్ చెంగిచెర్ల ఘటనపై బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 23న వీర హనుమాన్ విజయ యాత్ర (హిందూ శక్తి ప్రదర్శన యాత్ర) చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.హిందూ అమ్మాయిల రక్షణకు లవ్ జిహాద్ పై ప్రత్యేక దృష్టి, మతమార్పిడి మాఫియాపై పోరాటం తదితర విషయాలపై రాజీలేని పోరుకు బజరంగ్ దళ్ సిద్ధమైందన్నారు.

## ఇఎస్‌సీఐ వార్షిక శిక్షణా కార్యక్రమాల క్యాలెండర్ ఆవిష్కరణ



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ అఫ్ ఇండియా 2024-25 సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 2024 నుండి మార్చ్ 2025 వరకు నిర్వహించబోయే శిక్షణా కార్యక్రమాల వార్షిక క్యాలెండర్‌ను ప్రారంభించారు. గురువారం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ అఫ్ ఇండియా బోర్డ్ ఆఫ్ మేనేజ్ మెంట్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఎం. చౌడేగౌడ ఆవిష్కరించారు. కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వర రావు, కాలేజ్ చీఫ్ లక్ష్మి కాంత రావుతో పాటుగా వివిధ విభాగాలకు చెందిన కాలేజ్ హెడ్స్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో చోడేగౌడ మాట్లాడుతూ భారతదేశంలోనే కాదు, మొత్తం దక్షిణ ఆసియాలోనే ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ అఫ్ ఇండియా కేవలం ఒక్క హైదరాబాద్ నగరంలోనే ఉందని అభిప్రాయ పడ్డారు. ఇన్స్టిట్యూషన్ అఫ్ ఇంజనీర్స్ ఇండియా సహకారంతో ఈ కాలేజ్ సుమారు మూడున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటయిందన్నారు. ఇందులో సెంటర్ ఫర్ క్లైమేట్ ఛేంజ్, సివిల్ ట్రాన్స్ పోర్టేషన్, పవర్ అండ్ ఎనర్జీ, మేనేజ్ మెంట్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మైనింగ్ తదితర 12 శాఖలున్నాయని తెలిపారు.అన్ని శాఖల్లోనూ వచ్చే ఏడాది కాలంలో 318 శిక్షణా కార్యక్రమాలను రూపొందించడం జరిగిందన్నారు. వీటితో పాటుగా 3డీ ప్రింటింగ్, రివర్స్ ఇంజనీరింగ్, స్కిల్ డెవలప్ మెంట్, అర్బన్ ఫ్లడ్స్, రిమోట్ సెన్సింగ్, అర్బన్ హీట్ ఐలాండ్స్, రోడ్ సేఫ్టీ మేనేజ్ మెంట్, బయోలాజికల్ వేస్ట్ వాటర్ ట్రీట్ మెంట్, డేటా ఇంజనీరింగ్, సేఫ్టీ ఆడిట్, ఎనర్జీ అడిట్, ఐటీ సొల్యూషన్స్ ఇన్ డిస్కమ్స్ తదితర శిక్షణలున్నాయని తెలిపారు. 2023- 24 సంవ త్సరంలో మార్చ్ నాటికీ ఇఎస్‌సీఐ సుమారు ఏడువేల మందికి శిక్షణ తరగతు లు నిర్వహించినట్టు తెలిపారు. ఇఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విధానాల ఆవిష్కరణ మరియు పురోగతిలో సాధికా రత కల్పించడం, ప్రపంచంలోని సవాళ్లను పరిష్కరించడానికి అభ్యర్థులను సన్నద్ధం చేయడం మా లక్ష్యమన్నారు. అభివద్ధి చెందుతున్న అధునాతన ఇంజనీ రింగ్, సాంకేతిక రంగాల్లో శిక్షణ కోసం వచ్చిన అభ్యర్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడంలో ఇఎస్‌సీఐ కీలకమైన పాత్ర పోషిస్తున్నదని అన్నారు. కీలకమైన మేనేజ్ మెంట్ రంగంలో ప్రతిభావంతమైన కార్యక్రమాల నిర్వహణలో చొరవ తీసుకుని నాయకత్వం వహించడంలో ఇఎస్‌సీఐ కీలకమైన లింక్‌గా వ్యవహరిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు.

# ప్రజా ఉద్యమాలకు ఊపిరిగా నాటకాలు

- స్త్రీని పురుషాధిక్య సమాజం ఎలా అణచివేస్తుందో కొత్త మలుపు నాటిక కనులకు కట్టినట్టు చూపించింది
- ప్రముఖ సినీనటులు కోట శ్రీనివాసరావు
- ఆకట్టుకున్న కొత్త మలుపు నాటిక ప్రదర్శన..



**నవతెలంగాణ-ముషీరాబాద్**

స్త్రీని పురుషాధిక్య సమాజం ఎలా అణచి వేస్తుందో కొత్త మలుపు నాటిక కనులకు కట్టినట్టు చూపించిందని ప్రముఖ సినీనటులు కోట శ్రీనివాసరావు తెలిపారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకోని బుధవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజా సాంస్కృతిక కేంద్రం, ఎస్వీకే సంయుక్త ఆధ్వర్యంలో మహతి క్రియేషన్స్ వారి కొత్త మలుపు సాంఘిక నాటిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. స్త్రీని పురుషాధిక్య సమాజం ఎలా అణచివేస్తుందో కన్నులకు కట్టినట్లుగా నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ప్రముఖ సినీనటులు కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ కందుకూరి విరేశలింగం పంతులు సాధించిన వితంతు పుననిర్మాణ పోరాటానికి ఈ నాటిక మంచి స్ఫూర్తిని ఇస్తుందన్నారు. నేటి ఆధునిక సమాజంలో అత్యాధునిక హంగులతో సినిమాలు ప్రదర్శన అవుతున్న నాటక రంగం ఏమాత్రం ఆదరణ కోల్పోలేదన్నారు. అందుకు నిదర్శనమే మంచి నాటకాలు ధ్రువ తరాలుగా నిలిచాయని కన్యాశులకం, ముందడుగు, మాభూమి, వంటి ఎన్నో నాటకాలు ప్రజల్లో చెరగని ముద్ర వేసు కున్నాయని కొనియాడారు. నాటకం పోనీ అని అన్యాయాలను సహించలేదని ప్రజా సమస్యలకు దర్పణంగా నాటకాలు నడిచాయన్నారు. నాటకాలు ప్రజా ఉద్యమాలకు ఊపిరిగా నాటకాలు నిలిచాయన్నారు. ఈ కొత మలుపు నాటకం అనాధిగా స్త్రీలు ఎలా అణచి వేయబడుతున్నారో కన్నులకు కట్టినట్లుగా ప్రదర్శించడం అభినందనీయమ న్నారు. సుబ్బరాయ శర్మ దర్శకత్వం వహించిన ఈ కొత్త మలుపు నాటిక ప్రదర్శనలో పలువురు సినీనటులు తమ పాత్రలను పోషించి సబికులను రంజింపజేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎండ మూరి వీరేంద్రనాథ్, ఎస్వీకే కన్వీనర్ ఎస్. వినయ్కుమార్, తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు, ఎస్పి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పూర్ణాహుతి, హెూమంలో పాల్గొని ప్రత్యేక పూజలు

- టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

**నవతెలంగాణ-నాగోల్**

బుధవారం నాగోల్‌లోని ఎస్‌పిఆర్ కన్వెన్షన్‌లో మూడు రోజులు గా 98వ శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభల సందర్భంగా జరుగుతున్న పూర్ణాహుతి, హెూమం జరుగుచున్న శుభ సందర్భంగా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త శ్రీ వ్యాసా శ్రమ గురుపరంపర స్వాముల స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వ్యాసా శ్రమ గురుపరంపర స్వాములకు ఆలయ ధర్మకర్తలు, పూజారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. హెూమంలో పాల్గొని పూర్ణాహుతి నిర్వహిం చారు. అనంతరం నిర్వాహకులను, పూజారులను సత్కరించారు. సత్కరించి స్వామి వారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంటర్నే షనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ స్టేట్ విభాగం నాయకులు, కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 2009 విద్య హక్కు చట్టని తక్షణమే అమలు చేయాలి



- విద్య హక్కు చట్టం సాధన సమావేశంలో వక్తలు

**నవతెలంగాణ-ముషీరాబాద్**

2009 విద్య హక్కు చట్టని తక్షణమే అమలు చేసి ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి వాటి బలోపేతానికి కృషి చేయాలని పలువురు వక్తలు తెలిపారు. విద్య హక్కు చట్టం సాధనకై సలహాలు సూచనల కొరకు బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు మీసాల రామన్న మాదిగ, మహా ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ముత్యపాగ నర్సింగరావు మాదిగ, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డ యాదయ్య మాదిగ, బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు పాషాపాక నరసింహ, హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 2009 విద్య హక్కు చట్టన్ని అమలు చేయాలని 2010లో రూపొందిస్తే ఇప్పటివరకు అమలు కాలేదని, 2020లో విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలని ఉన్నప్పటికీ కూడా నేటికే ఆ విద్యకు చట్టం అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2009-2020 విద్య హక్కు చట్టాలను రెండిటిని పరిశీలించి తక్షణమే అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్య హక్కు చట్టం పూర్తిగా అమలైన పక్షంలో తెలంగాణలో మెజారిటీ ప్రజలైనటు వంటి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ పేద ప్రజల పిల్లలందరికీ ఉచితంగా నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో విసికె పార్టీ అధ్యక్షులు జిలకర శ్రీనివాస్, తెలంగాణ క్రైమ్ కంట్రోల్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ హర్షద్, దళిత్ ముస్లిం ఏక్తా ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు సంగీత జిన్న, బహుజన కవి గాయకుడు మచ్చ దేవేందర్, తెలంగాణ దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రమదేవి, తెలంగాణ దండోరా స్టూడెంట్ ఆర్గనైజేషన్ స్టేట్ కోఆర్డినేటర్ మీసాల ఎల్లేష్, కొమరయ్య యాదగిరి ప్రభాకర్ అశోక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## 'వేసవి తరగతులు నిర్వహిస్తున్న కార్పోరేట్ జూనియర్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి'

- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి శృతి ఓజాకు వినతి పత్రం అందజేత



**నవతెలంగాణ-హిమాయత్ నగర్**

రాష్ట్రంలో ప్రైవేట్, కార్పోరేట్ జూనియర్ కళాశాలలు ఇంటర్ బోర్డు నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ముందస్తు అడ్మిషన్లు, వేసవి తరగతులు నిర్వహిస్తున్నారని ఇంటర్ బోర్డు అధికారులు వెంటనే ప్రయివేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలల ఆగడాలు అరికట్టాలని, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలల ముందు ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటు వంటి ప్రయివేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల ఆగడాలను అరికట్టాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటు వంటి ప్రయివేట్, కార్పోరేట్ జూనియర్ కళాశాలలు ఎలాంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వివిధ కోర్సుల పేరుపై, పండుగల పేరుపై వివిధ ఆకర్షణీయమైన పేర్లు పెట్టి విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తూ ఫీజుల రాయితీ ఇస్తామంటూ ఇష్టాను సారంగా అడ్మిషన్లు చేపడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలో యథేచ్ఛగా కార్పోరేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యా శాఖ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా అనుమ తులు లేని కళాశాలల లిస్ట్ విడుదల చేసి, నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సమానత్వం కోసం మహిళలు ఉద్యమించాలి

- వివక్ష అణచివేత అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడాలి
- డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇ.సుధారాణి



**నవతెలంగాణ-ముషీరాబాద్**

మహిళలు వివక్ష, అణచివేత, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతు సమానత్వం కోసం ఉద్యమించాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొపెసర్ ఇ.సుధారాణి పిలుపునిచ్చారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవం వేడుకలలో బాగంగా బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగం, హక్కులు, చట్టాలు, సంక్షేమ పథకాలపై డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అధ్యక్షత న రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో 50 మంది సామాజిక కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్‌లను అయాలను ఆశావర్కర్లు, వందరోజులు పని దినాలు సాధించుకున్న మహిళ ఉపాధి హమి కూలీల ను సన్మానించారు.ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ. మహిళలకు పౌష్టికాహారం అందక తల్లులు పిల్లలు మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేటికి దేశంలో మహిళలు 31 శాతం మాత్రమే రాజకీయాలలో వున్నారన్నారు. మహిళా కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అంద లేదన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడు నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. వివక్ష అణచివేత అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడాలి సమానత్వం కోసం మహిళలు ఉద్యమించాలన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో ముఖ్యంగా భారతీయ రాజ్యాంగంపై అనేక దాడులు జరుగుతున్నాయని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు ఎన్నో జరుగుతున్నాయన్నారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సి, రజిత, వెంకట్ రెడ్డి, మిరా సంఘమిత్ర, ఎస్ అర్ ఐ మంతెన రాయదాస్ దిప్తి, డాక్టర్ జిలకర శ్రీనివాస్, పి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## 'ఫోటో జర్నలిస్టులపై దాడులు పత్రికా స్వేచ్ఛపై దాడులే'




**నవతెలంగాణ-హిమాయత్ నగర్**

విధి నిర్వహణలో ఉన్న ఫోటో జర్నలిస్టులపై దాడులు పత్రికా స్వేచ్ఛపై దాడులేనని తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.హరిలు తెలిపారు.రాజకీయ నిరసనలను కవర్ చేయడం రిపోర్టర్లు, ఫోటో జర్నలిస్టుల పని అని, తమ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా ఢిల్లీ వీధుల్లో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు చేస్తున్న ప్రజా నిరసనలను ఫోటో జర్నలిస్టులు కవర్ చేస్తుండగా ఢిల్లీ పోలీసులు అకారణంగా వారి పై అత్యంత భయానకరీతిలో క్రూరమైన దాడు లు చేసి తీవ్రంగా గాయపరచడం అమానుష మని దీన్ని తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఫోటో జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసుల క్రూరమైన దాడులను ఖండిస్తూ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీ పోలీసుల క్రూరత్వం నశించాలి, జర్నలిస్టులపై దాడులు నివారించాలి, మీడియాపై దాడులు ప్రజాస్వామ్యంపై దాడులేనని, గాయపడ్డ ఫోటో జర్నలిస్టులకు న్యాయం చేయాలని, ఢిల్లీ పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు, ఫోటో జర్నలిస్టులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా అనుమళ్ల గంగాధర్ మాట్లాడుతూ ఢిల్లీ సీనియర్ పోలీసు అధికారులు కొంత మంది ఫోటో జర్నలిస్టులను వారి గొంతుతో పట్టుకుని, ఇతరులను భయంకరమైన పరిణామాలతో బెదిరించడం ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అనుబంధ వర్కింగ్ న్యూస్ కెమెరామెన్స్ అసోసియేషన్ విడుదల చేసిన ఫోటోగ్రాఫ్‌లలో పోలీసుల క్రూరత్వం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.

నిరసనలు తెలిపే చోట చట్ట విరుద్ధమైన, రాజకీయ ప్రేరేపిత పరిమితులను పోలీసులు విధించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అనంతరం కె.ఎస్.హరి మాట్లాడుతూ జర్నలిస్టుగా పని చేయడం నేడు దేశంలో ప్రమాదకరంగా మారిందని, పబ్లిక్ డొమైన్‌లో సమాచారాన్ని తీసుకురావడానికి జర్నలిస్టులు తమ జీవితాలను పణంగా పెడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ పోలీ సుల దాడిలో ఇండియా టుడే ఫోటో జర్నలిస్టు అరుణ్ ఠాకూర్ మెడపై, గొంతులో గాయాల య్యాయని, హిందుస్థాన్ ఫోటో జర్నలిస్టు సల్మాన్ అలీకి మోచేయి విరిగిందని, ఫోటో జర్నలిస్టులపై ఏ రూపంలోనైనా దాడి చేయడం పూర్తిగా ఆమోద యోగ్యం కాదని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత ఫోటో జర్నలిస్టులకు న్యాయం చేయాలని, దాడులకు పాల్పడ్డ పోలీసు ఉన్నతాధికారులపై ఉన్నత స్థాయి విచారణ జరిపించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో సంఘం కోశాధికారి కె.అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులు నక్క శ్రీనివాస్, ఎండి.అలీముద్దీన్, నేతలు జి.బాలస్వామి, సయ్యద్ మజార్, ఈ.జనార్ధన్ రెడ్డి, రామకృష్ణ, పిప్పళ్ల వెంకటేష్, సురేష్ రెడ్డి, ఈ.నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక తనిఖీల్లో రూ. 2,57,05,390 నగదు పట్టివేత

- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

హైదరాబాద్ జిల్లాలో ఎన్నికల ఎన్ ఫోర్స్మెంట్ బందాల ద్వారా ఇప్పటివరకు రూ.2,57,05,390 నగదు, రూ. 37,05,841 విలువైన ఇతర వస్తువులతోపాటు 1386.28 లీటర్ల అక్రమ మద్యాన్ని సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటల నుండి బుధవారం ఉదయం ఆరు గంటల వరకు నిర్వహించిన తనిఖీలలో రూ.16,19,000 నగదుతో పాటు రూ.1,81,689 విలువ గల ఇతర వస్తువులు, 49.37 లీటర్ల అక్రమ మద్యాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అందులో ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు రూ.69,000, పోలీస్ అధికారులు రూ.15లక్షల 50వేల రూపాయిల నగదును, రూ.1,81,689 విలువైన ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. 13మందిపై ప్రోహిబిషన్ కేసులు నమోదు చేసి,13 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు నగదు, ఇతర వస్తువుల పై 156 ఫిర్యాదులు అందగా పరిశీలించి పరిష్కరించారని, 124 ఎఫ్.ఐ.ఆర్ లు నమోదు చేసినట్లు రోనాల్డ్ రోస్ పేర్కొన్నారు.

## ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్



**నవతెలంగాణ-ముషీరాబాద్**

ప్రజలు స్వచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్ తెలిపారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణకై సమస్యాత్మక ప్రాంతాలలో ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలు, ఫ్లాగ్ మార్చ్ కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్, చిక్కడపల్లి ఏసీపీ రమేష్ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా, ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా వారిలో నమ్మకం, భరోసా, భద్రత కలిగేలా ఐటీబీపీ కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ కవాతు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా సమస్యాత్మక ఏరియాలలో, ప్రత్యేక దృష్టి సారించి ప్రతి బస్తీలో పకడ్బందీగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. బందోబస్తు మాత్రమే కాకుండా డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు అక్రమ రవాణా అరికట్టేం దుకు చెక్ పోస్టుల్లో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలు

**నవతెలంగాణ-బడంగ్ పేట్**

హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, సద్గురు మలయాళ స్వామి భక్త బృందం సంయుక్తంగా బాలాపూర్ ఎస్‌పిఆర్ కాన్వేషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న 98వ శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలు బుధవారం వైభవంగా ముగిశాయి. పరమ పూజ్యశ్రీ పరిపూర్ణానందగిరి స్వాముల వారిచే భగవద్గీత అధ్యాయాల సామూహిక పారాయణ చేశారు.అనంతరం దేవీ ఉపాసకులు బ్రహ్మశ్రీ మురుకుంట్ల రాజేశ్వర శర్మ నేతృత్వంలో భక్తులచే సామూహిక చండీ హెూమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థాన పీఠాధిపతులు విద్యానృసింహ భారతీ స్వామి ఉపన్యాసం చేశారు. పరిపూర్ణానందగిరి స్వాములవారు శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన పీఠాధిపతులు, మఠాధిపతులు, మాతాజీలు సనాతన ధర్మము గురించి ఉపన్యాసాలు చేశారు. చివరగా పరిపూర్ణానదగిరి స్వాముల వారు ప్రసంగిస్తూ మూడు రోజుల పాటు నిర్వహించిన 98వ శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలకలు విజయవంతం కావడానికి కృషి చేసిన వారందరికీ కృత్ఞతలు తెలిపారు.

## ఇట్ల చేద్దాం

పసుపు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే డబ్బాలో కొద్దిగా ఎండు మిర్చి, రాళ్ల ఉప్పు వేసి ఉంచాలి.



# కాకరకాయతో లాభాలెన్నో...



రుచిలో చేదైనా.. శరీరానికి పోషకాలు అందించటంలో కాకరకాయ ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఖనిజ లవణాలూ, విటమిన్లూ, పీచూ వంటివి పుష్కలంగా ఉన్నాయి. ఆరోగ్యాన్ని సంరక్షించటంలో వీటి పాత్ర ఎంతో కీలకం.

కాకరకాయను మన ఆహారంలో భాగం చేసుకోవటం వల్ల అనేక ఆరోగ్యకరమైన లాభాలున్నాయి. ఆస్తమాకు ఆయుర్వేద ఔషధంగా ఇది పనిచేస్తుంది. శరీరానికి ఇమ్యూనిటీని అందిస్తుంది. కాకరను తరచూ తినటం వల్ల చర్మ, రక్త సమస్యలు దూరమవుతాయి. ఆస్తమా, బ్రాంకైటిస్, దగ్గు, శ్వాస సంబంధిత సమస్యలు తగ్గుతాయి. ఏ కాలంలోనైనా వీటిని తీసుకోవచ్చు. రోగ నిరోధక వ్యవస్థను పెంపొందించటానికి, బరువు తగ్గటానికి దోహదపడతాయి. యాంటీ ఆక్సిడెంట్లు రోగాలను దూరం చేస్తాయి. రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారి ఇన్ఫెక్షన్లు దూరం అవుతాయి. ఈ కాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరం నుంచి ట్యాక్సిన్లు బయటకు పోయేలా చూస్తాయి. వీటిలో కేలరీలు, కొవ్వు, కార్బొహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. వీటిలో ఎక్కువ మోతాదులో ఉండే పొటాషియం శరీరంలోని అధిక సోడియాన్ని గ్రహించి రక్తపోటును అదుపులో ఉంచుతుంది. వీటిల్లోని ఐరన్, ఫోలిక్ యాసిడ్ హృద్రోగాల నుంచి దూరం చేస్తాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. మూత్రాశయ పరితీరును మెరుగుపరుస్తాయి. తిన్నవెంటనే కడుపు నిండిన భావన కలుగుతుంది. త్వరగా ఆకలివేయదు. బరువు తగ్గాలనుకునేవారు దీన్ని తమ ఆహార ప్రణాళికలో చేర్చుకోవచ్చు. రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ల ముప్పును తగ్గిస్తుంది. ఈ కూరగాయలో ఉండే బీటా కెరోటిన్, విటమిన్ ఎ కంటి చూపును మెరుగుపరుస్తాయి. అందువల్ల ప్రతిఒక్కరూ కాయరకాయలను తినటం ఎంతో మంచిది.

# క్యారెట్‌తో వెరైటీగా..



క్యారెట్ గురించి ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. కచ్చితంగా తినాల్సిన ఆహారంలో ఇది ఒకటి. క్యారెట్‌లో ఎన్నో రకాల పోషకాలున్నాయి. ప్రతి రోజూ క్యారెట్ తింటే కంటి చూపుతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. క్యారెట్ తింటే చర్మ సమస్యలూ తగ్గుముఖం పడతాయి. ఇందులో ఉండే బీటా కెరాటిన్ కంటి చూపును కాపాడుతుంది. రోజుకో క్యారెట్ తినడం వల్ల ఆరోగ్యానికి అంతా మేలే జరుగుతుంది. పలు సౌందర్య ఉత్పత్తుల్లోనూ క్యారెట్‌ను ఉపయోగిస్తుంటారు. ఇలాంటి క్యారెట్‌తో ఎప్పుడూ ఒకేలా తినాలంటే ఎవరికైనా బోరే. పిల్లలు, పెద్దలు ఇష్టపడేలా తినాలంటే ఎన్నో వెరైటీలను చేసుకోవచ్చు. కొన్నింటిని ఇప్పుడు చూద్దాం..



## స్పైసీ క్యారెట్ దోశ

**కావలసిన పదార్థాలు :** బియ్యం - ఒక కప్పు, మినపప్పు - ఒక కప్పు, తురిమిన క్యారెట్ - ఒక కప్పు, పసుపు - అర స్పూను, కారం - అర స్పూను, వెల్లుల్లి పేస్టు - ఒక స్పూను, అల్లం పేస్ట్ - ఒక స్పూను, నూనె - సరిపడా, జీలకర్ర - ఒక స్పూను, ఉప్పు - రుచికి సరిపడా, నీళ్లు - తగినన్ని.



**తయారీ విధానం :** బియ్యం, మినపప్పును శుభ్రంగా కడిగి విడివిడిగా మూడు గంటల పాటు నానబెట్టుకోవాలి. తరువాత మిక్సీలో వేసి మెత్తగా రుబ్బుకొని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. దాన్ని రాత్రంతా వదిలేయాలి. దీనివల్ల పిండి పులుస్తుంది. మరుసటి రోజు దోశ పిండిని బాగా కలిపి రుచికి సరిపడా ఉప్పు, నీరు కలుపుకోవాలి. ఇప్పుడు స్టఫింగ్ కోసం క్యారెట్‌ను రెడీ చేసుకోవాలి. ఒక స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేసి ఒక కప్పు తురిమిన క్యారెట్‌ను వేసి బాగా వేయించాలి. అందులోనే పసుపు, జీలకర్ర, అల్లం వెల్లుల్లి పేస్టు, కారం వేసుకొని బాగా ఫ్రై అయ్యేలా చూడాలి. కాస్త ఉప్పును కూడా వేసుకోవాలి. నాలుగు నిమిషాల పాటు వేయించాక మిక్సీలో వేసి పేస్టులాగా చేసుకోవాలి. దాన్ని తీసి ఒక గిన్నెలో వేసుకోవాలి. మసాలా దోశకు ఆలూ కూర చేసినట్టే... ఈ దోశకూ క్యారెట్ మిశ్రమాన్ని చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద పెనం పెట్టి ఆయిల్ రాసి దోశను వేసుకోవాలి. దోశ మీద ఈ క్యారెట్ మిశ్రమాన్ని ఒక రెండు టేబుల్ స్పూన్లు వేసి దోశ అంతా వేసుకోవాలి. బాగా కాలాక ప్లేట్లోకి తీసుకోవాలి.

## కేక్

**కావాల్సిన పదార్థాలు:** క్యారెట్ తురుము, మైదా, గుడ్లు, జీడిపప్పు, బేకింగ్ పౌడర్, పంచదార పొడి, యాలకులు, దాల్చిన చెక్క పొడి, ఆయిల్, ఉప్పు.

**తయారీ విధానం:** ముందుగా ఒక గిన్నె తీసుకుని అందులో గుడ్లను పగుల కొట్టి.. బాగా బీట్ చేయాలి. ఇందులోనే మైదా, బేకింగ్ పౌడర్, ఉప్పు, పంచదార పొడి, యాలకుల పొడి, దాల్చిన చెక్క పొడి వేసి బాగా గిలక్కొట్టాలి. జీడిపప్పును కూడా సన్నగా తురుముకుని ఇందులో కొన్ని కలిపి.. మరికొన్ని గార్నిషింగ్ కోసం పక్కన పెట్టుకోవాలి. చివర్లో క్యారెట్ తురుము కూడా వేసి బాగా బీట్ చేయాలి.

ఇప్పుడు ఓవెన్ 180 డిగ్రీలకు ప్రీ హీట్ చేసి పెట్టాలి. ఇప్పుడు కేక్ ట్రే తీసుకుని అందులో అడుగు భాగాన కాస్త వెన్న రాయాలి. దాని పైన మైదా చల్లాలి. ఇప్పుడు కేక్ మిశ్రమాన్ని వేయాలి. పైన మిగిలిన జీడిపప్పు ముక్కలనూ వేసుకోవాలి. ఆ తర్వాత ఆ ట్రేను ఓవెన్‌లో పెట్టాలి. ఉడికిన తర్వాత బయటకు తీసి చల్లారే వరకు వదిలేయాలి. చల్లారాక కేక్‌ని ముక్కలుగా కోసుకోవాలి.



## ఆమ్లెట్

**కావలసిన పదార్థాలు :** క్యారెట్ తురుము - పావు కప్పు, గుడ్లు - రెండు, ఉల్లిపాయ - ఒకటి, మిరియాలపొడి - అర స్పూను, పచ్చిమిర్చి - ఒకటి, ఉప్పు - రుచికి సరిపడా, కొత్తిమీర తరుగు - రెండు స్పూన్లు.

**తయారీ విధానం :** స్టవ్ మీద కళాయి పెట్టి ఒక స్పూను నూనె వేయాలి. నూనె వేడెక్కాక సన్నగా తరిగిన ఉల్లిగడ్డలు, పచ్చి మిర్చి, తురిమిన క్యారెట్ వేసి వేయించుకోవాలి. అవి బాగా వేగాక స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నెలో రెండు కోడిగుడ్లను కొట్టి బాగా గిలకొట్టాలి. అందులోనే అర స్పూన్ మిరియాల పొడి, రుచికి సరిపడా ఉప్పు, ముందుగా వేయించి పెట్టుకున్న ఉల్లిగడ్డలు, పచ్చిమిర్చి, క్యారెట్ తురుమును వేసి బాగా కలుపుకోవాలి. కొత్తిమీర తరుగును కూడా వేయాలి. ఇప్పుడు స్టవ్ మీద పెనం పెట్టి నూనె రాయాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని ఆమ్లెట్ లా పోసుకోవాలి. రెండు వైపులా కాల్చుకోవాలి. అంతే వెరైటీ ఆమ్లెట్ రెడీ.

## లడ్డు..

**కావలసిన పదార్థాలు :** క్యారెట్ తురుము - అరకిలో, పచ్చి కొబ్బరి తురుము - వందగ్రాములు, పంచదార - పావుకిలో (తగ్గించుకోవచ్చు కూడా), నెయ్యి - రెండు స్పూనులు, వేయించుకున్న జీడిపప్పు, బాదం పప్పు, కిస్ మిస్ - గుప్పెడు (అన్నింటి తరుగు), యాలకుల పొడి - అర టీస్పూను

**తయారీ విధానం :** ముందుగా క్యారట్లు శుభ్రంగా కడుక్కుని తురుములా చేసుకోవాలి. కళాయిలో నెయ్యి వేసి క్యారెట్ తురుమును వేయించాలి. పచ్చివాసన పోయే వరకు వేయించాలి. తరువాత కొబ్బరి తురుమును కూడా చేర్చాలి. రెండు నిమిషాలు బాగా వేయించు కోవాలి. గరిటెతో బాగా కలిపి మూత పెట్టేయాలి. ఓ అయిదు నిమిషాల తరువాత మూత తీసి పంచదార కూడా వేసి బాగా కలుపుకోవాలి. నీరంతా దిగి మిశ్రమం కాస్త దగ్గరగా గట్టిగా అయ్యేదాకా బాగా కలపాలి. జీడిపప్పు, బాదం పప్పు, కిస్ మిస్ లు, యాలకుల పొడి కూడా వేసి బాగా కలపాలి. మిశ్రమం లడ్డూల చుట్టేందుకు వీలుగా గట్టిగా అయ్యాక స్టవ్ కట్టేయాలి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని లడ్డూల్లా చుట్టి చిన్న బాక్సులో వేసి మూత పెట్టి ఫ్రిజ్ లో పెడితే వారం రోజుల పాటూ తాజాగా ఉంటాయి.



## పలావ్

**కావలసిన పదార్థాలు :** బాస్మతి బియ్యం - ఒక కప్పు, ఉప్పు - రుచికి సరిపడా, నూనె లేదా నెయ్యి - మూడు స్పూన్లు, యాలకులు - మూడు, బిర్యానీ ఆకులు - రెండు, మిరియాల పొడి - అర స్పూను, క్యారెట్లు - రెండు, బీన్స్ - ఎనిమిది, గరం మసాలా - అర స్పూను, నిమ్మరసం - ఒక స్పూను, కొత్తిమీర తరుగు - మూడు స్పూన్లు, పసుపు - అర స్పూను, నీళ్లు - సరిపడినన్ని, పచ్చిమిర్చి - మూడు.

**తయారీ విధానం :** బాస్మతి బియ్యాన్ని ముందుగానే కడిగి అరగంట పాటు నానబెట్టాలి. దాన్ని అన్నంలా వండి ఒక ప్లేట్లో వేసి చల్లపరచాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె లేదా నెయ్యి వేయాలి. అందులో బిర్యానీ ఆకు, యాలకులు, నిలువుగా తరిగిన పచ్చిమిర్చి వేసి వేయించాలి. అందులోనే మిరియాల పొడి, గరం మసాలా వేసి కలపాలి. ఇప్పుడు క్యారెట్, బీన్స్ తురుమును వేసి కలపాలి. రుచికి సరిపడా ఉప్పు, పసుపు వేసి బాగా కలపాలి. ఇపుడు మూత పెట్టి కూరగాయలు మెత్తబడే వరకు చిన్న మంట మీద ఉంచాలి.ఆ తర్వాత చిన్నమంట మీదే ఉంచి ముందుగా వండుకున్న అన్నాన్ని వేసి బాగా కలుపుకోవాలి.

## పరాటా

**కావలసిన పదార్థాలు :** క్యారట్ తురుము - రెండు కప్పులు, గోదుమపిండి - ఒకటిన్నర కప్పులు, కొత్తిమీర తరుగు, చిన్న ఉల్లిపాయ, అరచెంచా అల్లం వెల్లుల్లి ముద్ద, కరివేపాకు రెబ్బ, పచ్చిమిర్చి తరుగు, చెంచాల నెయ్యి లేదా నూనె తగినంత ఉప్పు

**తయారీ విధానం:** ముందుగా క్యారట్‌ను తురుముకుని పక్కన పెట్టుకోవాలి. అందులో ఉల్లిగడ్డ ముక్కలు, అల్లం వెల్లుల్లి, కరివేపాకు తరుగు, పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర వేసుకోవాలి. అందులోనే గోధుమపిండి, ఉప్పు వేసుకుని కొద్దికొద్దిగా నీళ్లు పోసుకుంటూ కలుపుకోవాలి.

క్యారెట్ నుంచి నీరు బయటకు వస్తుంటుంది కాబట్టి, కాస్త చూసుకుంటూ నీళ్లు పోసుకోవాలి. దీన్ని చపాతీ ముద్దలాగా కలుపుకోవాలి. అవసరమైతే చెంచా నూనె వేసుకుని మరోసారి పిండిలా చేసుకోవాలి. దీన్ని ఒక పావుగంట సేపు తడిగుడ్డ కప్పి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు చిన్న చిన్న ఉండలు చేసుకుని పక్కనుంచాలి. వీటిని పరాటాల్లాగా కాస్త మందంగా ఒత్తుకుంటే చాలు. వేడి పెనం మీద వేసుకుని రెండు వైపులా నూనె లేదా నెయ్యి వేసుకుని కాల్చుకుంటే చాలు. క్యారట్ పరాటా రెడీ...



# అంతా వన్‌సైడేనా..?

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా వ్యాఖ్యానించారు. కానీ ఇప్పటిదాకా నిర్వహించిన సమీక్షలేవీ కూడా ఆ తీరులో జరగలేదంటూ ఆయన వాపోయారు. అధిష్టానం వద్ద పలుకుబడి కలిగిన ఒకరిద్దరు నేతలు మాట్లాడటం, ఆ తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్‌తో మాట్లాడించి, వెంటనే సమావేశాన్ని ముగింపజేయటం పరిపాటిగా మారిందంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అగ్రనేతలు మాట్లాడేటప్పుడు తమ స్థాయిని, హోదాని మరిచి, ప్రధానిపైనా, ముఖ్యమంత్రిపైనా నోరు పారేసుకోవటం, దుర్భాషలాడటం మంచిది కాదనే అభిప్రాయాలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఈ పద్ధతిని మార్చుకుని, సరైన రీతిలో సమీక్షలు నిర్వహించటం ద్వారా పార్టీని బలోపేతం చేసుకుంటే మంచిదనే సూచనలు క్యాడర్ నుంచి వస్తుండటం గమనార్హం. మరి ఈ విషయాలను బీఆర్ఎస్ అగ్రనేతలు పట్టించుకుంటారో ? లేదో..? వేచి చూడాలి.

# కేసీఆర్, కేటీఆర్ జైలుకెళ్లాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు ఫోన్ ట్యాపింగ్ చేశారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో సిట్ వేసి లోతైన దర్యాప్తు జరపాలని ఆయన కోరారు.

# దిగువ కోర్టుల్లోనే కాదు.. హైకోర్టుల్లోనూ సౌకర్యాల కొరత

(మొదటిపేజీ తరువాయి)

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై.చంద్రచూడ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి.. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం 32 ఈ సేవా కేంద్రాలను వర్చువల్ కార్యక్రమం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయసేవలు చేరువయ్యేలా రావాలని ఆకాంక్షించారు. బ్రిటీష్ కాలంలో కోర్టులు సార్వభౌమత్వాన్ని కలిగి ఉండేవని.. మారినకాలంతో పాటు న్యాయస్థానాల్లోనూ మార్పులు వస్తున్నాయని అన్నారు. యువత వేగంగా మార్పులు కోరుకుంటుందని తెలిపారు. ఉద్యాన విశ్వవిద్యాలయాల నుంచి 100 ఎకరాల భూమిని తెలంగాణ హైకోర్టు నిర్మాణానికి కేటాయించడం అభినందించదగ్గ విషయమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులను ప్రత్యేకంగా అభినందించారు. న్యాయ ప్రక్రియలను క్రమబద్ధీకరించడానికి, సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఇది ఆధునిక సాంకేతికత, మౌలిక సదుపాయాలను కలిగి ఉండేలా నిర్మించుకోవడానికి కేటాయించడం అభినందనీయమని తెలిపారు. కోర్టు గదులు, న్యాయమూర్తుల గదులు, పరిపాలనా కార్యాలయాలు, లైబ్రరీలు.. ఇతర సహాయక సేవలతో సహా హైకోర్టుకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఉండేలా కొత్త భవనాన్ని నిర్మించుకోవాలన్నారు. అత్యున్నత స్థాయిలో ఉన్న న్యాయస్థానాలు, కనీస వసతులు లేని నిర్బంధంలో ఉన్నాయని, వాటన్నింటినీ రూపుమాపి ఆధునిక హంగులతో కొత్త భవనాలు నిర్మించుకోవాలని సూచించారు. కొత్త భవనంలో స్త్రీలు, వికలాంగులకు విభిన్న సౌకర్యాలుండాలన్నారు. న్యాయవ్యవస్థ విలువలు పెంపొందించేలా సీనియర్లు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాంకేతిక యుగంలో కోర్టు కార్యకలాపాలకు ఇంటర్నెట్‌ను వినియోగించుకోవాలని.. ఇటీవల ఈ-కోర్టు పథకంలో భాగంగా పలు చోట్ల ఈ సేవా కేంద్రాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీ.ఎస్ నరసింహ, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, జస్టిస్ ఎస్‌వీ భట్టి, డీజీపీ రవి గుప్త, జిల్లా కలెక్టర్ శశాంక, జిల్లా న్యాయమూర్తులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేసిన ఎన్నికల సంఘం

**నవతెలంగాణ-హైదరాబాద్:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, బీజేపీ లోక్‌సభ అభ్యర్థి కంగనా రనౌత్‌లపై అభ్యంతర వ్యాఖ్యలు చేసిన నేతలపై ఎన్నికల సంఘం సీరియస్ అయ్యింది. బీజేపీ ఎంపీ దిలీప్ ఘోష్, కాంగ్రెస్ నాయకులు సుప్రియా శ్రీనెట్‌లకు ఈసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 29న సాయంత్రం 5గంటల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ స్థానం నుంచి బాలీవుడ్ నటి కంగనాకు బీజేపీ టికెట్ కేటాయించిన విషయం తెలిసిందే. అయితే, కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనెట్ కంగనా ఫొటోను షేర్ చేస్తూ అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. అయితే, ఆమె చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. దాంతో ఆమె పోస్టులు డిలీట్ చేశారు. తన ఇన్‌స్టా అకౌంట్ యాక్సెస్ చాలా మంది వద్ద ఉందని.. అందులో ఎవరో ఒకరు పెట్టి ఉంటారన్నారు. అలాగే బెంగాల్‌కు చెందిన సీనియర్ బీజేపీ నేత, ఎంపీ దిలీప్ ఘోష్ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన కార్యకర్తలు బీజేపీ జాతీయ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన జేపీనడ్డా వివరణ ఇవ్వాలని నోటీసు జారీ చేశారు. ఆ తర్వాత దిలీప్ ఘోష్ క్షమాపణలు చెప్పారు. తాను చేసిన వ్యాఖ్యలపై చింతిస్తున్నానన్నారు. ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను టీఎంసీ ఈసీ దృష్టికి తీసుకెళ్లింది. ఈ క్రమంలో ఇద్దరు నేతలకు ఈసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

## బాల్టిమోర్‌లో వంతెన ప్రమాదం..ఆరుగురి మృతి!

**నవతెలంగాణ - బాల్టిమోర్:** అమెరికాలోని బాల్టిమోర్‌లో జరిగిన వంతెన ప్రమాదంలో గల్లంతైన ఆరుగురూ మరణించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. వారి ఆచూకీ కోసం చేపట్టిన గాలింపును బుధవారం ఉదయం వరకు నిలిపివేస్తున్నామని ప్రకటించారు. వీరంతా వంతెనపై గుంతలు పూడుస్తున్నారని మేరీలాండ్ రవాణా శాఖ కార్యదర్శి పాల్ వైడెఫెల్డ్ తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో నది లోతు, కనిపించకుండా పోయిన తర్వాత గడిచిన సమయాన్ని బట్టి చూస్తే మరణించి ఉంటారని వారిని నియమించుకున్న కంపెనీ బ్రానర్ బిల్డర్స్ పేర్కొంది. పటాప్‌స్కో నదిపై ఉన్న ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెనను నౌక ఢీకొనడంతో వంతెన మొత్తం కుప్పకూలిన విషయం తెలిసిందే. అమెరికా కాలమానం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. నౌక ఢీకొనగానే వంతెన పిల్లర్ బొమ్మలా విరిగిపోయింది. ఆ వెంటనే సెకన్లలోనే వంతెన కూలింది. దీంతో ఆ సమయంలో వంతెనపై వెళ్తున్న వాహనాలన్నీ నదిలో పడిపోయాయి. పలువురు గల్లంతయ్యారు. పడిపోయిన వారిలో ఇద్దరిని సహాయక సిబ్బంది కాపాడారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మరోవైపు ఢీకొన్న నౌకలోనూ మంటలు చెలరేగాయి. అందులోని సిబ్బంది అంతా భారతీయులే. వారంతా క్షేమంగానే ఉన్నారు. తొలుత నౌకలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే ప్రమాద సంబంధ సమాచారాన్ని నౌకా సిబ్బంది అధికారులకు అందించారు. మరుక్షణం వంతెన పై వాహనాలను ఆపేయడంతో భారీ ముప్పు తప్పింది. రాత్రి కావడం.. వాహన సంచారం తక్కువగా ఉండడంతో ప్రాణనష్టం తీవ్రత తగ్గింది.

## బాసగూడెం అడవుల్లో ఎదురుకాల్పులు

**నవతెలంగాణ-చర్ల**

సరిహద్దు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లో బీజాపూర్ జిల్లా బాసగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చీపురు బట్టి సమీప తాలి పేరు నది ఒడ్డున బుధవారం మావోయిస్టులకు పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులతో సహా ఆరుగురు మృతి చెందినట్టు బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. మృతులను.. మిలీషియా సెక్రటరీ కమాండర్ మూక, ఏసీఎం నగేష్, అతని భార్య సోనీ, ఏసీఎం మిలీషియా సీప్ వికాస్, ఏసీఎం గనజి, సుక్కగా పోలీసులు గుర్తించారు. హోలీ పండుగ రోజు ముగ్గురు గ్రామీణులను మావోయిస్టులు హత్య చేసిన సంఘటన ఆచూకీ కోసం కోబ్రా 210, 205, సీఆర్పీఎఫ్ 229 బెటాలియన్, డీఆర్జీ బలగాలు బాసగూడ అడవులను జల్లెడ పట్టాయి. ఈ క్రమంలో చీపురు బట్టి సమీప అడవిలో మావోయిస్టులు తారసపడి విచక్షణారహితంగా భద్రతా బలగాలపై కాల్పులు జరిపారని, ఆత్మ రక్షణ కోసం బలగాలు సైతం ఎదురుకాల్పులు జరపడంతో ఆరుగురు మావోయిస్టులు చనిపోయారని తెలిపారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ప్లాటూన్ నెంబర్ 10 కమిటీ కమాండర్ రమేష్, అతని భార్య సోనీ మృతుల్లో ఉన్నారని ఎస్పీ ధ్రువీకరించారు. రెండు మూడు గంటల పాటు ఏకధాటిగా జరిగిన ఎన్‌కౌంటర్ అనంతరం ఘటనా స్థలంలో మృతదేహాలతో పాటు తుపాకులు, మందు గుండు సామగ్రి, మావోయిస్టుల విప్లవ సాహిత్యం భారీగా లభించిందని ఎస్పీ తెలిపారు.

## ఎన్నికల తర్వాతే రుణమాఫీ

(మొదటిపేజీ తరువాయి)

నిధులు విడుదల చేసిన అప్పటి ప్రభుత్వం చివరివరకు 23 లక్షల మంది రైతులకు రుణ మాఫీ చేసింది. రూ. లక్ష కంటె అధికంగా ఉన్న 14 లక్షల మంది రైతులకు ఈ మాఫీ వర్తించలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల రైతులు ఐదేండ్ల పాటు అవస్థలు పడ్డారు. సర్కార్ మాఫీ చేస్తుందనే భరోసాతో చాలా మంది రైతులు రుణాలను రీ షెడ్యూల్ చేసుకోలేదు. ఫలితంగా వడ్డీకి వడ్డీ తోడై రుణ మొత్తాలు భారీగా పెరిగాయి. ప్రభుత్వం విడతల వారీగా చేసిన రుణ మాఫీ వడ్డీలకే సరిపోయింది. చాలా మంది రైతులను డిఫాల్టర్లుగా బ్యాంకులు ప్రకటించాయి. అటు బ్యాంకుల్లో, ఇటు ప్రయివేటులో అప్పు పుట్టక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా అర్హులైన రైతులందరికీ అందించే ప్రతిపాదనలపై మొదటి వంద రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. గతంలో జరిగిన తప్పులకు ఆస్కారం లేకుండా ఎన్నికల అనంతరం ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

# ఇంటర్మీడియట్ తరగతుల్లో అడ్మిషన్లను పెంచాలి

## ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

మోడల్ స్కూళ్లు-ఇంటర్మీడియట్ తరగతుల్లో అడ్మిషన్లు పెంచటానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం మోడల్ స్కూల్స్ సొసైటీ, పాఠశాల విద్య అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారికి లేఖ రాశారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాటశాలల్లోనూ ఐదు నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఆయా స్కూళ్ళ సామర్థ్య స్థాయిలో పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. 194 మోడల్ స్కూళ్లల్లో ఇంటర్మీడియట్ తరగతులు నాలుగు గ్రూపులుగా నిర్వహించే అవకాశమున్నదని తెలిసిందనీ, గ్రూపులో 40 మంది విద్యార్థులను చేర్చుకున్నా, మొదటి సంవత్సరంలో 160, రెండో సంవత్సరంలో 160 మంది విద్యార్థులు ఉండాలని తెలిపారు. 194 స్కూళ్లలో 31,040 మంది విద్యార్థులను మొదటి సంవత్సరంలో చేర్చుకోవచ్చని సూచించారు.

2023-24 ప్రస్తుత విద్యా సంవత్సరంలో 18,241మంది విద్యార్థులు చేరారనీ, 12,799 అడ్మిషన్లు ఖాళీగా మిగిలిపోయాయని గుర్తు చేశారు. ఇంటర్మీడియట్ తరగతుల్లో సామర్థ్యం మేరకు విద్యార్థులు చేరకపోవటానికి కారణాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఐదు నుంచి పదో తరగతి వరకు 2013 ప్రారంభ సంవత్సరాలలో తరగతికి రెండు సెక్షన్లు, సెక్షన్‌కు 40 మంది విద్యార్థుల చొప్పున 80 మంది విద్యార్థులను చేర్చుకునేవారని తెలిపారు. అడ్మిషన్లకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో సెక్షన్‌కు 50 మంది విద్యార్థుల చొప్పున తరగతిలో 100 మందిని చేర్చుకున్నారని తెలిపారు. రెండేండ్ల నుంచి కొన్ని మోడల్ స్కూళ్లలో ఐదు నుంచి పదో తరగతి వరకు కూడా అడ్మిషన్లు తగ్గాయని పేర్కొన్నారు. ఈ తరగతుల్లో కూడా విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో పూర్తి స్థాయిలో చేరేటట్లు తగు చర్యలు తీసుకోవాలని నర్సిరెడ్డి కోరారు.

# నేడు కేజ్రీవాల్ గుట్టు విప్పుతారు..

**న్యూఢిల్లీ :** ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడాన్ని ఆప్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో తీవ్రంగా నిరసించారు. 'నేను కేజ్రీవాల్‌ను' అన్న లోగోను ముద్రించిన పసుపు రంగు టీ షర్ట్‌లు వారంతా ధరించి ముఖ్యమంత్రి ముఖం కటౌట్‌లతో అసెంబ్లీకి వచ్చారు. సభా వేదిక వద్దకు దూసుకువచ్చిన ఆప్ ఎమ్మెల్యేలు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ముఖ్యమంత్రికి మద్దతుగా నినాదాలు చేశారు. ఆప్ నిరసనల కవరేజ్‌కి వచ్చిన ఫోటో జర్నలిస్టులను ఢిల్లీ పోలీసులు మంగళవారం వేధించారు. ఆప్ నేతల ఫోటోలను తీయడానికి వారు ప్రయత్నిస్తుండగా మీడియాకు, పోలీసు బలగాలకు మధ్య ఘర్షణ జరిగింది. కేజ్రీవాల్ అరెస్టయిన తర్వాత మొదటసారిగా జరిగిన ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు తీవ్ర నిరసనలతో ప్రారంభమవడం, వెంటనే వాయిదా పడడం కూడా జరిగిపోయింది. వాయిదా పడి తిరిగి సభ సమావేశమైన అనంతరం స్పీకర్ రామ్‌నివాస్ గోయల్ మాట్లాడుతూ సభ ప్రశాంతంగా కొనసాగేందుకు సహకరించాలని సభ్యులను కోరారు. అయినా ఆప్ సభ్యులు తమ నిరసనలను కొనసాగించారు. ఇదిలావుండగా, మరోవైపు కేజ్రీవాల్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతలు కూడా నిరసనలు చేపట్టారు. దీంతో ఏప్రిల్ 1 వరకు అసెంబ్లీ వాయిదా పడింది.

**28న కోర్టులో నిజం చెబుతారు**

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పలుసార్లు దాడులు జరిపినా ఎలాంటి నగదు బయటపడలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని కేజ్రీవాల్ సతీమణి సునీత చెప్పారు. ఎక్సైజ్ పాలసీ కేసులో ఈ నెల 28న కేజ్రీవాల్ కోర్టులో "పెద్ద విషయాన్ని" వెల్లడిస్తారని ఆమె తెలిపారు. వాస్తవాన్ని వెల్లడించడంతో పాటూ సాక్ష్యాధారాలను కూడా అందచేస్తారని తెలిపారు.

తన అరెస్టును సవాలు చేస్తూ కేజ్రివాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం ఇచ్చేందుకు తమకు గడువు కావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం ఢిల్లీ హైకోర్టును కోరింది. ఈడీ తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు మాట్లాడుతూ, 'స్థూలమైన' పిటిషన్‌ను మంగళవారమే అందచేసినందున, తమ వైఖరి నమోదు చేసేందుకు మూడు వారాల గడువు ఇవ్వాలని కోరారు.

**తిరువనంతపురంలో ఆప్ కార్యకర్తల నిరసన**

కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ తిరువనంతపురంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం వెలుపల ఆప్ కార్యకర్తలు నిరసన తెలియచేశారు. ప్రధాని మోడీ దిష్టి బొమ్మను దహనం చేశారు. అదేసమయంలో కొంతమంది బీజేపీ కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుంచి బయటకు వచ్చి ఆప్ కార్యకర్తలతో ఘర్షణ పడ్డారు. పోలీసులు వెంటనే కల్పించుకుని ఇరు వర్గాల వారికి సర్ది చెప్పి పంపారు.

**క్షీణించిన కేజ్రీవాల్ ఆరోగ్యం**

కేజ్రీవాల్‌కు రక్తంలో చక్కెర స్థాయి తగ్గిపోయిందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగా లేదని ఆప్ వర్గాలు తెలిపాయి. ఒక దశలో ఆయన షుగర్ కౌంట్ 46ఎంజిగా వుందని, అలా పడిపోవడం చాలా ప్రమాదకరమని డాక్టర్లు చెప్పినట్లు తెలిపారు.

**అమెరికా రాయబారికి సమన్లు**

కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా స్పందించిన నేపథ్యంలో భారత్ న్యూఢిల్లీలోని అమెరికా ఎంబసీలో తాత్కాలిక డిప్యూటీ చీఫ్‌కు సమన్లు జారీ చేసింది.

జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపరాదని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా వ్యాఖ్యానించారు. తమ నేత కటకటాల వెనుక వున్నా ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఆప్ నేతలు ప్రకటనలు చేసిన నేపథ్యంలో గవర్నర్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఇక్కడ ఒక సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఇంటి భోజనం, బెడ్**

ఈడీ లాకప్‌లో ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు ఇంటి భోజనం, బెడ్, బాటిల్‌తో తాగునీరు వంటి సౌకర్యాలన్నీ అమరుతున్నాయి. లాకప్ నుంచి కొద్దిదూరంలోనే టాయిలెట్, బాత్‌రూమ్‌లు వున్నాయని తెలుస్తోంది. 24గంటలూ భద్రతా సిబ్బంది వీటిదగ్గర కాపలా వుంటారు. సీసీటీవీ కెమెరాలు కూడా ఆ ఆవరణలో వున్నాయి. తన అరెస్టును సవాలు చేస్తున్న పిటిషన్‌పై బుధవారమే విచారణ జరపాలని కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును కోరారు. అయితే ఆయనకు ఊరట దక్కలేదు. ఏప్రిల్ 3న విచారిస్తామన్నారు.

ఐపీఎల్‌లో నేడు
రాజస్థాన్ X ఢిల్లీ
వేదిక : జైపూర్, రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..




# జోరు సాగేనా?

- రెండో విజయంపై రాజస్థాన్ గురి
- తొలి గెలుపు వేటలో పంత్‌సేన
- రాయల్స్‌తో క్యాపిటల్స్ ఢీ నేడు



**జైపూర్ :** రాజస్థాన్ రాయల్స్ వరుసగా రెండో మ్యాచ్‌ను సొంతగడ్డపై ఆడేందుకు రంగం సిద్ధం చేసుకుంది. సీజన్లో తొలి మ్యాచ్‌లో శుభారంభం చేసిన రాజస్థాన్ రాయల్స్ నేడు ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. తొలి మ్యాచ్‌లో పరాజయం చవిచూసిన ఢిల్లీ క్యాపిటల్స్ నేడు జైపూర్‌లో గెలుపు బాట పట్టాలని ఎదురుచూస్తుంది. ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా రెండో మ్యాచ్‌ను సైతం ప్రత్యర్థి మైదానంలో ఆడనుంది. రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ నేడు రాత్రి 7.30 గంటలకు ఆరంభం.

**క్యాపిటల్స్ మెరిసేనా? :** ఢిల్లీ క్యాపిటల్స్ సీజన్‌లో తొలి మ్యాచ్‌లో భావోద్వేగాలతో బరిలోకి దిగింది. రిషబ్ పంత్ పునరాగమనంలో మ్యాచ్ ఫిట్‌నెస్ పరంగా మెప్పించినా.. జట్టుకు విజయాన్ని అందించలేదు. తొలి మ్యాచ్‌లో ఓటమి నుంచి క్యాపిటల్స్ వేగంగా పుంజుకోవాలని చూస్తుంది. డెవిడ్ వార్నర్, పృథ్వీ షా క్యాపిటల్స్‌కు ఆశించిన ఆరంభం ఇవ్వటం లేదు. విధ్వంసక బ్యాటర్లు ఇద్దరూ నెమ్మదిగా ఆడటం మిడిల్ ఆర్డర్‌పై భారం పడుతోంది. రిషబ్ పంత్, అక్షర్ పటేల్‌లు క్యాపిటల్స్‌కు కీలకంగా మారారు. కుల్దీప్ యాదవ్ బంతితో వికెట్ల వేటతో పాటు పరుగుల నియంత్రణ లోనూ ఆకట్టుకున్నాడు. కానీ ఇతర బౌలర్ల నుంచి సహకారం లభించలేదు. సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ ఫిట్‌నెస్‌పై స్పష్టత లేదు. ఖలీల్ అహ్మద్, అభిషేక్ పోరెల్, యశ్ దుల్, రికీ భుయ్‌లు అంచనాల మేరకు రాణించాల్సిన అవసరం ఉంది.

**జోరుమీదున్న రాయల్స్ :** తొలి మ్యాచ్‌లో విజయంతో రాజస్థాన్ రాయల్స్ జోరు మీదుంది. ఆ జట్టులో బ్యాటర్లు, బౌలర్లు మంచి ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ సంజు శాంసన్ ముందుండి నడిపిస్తున్నాడు. గత మ్యాచ్‌లో అజేయ అర్థ సెంచరీతో చెలరేగాడు. యశస్వి జైస్వాల్, జోశ్ బట్లర్ విధ్వంసక ఓపెనర్లు. ఈ ఇద్దరూ పవర్‌ప్లే తర్వాత క్రీజులో నిలిస్తే ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లకు చుక్కలే!. ఇక స్పిన్ అనుకూలిత సవారు మాన్‌సింగ్ స్టేడియంలో రాయల్స్ ప్రధాన బలం స్పిన్ ద్వయం చాహల్, అశ్విన్. మణికట్టు మాయగాడు యుజ్వేంద్ర చాహల్, ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌పై రాయల్స్ ఎక్కువగా ఆధారపడింది. ఈ ఇద్దరూ మిడిల్ ఓవర్లలో వికెట్ల పతనాన్ని శాసిస్తే.. రాయల్స్‌కు ఎదురుండదు.

సన్‌రైజర్స్ అంటే ఫ్లవర్ కాదు, ఫైర్. గత సీజన్లో పేలవ ప్రదర్శనతో నిరాశపరిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఐపీఎల్ 2024లో విధ్వంసం సృష్టిస్తోంది. ఈడెన్‌గార్డెన్స్‌లో భారీ ఛేదనలో మెప్పించిన కమిన్స్‌సేన.. సొంతగడ్డ ఉప్పల్‌లో ముంబయి ఇండియన్స్‌ను ఊచకోత కోసింది. ట్రావిశ్ హెడ్ (62), అభిషేక్ శర్మ (63), హెన్రిక్ క్లాసెన్ (80), ఎడెన్ మార్‌క్రామ్ (42) దంచికొట్టడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక స్కోరు నమోదు చేసింది. ముంబయి ఇండియన్స్ బౌలర్లను చీల్చిచెండాడిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 277 పరుగుల ఐపీఎల్ ఆల్‌టైమ్ రికార్డు సాధించింది. ముంబయి ఇండియన్స్‌పై 31 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సీజన్లో బోణీ కొట్టింది.

# ఉప్పల్‌లో సన్‌ఫైర్



- అభిషేక్, హెడ్, క్లాసెన్ ఊచకోత
- ముంబయి ఇండియన్స్‌పై ఘన విజయం

**హైదరాబాద్ 277/3, ముంబయి 246/5**

**నవతెలంగాణ - హైదరాబాద్**

ఉప్పల్‌లో సన్‌రైజర్స్ ఫైరింగ్ మోత మోగించింది. బ్యాటింగ్ లైనప్‌లో ముగ్గురు బ్యాటర్లు విధ్వంసక ఇన్నింగ్స్‌లతో కదం తొక్కటంతో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలోనే అత్యధిక స్కోరు 277/3 సన్‌రైజర్స్ హైదరాబాద్ నమోదు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (80 నాటౌట్, 34 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్సులు), అభిషేక్ శర్మ (63, 23 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సులు), ట్రావిశ్ హెడ్ (62, 24 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సులు) ధనాధన్ అర్థ సెంచరీలు నమోదు చేశారు. ఎడెన్ మార్‌క్రామ్ (42 నాటౌట్, 28 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) సమయోచిత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. రికార్డు ఛేదనలో ముంబయి ఇండియన్స్ పోరాడినా.. కొండంత లక్ష్యానికి దూరంగానే ఉండిపోయారు. లోకల్ బాయ్ తిలక్ వర్మ (64, 34 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సులు), టిమ్ డెవిడ్ (42 నాటౌట్, 22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు), రోహిత్ శర్మ (26), ఇషాన్ కిషన్ (34), నమన్ దిర్ (30) రాణించారు.



**ముగ్గురు మొనగాళ్లు :** టాస్ ఓడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలుత బ్యాటింగ్‌కు వచ్చింది. కోల్‌కత నైట్‌రైడర్స్‌తో మ్యాచ్ సమీక్ష చేసుకున్న సన్‌రైజర్స్ బ్యాటింగ్ లైనప్‌ను బలోపేతం చేసేందుకు తుది జట్టులోకి ట్రావిశ్ హెడ్‌ను తీసుకుంది. ఈ నిర్ణయమే సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ గతిని మార్చేసింది. మయాంక్ అగర్వాల్ (11, 13 బంతుల్లో 1 ఫోర్) తోడుగా ఇన్నింగ్స్ ఆరంభించిన ట్రావిశ్ హెడ్ (63) విరుచుకుపడ్డాడు. నెమ్మదిగా ఆడుతున్న మయాంక్ నిష్క్రమణతో సన్‌రైజర్స్ కలిసొచ్చింది. అగ్నికి వాయువు తోడైనట్టు ట్రావిశ్ హెడ్‌కు అభిషేక్ శర్మ (63) జతకలిశాడు. దీంతో సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. 9 ఫోర్లు, 2 సిక్సర్లతో ట్రావిశ్ హెడ్ 18 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. సన్‌రైజర్స్ తరఫున వేగవంతమైన అర్థ శతకం రికార్డు సాధించాడు. కానీ ఆ రికార్డును అభిషేక్ శర్మ స్వల్ప వ్యవధిలో చెరిపేశాడు. రెండు ఫోర్లు, ఆరు సిక్సర్లు కొట్టిన అభిషేక్ శర్మ.. 16 బంతుల్లో అర్థ సెంచరీ బాదాడు. హెడ్ జోరుతో 4.4 ఓవర్లలో 50 పరుగులు చేసిన హైదరాబాద్.. అభిషేక్ దెబ్బకు 6.6 ఓవర్లలోనే వంద పరుగుల మార్క్ చేరుకుంది. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ ఊచకోతకు 10.2 ఓవర్లలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ 150 పరుగుల మార్క్ చేరుకుని భారీ స్కోరుకు గట్టి పునాది వేసుకుంది. అర్థ సెంచరీల అనంతరం హెడ్, అభిషేక్ అవుటైనా.. అప్పటికే హెన్రిచ్ క్లాసెన్ దండయాత్రకు వేదిక తయారైంది. వచ్చీ రాగానే విరుచుకుపడిన హెన్రిచ్ క్లాసెన్ ఈడెన్ గార్డెన్ జోరు కొనసాగించాడు. 1 ఫోర్, ఐదు సిక్సర్లతో 23 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. ఎడెన్ మార్‌క్రామ్ (42) క్లాసెన్‌కు చక్కగా సహకరించాడు. 20 ఓవర్లలో 3 వికెట్లకు సన్‌రైజర్స్ హైదరాబాద్ 277 పరుగుల రికార్డు స్కోరు సాధించింది.

**హైలైట్స్‌ను తలపించే ఇన్నింగ్స్.. :** సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్ హైలైట్స్‌ను తలపించింది. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్ త్రయం ముంబయి ఇండియన్స్ బౌలర్లపై విరుచుకుపడింది. డెత్ ఓవర్లలో క్లాసెన్‌ను నిలువరించేందుకు తొలుత ముంబయి ఇండియన్స్ జశ్‌ప్రీత్ బుమ్రాను బౌలింగ్‌కు దూరంగా ఉంచింది. కానీ ఆరంభంలోనే హెడ్, అభిషేక్ దూకుడుతో బుమ్రా అనుకున్న దానికంటే ముందుగానే బంతి అందుకోవాల్సి వచ్చింది. అయినా, సన్‌రైజర్స్ దూకుడులో ఎటువంటి మార్పు లేదు. ముంబయి ఇండియన్స్ బౌలర్లలో జశ్‌ప్రీత్ బుమ్రా ఒక్కడే ఓవర్‌కు 9 పరుగులు ఇవ్వగా.. మిగతా అందరూ 10కిపైగా పరుగులు ఇచ్చుకున్నారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ నెలకొల్పిన 263/5 పరుగుల అత్యధిక స్కోరు రికార్డును బలమైన బౌలింగ్ దళం కలిగిన ముంబయి ఇండియన్స్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ బద్దలుకొట్టింది.



**స్కోరు వివరాలు**

**సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్ :** మయాంక్ అగర్వాల్ (సి) డెవిడ్ (బి) హార్దిక్ పాండ్య 11, ట్రావిశ్ హెడ్ (సి) నమన్ దిర్ (బి) కోయేట్జి 62, అభిషేక్ శర్మ (సి) నమన్ దిర్ (బి) పియూశ్ చావ్లా 63, ఎడెన్ మార్‌క్రామ్ నాటౌట్ 42, హెన్రిచ్ క్లాసెన్ నాటౌట్ 80, ఎక్స్‌ట్రాలు : **19, మొత్తం : (20 ఓవర్లలో 3 వికెట్లకు) 277.**

**వికెట్ల పతనం :** 1-45, 2-113, 3-161.

**బౌలింగ్ :** క్వెనా మాపాకా 4-0-66-0, హార్దిక్ పాండ్య 4-0-46-1, జశ్‌ప్రీత్ బుమ్రా 4-0-36-0, గెరాల్డ్ కోయేట్జి 4-0-57-1, పియూశ్ చావ్లా 2-0-34-1, శామ్స్ ములాని 2-0-33-0.

**ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్ :** రోహిత్ శర్మ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 26, ఇషాన్ కిషన్ (సి) మార్‌క్రామ్ (బి) షాబాజ్ 34, నమన్ దిర్ (సి) కమిన్స్ (బి) ఉనద్కత్ 30, తిలక్ వర్మ (సి) మయాంక్ (బి) కమిన్స్ 64, హార్దిక్ పాండ్య (సి) క్లాసెన్ (బి) ఉన్కదత్ 24, టిమ్ డెవిడ్ నాటౌట్ 42, షెఫర్డ్ నాటౌట్ 15, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (20 ఓవర్లలో 5 వికెట్లకు) 246.**

**వికెట్ల పతనం :** 1-56, 2-66, 3-150, 4-182, 5-224.

**బౌలింగ్ :** భువనేశ్వర్ కుమార్ 4-0-53-0, జైదేవ్ ఉనద్కత్ 4-0-47-0, షాబాజ్ అహ్మద్ 3-0-39-1, పాట్ కమిన్స్ 4-0-35-2, ఉమ్రాన్ మాలిక్ 1-0-15-0, మయాంక్ మార్కండే 4-0-52-0.

# సింధు శుభారంభం

**స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్**



**మాడ్రిడ్ (స్పెయిన్) :** భారత అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు మాడ్రిడ్ స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో శుభారంభం చేసింది. 2024 పారిస్ ఒలింపిక్స్ ముంగిట ఓ టైటిల్ విజయంపై కన్నేసిన సింధు.. స్పెయిన్ మాస్టర్స్ మహిళల సింగిల్స్‌లో ప్రీ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సింధు వరుస గేముల్లో గెలుపొందింది. రెండో సీడ్ సింధు 21-16, 21-12తో కెనడా షట్లర్ వెన్ యు జాంగ్‌ను చిత్తు చేసింది. 30 నిమిషాల్లోనే ముగిసిన మ్యాచ్‌లో సింధు ఆధిపత్యం చూపించింది. తొలి గేమ్‌లో విరామ సమయానికి 10-11తో వెనుకంజ వేసిన సింధు.. విరామం తర్వాత వరుస పాయింట్లతో 14-11తో ఆధిక్యం సాధించింది. 14-14తో జాంగ్ స్కోరు సమం చేసినా.. ఆ తర్వాత జోరందుకున్న సింధు ప్రత్యర్థికి ఎటువంటి అవకాశం లేకుండా 21-16తో తొలి గేమ్‌ను గెల్చుకుంది. రెండో గేమ్‌ను సింధు ఏకపక్షంగా నెగ్గింది. 5-5 తర్వాత జాంగ్ నుంచి ప్రతిఘటనే లేదు. 11-8తో విరామ సమయానికి ముందంజలో నిలిచిన సింధు.. 21-12తో రెండో గేమ్‌ను, ప్రీ క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకుంది.

# కివీస్ క్రికెట్ హక్కులు సోనీ సొంతం

NZC | SONY PICTURES NETWORKS

**హైదరాబాద్ :** న్యూజిలాండ్ క్రికెట్ ప్రసార హక్కులు సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా సొంతం చేసుకుంది. 2024 మే 1 నుంచి 2031 ఏప్రిల్ 31 వరకు ఏడేండ్ల పాటు భారత్, భారత ఉపఖండంలో టెలివిజన్, డిజిటల్ మీడియా హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా 2026-27, 2023-31 భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనలో టెస్టులు, వన్డేలు, టీ20లు ఆడనుంది. ఈ మ్యాచులన్నీ భారత్‌లో సోనీ నెట్‌వర్క్‌లో ప్రసారం కానున్నాయి. ఈ మేరకు సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఎన్‌పీ సింగ్ తెలిపారు.



రామ్‌చరణ్
కియారా అద్వానీ

# విజువల్ వండర్‌గా జరగండి.. సాంగ్

'జరగండి జరగండి జాబిలమ్మ జాకెట్టేసుకొచ్చేనండి' అంటూ ప్రేమికురాలు కియారా అద్వానీని చూసి హీరో రామ్ చరణ్ పాట పాడితే వినటానికి మనసుకి ఉత్సాహంగా ఉంటుంది. మరి దాన్ని సిల్వర్ స్క్రీన్‌పై శంకర్ లాంటి స్టార్ డైరెక్టర్ తెరకెక్కిస్తే చూడటానికి రెండు కళ్లు చాలవనేంత గొప్పగా ఉంటుందనటంలో సందేహం లేదు. రామ్ చరణ్, కియారా ఆటా పాట, తమన్ సంగీతం, శంకర్ మేకింగ్ స్టైల్లో వావ్ అనేలా తెరకెక్కిన ఈ పాటను చూడాలంటే 'గేమ్ ఛేంజర్' సినిమా వచ్చే వరకు ఆగాల్సిందేనంటున్నారు నిర్మాతలు దిల్ రాజు, శిరీష్. రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' చిత్రాన్ని అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై జీ స్టూడియోస్ అసోసియేషన్‌లో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. బుధవారం రామ్ చరణ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ సినిమా నుంచి 'జరగండి' అనే లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. 150 పైన థియేటర్స్‌లో ఈ పాటను ప్రత్యేకంగా ప్రదర్శించటం విశేషం.

# నయా షెడ్యూల్ షురూ..



వేణు దోనేపూడి, టీజీ విశ్వప్రసాద్

గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబోలో ఓ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. ఈ తొలి ప్రొడక్షన్ వెంచర్‌ను ఆయన చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై అత్యున్నత స్థాయి సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ సినిమా కోసం చిత్రాలయం స్టూడియోస్‌తో కలిసి పని చేస్తుంది. టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రానికి నిర్మాణ భాగస్వామిగా చేరారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంతో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. దీంతో టాకీ పార్ట్ మొత్తం పూర్తవుతుంది. నిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ, 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లాంటి పెద్ద బ్యానర్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. విశ్వప్రసాద్‌కి ధన్యవాదాలు. సినిమా చాలా అద్భుతంగా వస్తోంది. శ్రీను వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఈ సినిమాకి ఒక యూనిక్ పాయింట్ ఉంది.

# నవచిత్రం

## కుటుంబ విలువల్ని గుర్తు చేసే సినిమా



కేయూ మోహనన్

భారతీయ సినిమాటోగ్రాఫర్స్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు పొందారు కేయూ మోహనన్. 'డాన్, తలాష్, అంధధూన్' వంటి బాలీవుడ్ సూపర్ హిట్స్‌తో పాటు తెలుగులో మహేశ్ బాబు 'మహర్షి' సినిమాకు సినిమాటోగ్రఫీ అందించారు. ప్రస్తుతం హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రానికి సినిమాటోగ్రఫీ బాధ్యతల్ని నిర్వర్తించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో దిల్ రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రానికి పరశురామ్ పెట్ల దర్శకత్వం వహించారు. క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురాబోతున్నారు. ఈ నేపథ్యంలో కేయూ మోహనన్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఈ సినిమా అనేది ఒక బ్యూటిఫుల్ మూవీ. ఒక మిడిల్ క్లాస్ మ్యాన్ కథ. అతను ఫ్యామిలీ కోసం ఏం చేశాడు అనేది గుడ్ మెసేజ్‌తో ఉంటుంది. కాలనీ సెట్‌లో షూటింగ్ చేశాం. కథ, క్యారెక్టర్స్ ఎంత నేచురల్‌గా ఉన్నాయో దాన్నే రిఫ్లెక్ట్ చేసేలా విజువల్స్ తెరకెక్కించాను. డ్రోన్ షాట్స్ ఉండవు. లైటింగ్ కూడా సహజంగా చేశాం. ఒక మిడిల్ క్లాస్ ఇల్లు తెరపై చూస్తుంటే..ఇది మన ఇల్లులా ఉంది అనిపిస్తుంది. దర్శకుడు పరశురామ్ ఈ సినిమా నేపథ్యాన్ని సింపుల్ సెటప్‌లో క్రియేట్ చేశాడు. విజయ్, మృణాల్ నాకు ఎంతో సపోర్ట్ చేశారు.
- మనం నిర్లక్ష్యం చేస్తున్న ఫ్యామిలీ వ్యాల్యూస్ గురించి చెప్పే సినిమా ఇది. ఇండియా మొత్తం న్యూక్లియర్ ఫ్యామిలీస్‌గా మారిపోయాయి. కుటుంబ సభ్యులంతా కలిసి ఉండటం అనేది జరగడం లేదు. ఇలాంటి టైమ్‌లో మన ఓల్డ్ ఫ్యామిలీ వ్యాల్యూస్ గురించి డిస్కస్ చేసే సినిమా ఇది. దానితో పాటు మంచి ప్రేమ కథ కూడా ఉంటుంది. ఈ సినిమా పెద్ద సక్సెస్ అవుతుంది. ఎస్వీసీ సంస్థలో గతంలో పనిచేశాను. దిల్ రాజు సంస్థలో పనిచేయడం హ్యాపీగా ఉంది. నా కూతురు మాళవిక మోహనన్ తనకు తానుగా నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమె పేరు నేను ఏ సినిమాకూ రికమెండ్ చేయలేదు. విక్రమ్‌తో పా రంజిత్ రూపొందించిన 'తంగలాన్' మూవీ మాళవికకు మంచి పేరు తీసుకొస్తుందని భావిస్తున్నా.

# ప్రేక్షకుల్ని మెప్పించే సరికొత్త కాన్సెప్ట్



నాని మూవీ వర్క్స్, రామా క్రియేషన్స్ ఆధ్వర్యంలో విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. కొత్త కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ మూవీకి కథ, డైలాగ్స్, స్క్రీన్ ప్లే, దర్శకత్వం రమాకాంత్ రెడ్డి వహించారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈనెల 29న రాబోతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ చిత్ర ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించారు. హీరో సుమన్, నిర్మాత ఏ.ఎం.రత్నం ముఖ్య అతిథులుగా విచ్చేసి, చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

నిర్మాత డా.కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ,'నేను విద్యావేత్తగా ఇంజనీరింగ్ కాలేజీలను నిర్వహిస్తున్నాను. పిల్లల్లో ఉన్న ప్యాషన్‌కు ఓ ప్లాట్ ఫాం కల్పించాలనే ఉద్దేశంతోనే నాని మూవీ వర్క్స్‌ను స్థాపించాను. నేను ఉన్న, పెరిగిన ఊరుని తెరపై చూపించాలనే కోరిక ఉండేది. రమాకాంత్ రెడ్డి చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. మా టీజర్, ట్రైలర్ అందరికీ బాగా నచ్చాయి. సినిమా కూడా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'మా చిత్రం ఇంత త్వరగా పూర్తయి, రిలీజ్‌కు రెడీ అవ్వడానికి ఓబుల్ రెడ్డి కారణం. కథ, పాత్రలు, సంగీతం, ఫొటోగ్రఫీ.. ఇలా అన్ని బాగా వచ్చాయి' అని మరో నిర్మాత మహేశ్వర్ రెడ్డి చెప్పారు. మరొక నిర్మాత కాటం రమేష్ మాట్లాడుతూ,' దర్శకుడు రమాకాంత్, నాని సహకారం వల్లే సినిమా ఇంత బాగా వచ్చింది. విశ్వ కార్తికేయ, ఆయుషి పటేల్ చక్కగా నటించారు' అని తెలిపారు.

డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ, 'కలియుగం పట్టణంలో అజయ్ మంచి సంగీతాన్ని ఇచ్చారు. దేవీ ప్రసాద్ వంటి సీనియర్లను డైరెక్ట్ చేయడం, ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ వంటి వారితో పని చేయడం ఆనందంగా ఉంది' అని అన్నారు.

> ఇదొక యూనిక్ థ్రిల్లర్ మూవీ. మదర్ సెంటిమెంట్, థ్రిల్లర్‌ను కలిపి చేసిన ఓ డిఫరెంట్ సినిమా. ప్రతీ ఒక్క పాత్ర, ఎమోషన్‌కు డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. మా దర్శక, నిర్మాతల సహకారం వల్లే సినిమా బాగా వచ్చింది.
>
> - హీరో విశ్వ కార్తికేయ

# సమ్మర్ స్పెషల్‌గా విడుదల



డార్లింగ్ కృష్ణ, మిలనా నాగరాజ్

కన్నడ నిర్మాత, రచయిత, దర్శకుడు హీరో డార్లింగ్ కృష్ణ నటించిన చిత్రం 'లవ్ మోక్టైల్ 2'. ఈ మూవీ నుంచి 'ఎవరితో పయనం..' సాంగ్ రిలీజ్ చేశారు. ఈ సినిమాకి సంగీత దర్శకుడిగా నకుల్ అభయాన్కర్ మంచి మ్యూజిక్ అందించారు. ఈ పాటకి గురు చరణ్ లిరిక్స్ అందించగా, యోగి సురేష్ అద్భుతంగా పాడారు. డార్లింగ్ కృష్ణ గతంలో జాకీ, మధరంగి, రుద్రతాండవ, చార్లీ, లవ్ మాక్టైల్ వంటి సినిమాలతో బ్లాక్‌బస్టర్స్ అందుకున్నారు. ఈ సినిమాలో మిలిన నాగరాజ్, అమృత అయ్యంగర్, రచల్ డేవిడ్, నకుల్ అభయాన్కర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అలాగే తాను నిర్మాతగా, దర్శకుడుగా వ్యవహరిస్తూ, హీరోగా నటించిన 'లవ్ మోక్టైల్, లవ్ మోక్టైల్ 2' చిత్రాలతో కన్నడలో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్నారు.

ఇప్పుడు ఈ సినిమాని తెలుగులో కంచి కామాక్షి కోలకతా కాళీ క్రియేషన్స్ పతాకం పై ఎంవిఆర్ కృష్ణ నిర్మాతగా వ్యవహరిస్తూ మన ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'కన్నడలో బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన ఈ సినిమాని వేసవి సెలవుల్లో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాం. ఈ సినిమాకి సంబంధించిన టీజర్, ట్రైలర్, రిలీజ్ డేట్‌తో గ్రాండ్‌గా మీ ముందుకు వస్తాం' అని తెలిపారు.

# హర్రర్ థ్రిల్లర్స్‌లో స్పెషల్ సిరీస్ అవుతుంది



నవీన్ చంద్ర లీడ్ రోల్‌లో నటిస్తున్న వెబ్ సిరీస్ 'ఇన్స్‌పెక్టర్ రిషి'.

సునైన, కన్నా రవి, శ్రీకృష్ణ దయాల్, మాలినీ జీవరత్నం, కుమార్ వేల్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హర్రర్ క్రైమ్ కథతో ఈ వెబ్ సిరీస్‌ను నందిని జె.ఎస్. దర్శకత్వంలో మేక్ బిలీవ్ ప్రొడక్షన్స్ పై సుఖ్ దేవ్ లాహిరి నిర్మించారు.

అమెజాన్ ఒరిజినల్‌గా ఈ సిరీస్ ఈ నెల 29వ తేదీ నుంచి తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీలో స్ట్రీమింగ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డైరెక్టర్ నందిని జేఎస్ మాట్లాడుతూ, 'ఈ వెబ్ సిరీస్‌ను మొదట మేం తమిళం వరకే చేద్దామని అనుకున్నాం. కానీ మేకింగ్ అయ్యాక మొత్తం ఐదు భాషల్లో రిలీజ్ చేస్తున్నాం. ఈ సిరీస్‌లో ఏ కులాన్నీ, మతాన్నీ, ఎవరి విశ్వాసాలను కించపరిచేలా సన్నివేశాలు ఉండవు. ఈ సిరీస్ ట్రైలర్ రిలీజ్ అయ్యాక హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది' అని తెలిపారు.

'నేను హర్రర్ కంటెంట్ చేసి చాలా రోజులవుతోంది. ఈ వెబ్ సిరీస్ కథ విన్నప్పుడు ఇందులో హర్రర్, థ్రిల్లర్, సస్పెన్స్, యాక్షన్ ...లాంటి అన్ని ఎమోషన్స్ ఉన్నాయనిపించింది. ఈ కథలోనే కాదు నా క్యారెక్టర్‌లోనూ అనేక లేయర్స్ ఉంటాయి. హర్రర్ థ్రిల్లర్స్‌లో ఇదొక స్పెషల్ సిరీస్ అవుతుంది. 10 ఎపిసోడ్స్ సిరీస్ ఇది. ప్రతి ఎపిసోడ్ ముగిశాక నెక్ట్స్ ఏం జరుగుతుంది అనే క్యూరియాసిటీ ఏర్పడుతుంది' అని హీరో నవీన్ చంద్ర చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.